ప్రజాశక్తి

Vol. 1, no. (325)

(Nov. 3, 1946)

బెజవాడ, 1946

Record no. 683

Prajāśakti

Vol. 1, no. (325)

(Nov. 3, 1946)

Bejavāḍa, 1946

Record no. 683



ప్రజాశక్తి

కమ్యూనిస్టు దిన పత్రిక

నవంబరు దినోత్సవ సంచిక

చిటగాంగ్ విప్లవవీరుడు లాల్‌మోహన్ వీరమరణం

హిందూ ముస్లిం కలహాల్లో ఐక్యతకోసం

(మావిలేఖరి)

కలకత్తా, అక్టోబరు 31

చిటగాంగ్ విప్లవవీరుడు కామ్రేడ్ లాల్ మోహన్ సేన్ సాంద్వీప్‌లో హిందూ-ముస్లిం కలహాలను ఆపుటకై ప్రయత్నంచేస్తూ అదృశ్యుడైపోయాడు. ఆయన హత్యచేయ బడినాడనే భావించబడుతూంది. శవము దొరకలేదు.

చిట్టగాంగ్ ఆయుధాగారపు యుద్ధంనాటికి లాల్‌మోహన్‌సేన్ 16 ఏళ్ళవాడు. వయస్సుకు చిన్నఅయినా ఆపోరాటంలో పెద్ద బాధ్యతనే నిర్వర్తించాడు. చిట్టగాంగ్ రైలు మార్గాన్ని తెగగొట్టి అక్కడి ప్రభుత్వసేనలకు బయటినుంచి సహాయంరాకుండా చేసే బాధ్యత ఆయనకు వప్పజెప్పారు. మరి ముగ్గురు సహచరులతో ఆయన ఆ కర్తవ్యాన్ని విజయవంతంగా నెరవేర్చాడు.

విచారణకాలంలో ఆయనను ప్రభుత్వ సాక్షిగా మార్చేటందుకై ఎన్నో ఆశలు చూపారు. కాని లాల్‌మోహన్ లొంగలేదు. చివరకు ఆయనకు యావజ్జీవశిక్ష పడింది.

బెంగాల్ జైళ్ళలోనూ, అండమానల్లోను కూడా ఆయన ప్రభుత్వంతో పోరాటం ఆపలేదు. జైలుఅధికారుల దౌర్జన్యాలు. నిరశనవ్రతాల ఫలితంగా అనారోగ్యవంతుడయ్యాడు. జైలులోనే, మిగిలిన చిట్టగాంగ్ వీరులమాదిరిగా కమ్యూనిస్టుపార్టీసభ్యత్వం స్వీకరించాడు.

హిందూ-ముస్లిం ప్రజాందోళనం ఫలితంగా కామ్రేడ్ లాల్‌మోహన్‌సేన్ 1946 ఆగష్టు 3 న, 16 ఏళ్ళ అనంతరం విడుదల అయ్యాడు. విడుదలైననాటినుంచీ తనకు విముక్తినిచ్చిన హిందూ-ముస్లిం సోదరుల మధ్య ఐక్యతకై నిరంతరం పనిచేశాడు.

సాంద్వీప్‌లోని తన గ్రామంలో ఐక్య శాంతిరక్షణదళం ఆయన అధ్యక్షతను అక్టోబరు 1 వ తేదీ ఏర్పడింది. విడుదలైనది మొదలు ఏరోజూనా ఒకటి రెండు సభలకు తక్కువగా ఉపన్యసించలేదు.

ఈ కామ్రేడ్ నేడులేడు.

కాంగ్రెస్ లీగ్ నాయకుల బెంగాల్ పయనం

కలకత్తా, నవంబరు 2

బెంగాల్ పరిస్థితులను గురించి స్వయంగా తెలుసుకొనటకై తాత్కాలిక ప్రభుత్వ సభ్యులు పండిట్ నెహ్రూ, లియాకత్ అలీఖాన్, సర్దార్ పటేల్, అబ్దుల్ రబ్ నిష్తార్‌లు నేడు కలకత్తా వస్తున్నారు. తూర్పు బెంగాల్ సంచారం ముగించుకొని నెహ్రూ కలకత్తాలో ప్రభుత్వ సభ్యుల్ని కలుసుకుంటారని తెలుస్తూంది.

కలకత్తా పురవాసుల కోరికమీద మౌలానా అబుల్‌కలాం ఆజాద్‌కూడా నేడు కలకత్తాకు బయలుదేరుతున్నారు.

రైలు సౌకర్యాలు లేక పోవడంచేత మహాత్మాగాంధీ బుధవారం వుదయంవరకు తూర్పుబెంగాల్ పర్యటనకు బయలుదేరరు.

విచారణ జరపాలి

కృపలానీ ప్రకటన

న్యూఢిల్లీ, నవంబరు 1

కృపలానీ పక్షపాతంతోనూ బాధ్యతా రహితంగానూ ప్రకటనలు చేశాడని బెంగాల్ రాష్ట్రీయముస్లింలీగ్ తీర్మానం చేసింది. దానిని ఖండిస్తూ కృపలానీ ఇట్లు ప్రకటనచేశారు.

"ఆయాప్రదేశాలలో నిష్పాక్షిక విచారణ సంఘంచేత విచారణ జరిపిస్తే, సాక్ష్యం ఇచ్చేవారికి తర్వాత ప్రమాదాలు జరగకుండా రక్షణయిస్తే నా ప్రకటనల సత్యం బయట పడుతుంది."

రహదారీ పనివారిసమ్మె ముగింపు

కలకత్తా, నవంబరు 1

"పోలీసులు, మిలిటరీ తమకు, ప్రయాణీకులకు రక్షణ యివ్వడానికి పూచీపడటం చేత రేపటినుంచి సమ్మె మాని పనులలోకి వెళ్ళాలి" అని కలకత్తా మోటారు ట్రాన్సుపోర్టు పనివారి సమావేశంలో తీర్మానించబడింది.

ఇతర ప్రాంతాలలో

పాట్నా, నవంబరు 1

పాట్నాకు 19 మైళ్ళ దూరంలోవున్న తెరెగ్నా రైలుస్టేషనుపై దుండగీడులు దాడి చేసి 50 మందిని చంపారు. 75 గురిని గాయపరిచారు. మసూరీ గ్రామంనుంచి కిల్లోలాలకు భయపడి పారిపోయివచ్చిన జనం రైలుకోసం వేచియుండగా ఈదాడిజరిగింది.

నెల్లూరులో కర్ఫ్యూ ఉత్తర్వు

నెల్లూరు, నవంబరు 1

నెల్లూరు జిల్లా కలెక్టరు రావుసాహెబు టి.పి. రెడ్డిగారు నెల్లూరు పటణ సరిహద్దులలో ఎవరూ కర్రలుగాని, కత్తులుగాని, తుపాకులు గాని, తదితర ఆయుధాలుగాని పట్టుకొని తిరుగకూడదని క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ 144 వ సెక్షను క్రింద ఉత్తర్వును అమలు పరిచారు. అక్టోబరు 31 వ తేదీ మొదలు వారం రోజులపాటు ఈ ఉత్తర్వు అమలులో వుంటుంది.

రాత్రి 8 గంటలు మొదలు ఉదయం 6 గంటల వరకూ వారం రోజులపాటు కర్ఫ్యూ ఉత్తర్వునుకూడా కలెక్టరుగారు అమలులో పెట్టారు.

మద్రాసు జైళ్ళసంస్కరణ

తరగతుల విభజనను రద్దుచేశారు

మద్రాస్, నవంబరు 1

రాజకీయ ఖైదీలలో తరగతి విభజనను రద్దుచేస్తూ మద్రాస్ ప్రభుత్వం ప్రకటన చేసింది. ఇకముందు రాజకీయ ఖైదీలందరూ యూరపియన్ యుద్ధఖైదీల తరహాలో వుంచబడతారు. వారికి యిష్టంవచ్చిన పత్రికలు, పుస్తకాలు వారు తెప్పించుకోవచ్చు. తమ ఖర్చుమీద అదనపు ఆహారంకూడా తెప్పించుకోవచ్చును.

మద్రాసు మీదుగా తుపాను

మద్రాసు, నవంబరు 2

మద్రాసుకు ఆగ్నేయంగా రెండువందల మైళ్ళదూరంలో బంగాళాఖాతంలో తుపాను ప్రారంభమైంది. మద్రాసువేపుగా తుపాను గాలి వీస్తున్నది.

తెలంగాణాలో నవంబర్ 10న 'బాలేముల' దినం జరపండి

రావి నారాయణరెడ్డిగారి ప్రకటన

హైదరాబాదు, నవంబరు 1

ఆంధ్రమహాసభ ప్రధాన కార్యదర్శి, శ్రీ రావి నారాయణరెడ్డిగారిలా ప్రకటించుతున్నారు.

"సూర్యాపేట తాలూకాలోని బాలేము గ్రామంలో పోలీసుల కాల్పుల ఫలితంగా గార్లపాటి అనంతరెడ్డిగారు మరణించారు. ముగ్గురు ప్రమాదస్థితిలో నున్నారు. అనేకులు గాయపడ్డారు.

నల్లగొండజిల్లా పోలీసు మొహతెమీం (జిల్లాపోలీసు సూపరింటుండెంటు) నాయకత్వాన రిజర్వు పోలీసులు గ్రామాలపై దాడి చేస్తున్నారు. ప్రజలను నిర్దాక్షిణ్యంగా హింసిస్తున్నారు. కార్యకర్తలను అరెస్టు చేస్తున్నారు.

కాని ప్రజలు లొంగక వీరోచితంగా ప్రతిఘటిస్తున్నారు. ఈ ప్రతిఘటన ఫలితంగానే బాలేముల వీరుని మరణం.

ప్రభుత్వం మన తెలంగాణా ప్రజల స్వాతంత్ర్యోద్యమాన్ని అణచుటకై దాడి ప్రారంభించింది. ఈ దాడిని ఎదుర్కొనుటలో బాలేముల వీరులలో నొకరు మరణించారు. ఇతరులు ప్రమాదస్థితిలోనున్నారు.

నవంబరు 10 న తెలంగాణా అంతటా ఈ "బాలేములదినం" జరిపి, సూర్యాపేట తాలూకా వెనుక రాష్ట్రప్రజలందరం నిలబడి అన్నామని చాటండి.

బాలేముల అమరజీవులకు జోహారు లర్పించండి। వారిమార్గాన నడచి. మన ప్రజల స్వాతంత్ర్య సాధనకు పూనుకుంటామని ప్రతిజ్ఞ చేయండి।

బాలేముల దురంతాలకు కారకులైన అధికారుల బహిరంగ విచారణజరిపి శిక్షించమని చాటండి.

గ్రామగ్రామాన ప్రదర్శనాలు, సభలు జరిపి. తెలంగాణా ఆంధ్రుల ప్రజాశక్తిని ప్రకటించండి।।"



కమ్యూనిస్టుల భోగట్టా ఎందుకు?

మరొక రహస్య పోలీసు సర్క్యులర్

మద్రాసులో కాంగ్రెసు మంత్రివర్గం ఏర్పడి దాదాపు ఏడునెలలు గడచిపోయాయి. కాంగ్రెసుమంత్రివర్గం లంచగొండి ఉద్యోగులనుండి, పోలీసుదౌర్జన్యాలనుండి తమకు రక్షణయిస్తుందని ప్రజలు ఆశించారు. బ్రిటిషుసామ్రాజ్య ఏజెంట్ల పెత్తనానికి తుది దినాలు రానున్నాయని ఉవ్విళ్ళూరారు

కాని దురదృష్టవశాత్తు కాంగ్రెసుమంత్రుల హయాములో యింతవరకు అలాంటిదేమీ జరుగలేదు అన్నార్తులైన కార్మికులు జీతాలపెంపుదలకోసం సమ్మెచేస్తే పోలీసులు, యజమానులపక్షం వహించి కార్మికులపై లాఠీచార్జీలు, కాల్పులు చేస్తున్నారు. రైతులను, వారి భూములనుండి తొలగించడానికి జమీందారులకు పోలీసులు సాయపడుతున్నారు. అంటే సామ్రాజ్యవాదుల పరిపాలనలోవలెనే రైతులపైన, కార్మికులపైన దౌర్జన్యాలు కాంగ్రెసుమంత్రుల హయాములోకూడ సాగిపోతున్నాయి.

పోలీసు దౌర్జన్యాలను ఆపడానికి కాంగ్రెసు మంత్రివర్గం యింతవరకు ఏమీ చేయలేదు. పైగా రైతు-కార్మిక ఉద్యమాల పైన, ప్రజా సేవకులపైన నిఘావుంచాలని రహస్య పోలీసు సర్క్యులర్లు జారీ అవుతున్నాయి. విద్యార్థి కాంగ్రెసు వర్కర్లవంటి తీవ్రకాంగ్రెసు వాదులపైన, కమ్యూనిస్టుల పైన నిఘాను హెచ్చు చేయాలని పోలీసు డిపార్టుమెంటు పంపిన సర్క్యులరును మేము 16-10-46 పత్రికలో ప్రకటించాము. ఇపుడు ఇంకో రహస్య పోలీసు సర్క్యులర్‌ను క్రింద ప్రకటించుచున్నాము :—

1445/ M. D/ 15-10-46

అందరు జిల్లాపోలీసు సూపరింటెండెంటులకు, మద్రాసు పోలీసు కమిషనరుకు —

"రహస్య సర్క్యులర్"

వివరాలు వెంటనే పంపాలి.

(1) కమ్యూనిస్టుపార్టీ మెంబర్ల — నాయకుల — పూర్తి లిస్టు పంపాలి. వీలుగావుంటే ఒక కాపీ నిబంధనావళిని పంపండి.

(2) కమ్యూనిస్టుల పలుకుబడి క్రిందవున్న సంఘాలు, కమ్యూనిస్టులే నడుపుతున్న సంఘాల వివరాలు

(3) ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు-శాఖలు — వాటి అధ్యక్ష, కార్యదర్శులు

(4) కమ్యూనిస్టుపార్టీ ఆఫీసులెన్ని? ఎక్కడవున్నవి? వాటి పూర్తి చిరునామాలు. ఆఫీసుబాధ్యులు (నిర్వాహకుల), వారి ఆస్తిపాస్తుల వివరాలు

(5) సభ్యత్వచందా, సంవత్సర చందా ఇచ్చేవారి పేర్లు.

అధికంగా యిచ్చేవారిపేర్లు

(6) పార్టీపేపర్లు-లోకల్‌గావున్న ప్రెస్‌లు - పార్టీబడ్జెటులు - ఏరకంగా ఖర్చుపెట్టుతారు?

(7) లోకల్ పార్టీలవని

(8) కార్యదర్శి-కార్యనిర్వాహక వర్గం వివరాలు

(9) మామూలు సభ్యులు గాక ప్రధాన నాయకులపేర్లు

(10) కమ్యూనిస్టు ప్రచారకులు. కమ్యూనిస్టు-సోషలిస్టు ప్రచారకులు

పైవాటి వివరాలు సాధ్యమైనంత త్వరలో పంపాలి."

ఈ సర్క్యులర్‌ను గురించి ప్రత్యేకంగా వ్యాఖ్యానం చేయనవసరంలేదు. కాంగ్రెసు మంత్రివర్గం హయాములో పోలీసు డిపార్టుమెంటు యీవిధంగా ప్రజా సేవకులపై నిఘావేయడం నబబుకాదు. ఇది మన స్వాతంత్ర్యోద్యమ సాంప్రదాయాలకు విరుద్ధం.

స్వాతంత్ర్యంకొరకు పోరాడేవారంతా ఏకమయి బ్రిటిష్‌సామ్రాజ్యవాదుల పారదోలవలసినసమయంలో, స్వాతంత్ర్యోద్యమంలో ఒకభాగంపైన పోలీసు వేటకుక్కలను ఉసికొల్పడం క్షంతవ్యంకాదు. అందుచే వెంటనే కాంగ్రెసుమంత్రులు యిలాంటి అవసవ్య సర్క్యులరులను ఉపసంహరించుకోవాలి. అందుకు కారకులైనవారిని కఠినంగా శిక్షించాలి. అందుకొరకు ఆందోళనచేసి, మంత్రివర్గంపై ఒత్తిడితేవడం ప్రజల కర్తవ్యం: కాంగ్రెసువాదుల ధర్మం.ఏమంటారు?

నవంబరు 7

పీడితప్రపంచానికి దారిచూపిన సోవియట్ ప్రజలకు అభివందనాలు అర్పించుదాం

స్వతంత్రభారత్‌లో విశాలాంధ్ర ప్రజారాజ్యం నిర్మిస్తామని ప్రతిన బూనుదాం

1917 నవంబరు 7 వ తేదీన రష్యన్ క్రూయిజర్ 'అరోరా' పై వున్న ఫిరంగులు గర్జించాయి. విప్లవకారులు, ఎర్ర సైనికులు లెనిన్‌గ్రాడ్ నగరాన్ని వశం చేసికొన్నారు. సోవియట్ కార్మిక - కర్షక ప్రజారాజ్యాన్ని స్థాపించారు.

దానితో జమీందారుల - పెట్టుబడిదారుల శకం అంతమయింది. సోషలిస్టు విప్లవాల శకం ప్రారంభమయింది. ప్రపంచంలో ఆరో భాగంలో సుత్తి కొడవలి హత్తిన యెర్ర జెండా రాజ్యంచేస్తోంది.

అఖిలరష్యన్ సోవియట్ కాంగ్రెస్ నవంబరు 8 వ తేదీన సమావేశమయింది. యుద్ధం ఆపుజేసి శాంతిని స్థాపించాలని ప్రపంచప్రజలకు విన్నపంజేసింది. జమీందారీ విధానాన్ని రద్దుచేసింది. జారు, మఠాధిపతులు, జమీందారులు, భూస్వాముల చేతులలో వున్న 40 కోట్ల ఎకరాలభూమిని రైతులకు పంచిపెట్టాలని తీర్మానించింది. అడవులు, గనులు, జలాధారాలు వగైరా సహజ సంపదనంతా ప్రజాప్రభుత్వం హస్తగతం చేసికోవాలని ప్రకటించింది. లెనిన్ నాయకత్వాన తాత్కాలిక ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పరచింది.

సోవియట్ విజయాలు

ఆయన నాయకత్వాన సోవియట్ ప్రభుత్వము, కమ్యూనిస్టుపార్టీ ప్రజా విప్లవాన్ని సోవియట్ యూనియన్ నలుమూలలా వ్యాపింపజేసింది. ప్రపంచ సామ్రాజ్యవాదులందతో పరమ్మతులైన జమీందారులు, పెట్టుబడిదారులు జరిపిన విద్రోహాలను అణచివేసింది. వివిధజాతుల ప్రజలకు స్వయంనిర్ణయహక్కును యిచ్చింది. ఆర్థిక, రాజకీయ, వైజ్ఞానికజీవితంలో స్త్రీలకు, పురుషులకు సమానహక్కులనుయిచ్చింది. కష్టజీవులందరికి సంపూర్ణపౌరసత్వాలనుస్థాపించింది.

బ్యాంకులు, రైల్వేలు, నావలు, బొగ్గు, పెట్రోలు, ఉక్కు-ఇనుము వగైరా ముఖ్య పరిశ్రమలన్నిటినీ ప్రభుత్వం స్వాధీనం చేసికొంది. దోపిడీవిధానాన్ని రద్దుచేసి సోషలిస్టు ఆర్థిక విధానానికి పునాదులు వేసింది.

1918 జులైలో ప్రథమ సోవియట్ రాజ్యాంగం ఏర్పరచబడింది. అప్పటినుండి సోవియట్‌ప్రజలు తమరాజ్యాన్ని సామ్రాజ్యవాదుల దాడులనుండిరక్షించుకొన్నారు. పంచవర్షప్రణాళికలద్వారా పరిశ్రమలను, వ్యవసాయాన్ని, దేశసంపదను వృద్ధిచేసుకొన్నారు. నిరక్షరాస్యతను నిర్మూలించి, విద్యా విజ్ఞానాలను పెంపొందించుకున్నారు. ఒకప్పుడు 'జారు నిరంకుశత్వంక్రింద అణగారి వెనుకబడివున్న రష్యా. సోవియట్ ప్రజారాజ్యంతో సర్వతోముఖాభివృద్ధి చెందింది బ్రహ్మాండమైన పరిశ్రమలు నిర్మించబడ్డాయి. సమిష్టి వ్యవసాయ క్షేత్రాల ద్వారా వ్యవసాయం అనేకరెట్లు వృద్ధిచెందింది. సోవియట్ యూనియన్ పాడిపంటలతో, ధన ధాన్యాలతో, లలిత కళలతో విరాజిల్లుతూంది.

ఆర్థిక సంక్షోభంలో

ఈ విజయాలకు చిహ్నంగా 1936 డిశంబరు 6వ తేదీన'స్టాలిన్ రాజ్యాంగ'మని పిలువబడే నూతన రాజ్యాంగ ప్రణాళిక అములులోకి వచ్చింది. పెట్టుబడిదారీ ప్రపంచం ఆర్థికదుస్థితి, నిరుద్యోగ సమస్యలతో బాధపడుతోంటే సోషలిస్టు ప్రపంచం దినదినాభివృద్ధి గాంచింది. పెట్టుబడిదారీ ప్రపంచంలో ప్రజాస్వామిక హక్కులకు స్వస్తి చెబుతూ ఫాసిస్టు ప్రభుత్వాలు పెత్తనంలోకి వస్తూంటే, సోషలిస్టు ప్రపంచంలో ప్రజలందరికీ సమాన ఆర్థిక రాజకీయ హక్కులు ప్రసాదించే సోవియట్ ప్రజా స్వామికం స్థాపించబడింది. తద్వారా ఆర్థిక సంక్షోభం రోజుల్లో సోవియట్ రాజ్యాంగం యొక్క గొప్పదనం ప్రపంచానికి రుజువయింది.

ప్రపంచ సంగ్రామంలో

1939 లో రెండవ ప్రపంచ సంగ్రామం ప్రారంభమయింది జర్మనీ, జపాన్, ఇటలీ ఫాసిస్టు దుండగీడులవల్ల ప్రపంచ నాగరికతకే ముప్పు వాటిల్లింది. ప్రపంచ ప్రజలందరికి అరిష్టదాయకమైన యీ లోక విపత్తును సోవియట్ ప్రజారాజ్యం ఎదిరించి నిలచింది. కామ్రేడ్ స్టాలిన్ నాయకత్వాన ఎర్రసైన్యాలు, సోవియట్‌ప్రజలు చరిత్రాత్మకమైన త్యాగాలు చేశారు. దురాక్రమణదారులను ఓడించారు. లోకవిపత్తును తప్పించి ప్రపంచ ప్రజా విజయాన్ని సాధించారు.

దీనివల్లకూడ సోషలిస్టు సమాజంయొక్క శ్రేష్ఠత ప్రపంచ ప్రజలకు నిరూపించబడింది. పెట్టుబడిదారీ దేశాలలో ఆర్థిక దోపిడివల్ల క్రుంగిపోతున్న ప్రజాసామాన్యం-కార్మికులు రైతులు సోవియటు రాజ్యాన్ని ఆదర్శంగా ఎంచుతున్నారు. తమదేశాలలోకూడఅలాంటి ప్రజారాజ్యం స్థాపించుకోవడంకోసం కమ్యూనిస్టుపార్టీల నాయకత్వాన కృషిచేస్తున్నారు.

మిత్రరాజ్యసమితిలో

సామ్రాజ్యవాదుల పంకెళ్ళనుండివిముక్తి పొంది స్వాతంత్ర్యం స్థాపించుకోవాలని పోరాడుతున్న బానిసదేశాలలోని ప్రజలు కూడ నవంబరు విప్లవం సాధించిన విజయాలను గమనించు తున్నారు. మిత్రరాజ్య సమితిలో సోవియట్ ప్రతినిధులు బ్రిటిష్-అమెరికన్ సామ్రాజ్యవాదులు వలసదేశాలలో సాగించుతున్న దోపిడీని బట్టబయలు చేస్తున్నారు. బానిసదేశాల ప్రజల స్వాతంత్ర్యోద్యమాలను బలపరుస్తున్నారు. ఈవిషయాలుభారతదేశంవంటి వలసదేశాలప్రజలకు పీడిత ప్రజలకు సోవియట్‌రాజ్యం ఎల్లప్పుడూ అండగానిలబడుతుందని రుజువుచేస్తున్నాయి

స్టాలిన్ నాయకత్వాన సోవియట్ ప్రజలు సోషలిస్టు సమాజ సౌధ నిర్మాణాన్ని పూర్తి చేయడానికి కృషి చేస్తున్నారు. జర్మన్ దురాక్రమణ వల్ల జరిగిన నష్టాలను భర్తీ చేయడానికి, పరిశ్రమలను వ్యవసాయాన్ని పెంపొందించడానికిద్విగుణీకృతోత్సాహంతో పని చేస్తున్నారు. బ్రిటిషు - అమెరికన్ సామ్రాజ్యవాదులు మూడో ప్రపంచయుద్ధానికి దారితీయడానికి చేస్తున్న కుట్రలను బయటపెడుతున్నారు. ప్రపంచ శాంతిని కాపాడటానికి అవుసరమైన బలాధిక్యతను సంపాదించడానికి కృషి చేస్తున్నారు,

"శక్తికొలదీ పనిచేసి, అవుసరమైనంత అనుభవించడం" సాధ్యమయ్యే కమ్యూనిస్టు సమాజాన్ని నిర్మించడానికి సోవియటుప్రజలు ముందంజ వేస్తున్నారు.

ఈ నవంబరు దినోత్సవంలో పీడిత ప్రజలందరికీ మార్గం చూపిన సోవియట్ ప్రజలకుఅభివందనాలు తెల్పుదాం। సామ్రాజ్యవాదులను పారదోలి భారత స్వాతంత్ర్యం స్థాపించుకొంటామని శపథంచేద్దాం.స్వతంత్ర భారత భూమిలో విశాలాంధ్ర ప్రజా రాజ్యాన్ని నిర్మించుదామని ప్రతినబూనుదాం।

పర్వదినం

కోగంటి గోపాలకృష్ణయ్య

దిక్కులెల్లను పిక్కటిల్లె నానాదే
నవయుగారంభం - నాడు. అనాడే.
విప్లవోజ్జ్వలజ్వాల వినువీధి కెగయ
చిమ్మచీకటితెరలు చెదరిపోయాయి.
విప్లవంతెచ్చిందీ వీరలెదాక్ష్మీ
అంచులకు పొంగింది అనాడెవాల్గా.
సుత్తికొడవళ్లెత్తి, శక్తిచూపించి
దోపిడీదొంగలన్ దూపుమాపారు.
నిరంకుశత్వముకు పసిపీడనల్వముకు
మూలవిరాట్ 'జారు', నేలకొరిగాడు.
పాలకులగోరీలపై బాటవేసి
గగనవీధినితార, ధగధగా మెరసె.
పునాదులన్‌వేసె "అమరజీవి లెనిన్"
స్వర్ణపుటలన్ వ్రాసె. "జోసఫ్‌స్టాలిన్."
ఆశాసౌధంబు ఆకాశమంటె
కవికన్యపిలుపిచ్చె 'గోర్కీ' కినాడె.
కర్షకులస్వేదం, శ్రామికులరక్తం
ఫలితమారాజ్యం, భూతలస్వర్గం.
పీడితప్రజకెల్ల పర్వదినమదియె
ఆనాడు, నేడు "నవంబరేడు."

ఆశాజ్యోతి

సుంకర సత్యనారాయణ

కన్ను పొడిచినా
కనుపించని ఆ
కటిక చీకటిని
పటపట చీల్చుక
వెలుగుచు తూర్పున
సిలుగుల దీర్చే
వేగుచుక్క పొడిచిందోయ్
వెలుతురు లెగజిమ్మిందోయ్॥

రాక్షస శక్తికి
రాచరికానికి
తమ రక్తంబును
ధారాదత్తం
చేసి, కృశించిన
జీర్ణ శరీరాల్
కదనభూమి కురికినవోయ్
కత్తిమాసి పోరినవోయ్

విప్లవాగ్ని విను
వీధి కెగయగా
క్రూర ధనిక, జమీం
దారీ మృగములు
శలభంబులగతి
మలమల మలమల
మాడి దగ్ధమైనాయోయ్
మసి నుసియై పోయినవోయ్॥

ఎర్రని చీరె ధ
రించి, యుషఃకాంత
తామణి దాల్చిన
తామర పూవన,
కళకళలాడుచు
కిలకిల నవ్వుచు
భానుం డుదయించాడోయ్
బానిసత్వ మూడిందోయ్

నెత్తురు వరదకు
మెత్తగిలిన ఆ
నందనవనమున
అందచందముల
చిగురులు తొడిగీ
సొగసుగ పువ్వులు
పూసి పిందె వేసినవోయ్
కాసి ఫలాలిచ్చినవోయ్॥

బీదసాదలకు
పీడిత ప్రజలకు
ఆశాజ్యోతిగ
అమృతపు ఘడియగ
నవ్యోదయమై
నవంబ రేడై
వరుగున వచ్చెను లేవోయ్
పండుగజేదాం రావోయ్॥

నౌఖలీ దురంతాలు నేర్పే గుణపాఠం

నౌఖలీ జిల్లాలో నరకం ప్రత్యక్షమయింది. 500 చదరపుమైళ్ళ విస్తీర్ణంలో, లక్షమంది ప్రజలకు రక్షణ లేకుండాపోయింది. మానవజాతికే కళంకం తెచ్చే దారుణాలు జరుగుతున్నాయి. —దోపిళ్ళు, హత్యలు, ఇండ్లు తగులబెట్టడం, స్త్రీల నెత్తుకుపోవడం, బలవంతంగా మతం మార్చడం...ఎన్నో జరుగుతున్నాయి. ఇదివరకెన్నడూ మనదేశంలో ఇంత పెద్దఎత్తున ఇలాంటి దారుణాలు జరగలేదు. ఈ వార్తలు విన్న ప్రతి భారతీయుని గుండె జలదరిస్తోంది. భేదాభిప్రాయాలెన్ని ఉన్నా, ప్రతివారి హృదయం కంపిస్తోంది.

ఈ దౌర్జన్యాలకు గురిఅయిన అసంఖ్యాక ప్రజలకు కమ్యూనిస్టుపార్టీ సానుభూతి ప్రకటిస్తోంది. మరొక నౌఖలీ మనదేశంలో తిరిగి తలయెత్తకుండా చేయడానికి కమ్యూనిస్టుపార్టీ తన శక్తినంతనూ ఉపయోగించి పనిచేయాలని శపథం తీసుకొంటూంది. ఈ ప్రయత్నంలో హిందూ-ముస్లిం రైతాంగం కమ్యూనిస్టుపార్టీకి తప్పక సహాయం చేస్తుంది.

నౌఖలీ జిల్లాలో, ముస్లిం మూకల తీవ్ర దాడినుంచి తమతోటి హిందువుల్ని కాపాడిన ముస్లిం కుటుంబాలకు కమ్యూనిస్టుపార్టీ అభినందనలర్పిస్తోంది. అట్టి వారి వీరోచిత కృత్యాలను ప్రతిపాది పతులు బహిరంగ పరచలేము.

శాంతిని కాపాడేటందుకు చౌముహానీ పట్టణంలో కాంగ్రెసు, లీగ్, కమ్యూనిస్టు నాయకులు ఐక్య శాంతి రక్షణ కమిటీని ఏర్పరచి, కొట్లాటలు జిల్లాయందలి రెండవ భాగానికి వ్యాపించకుండా జాగ్రత్తలుతీసుకున్నందుకు, వారినికమ్యూనిస్టు పార్టీ అభినందిస్తోంది.

హాసనాబాద్ హిందూ — ముస్లిం రైతాంగం చూపిన ఆదర్శం

హాసనాబాద్‌లో హిందూ — ముస్లిం రైతాంగం అన్నదమ్ముల మాదిరిగా, దుండగీండ్రను పలుమార్లు తిప్పికొట్టి, తమ ప్రాంతానికి అగ్నిజ్వాలలు వ్యాపించకుండాచేశారు. వారి ఆదర్శాన్ని కమ్యూనిస్టుపార్టీ స్తుతించుతోంది. ఒకవైపు తాము దారిద్ర్యంతో బాధపడుతూ, మరొకవైపు వేలాది శరణార్థులకు వారు సహాయం చేశారు.

కలకత్తా కార్మికులు మార్గదర్శకు లయ్యారు

కలకత్తా కార్మిక సంఘాలలో సభ్యులైన హిందువులు — ముసల్మానులు, నౌఖలీ జిల్లానుంచి పారిపోయి వచ్చిన శరణార్థులకు రక్షణయివ్వడమే కాకుండా, వారి ఆకలిబాధ తీర్చి, కార్మిక కర్షక సహోదరతకు మార్గదర్శకులయ్యారు. వారందరికీ కమ్యూనిస్టుపార్టీ అభినందిస్తోంది.

కామ్రేడ్ ముజఫర్ అహమ్మద్ వయసులో పెద్దవాడె ఉండీ, స్వయంగా నౌఖలీ జిల్లాలో పార్టీ కార్యక్రమాన్ని నడిపేటందుకు వెళ్ళాడు. ఆయన కృషికి కమ్యూనిస్టుపార్టీ గర్విస్తోంది. హిందువులు - ముస్లింలు, సోదరులవలె, తమ ప్రాణాలనుకూడ లెక్కచేయకుండా, ఆయన నాయకత్వంక్రింద పనిచేస్తున్నారు. ఎంతో ప్రమాదకరమైన పరిస్థితులలో హిందువుల ప్రాణాలను కాపాడ్డం కోసం వారు తమ సర్వశక్తులు ధారపోస్తున్నారు. హిందువుల్లోను, ముస్లింలలోను యిట్టి అపూర్వ త్యాగశీలురు అనుచర వర్గంగాఉన్న బెంగాల్ నాయకుడు ఈయన ఒక్కడే.

కారుచీకట్లో కాంతిరేఖలు

నేడు అన్నివైపుల అలముకొంటూన్న కారుచీకట్లలో ఇట్టి ఉదాహరణలు కాంతిరేఖలవలె ప్రకాశిస్తున్నాయి. సంకుచిత సాంఘిక వర్గంలోను, ప్రజా ఉద్యమంలోను మాత్రమే యీ ఆదర్శాలు కనిపిస్తున్నాయి. దేశాన్ని అంతర్యుద్ధ జ్వాలల్లో దగ్ధంచేసేటట్టి శక్తులకు భారత విప్లవ శక్తులు చేసే సవాళ్ళు ఇవి. ఇవి మనలో పట్టుదల, మనో నిబ్బరం, ఆత్మ విశ్వాసం కలిగిస్తాయి.



పి. సి. జోషి

నౌఖలి ప్రాంతంలో జరిగే దురంతాలను గూర్చి ప్రతిరోజూ పత్రికలలో వార్తలు ప్రచురింప బడుతున్నాయి వాటికి బాధ్యులెవరు - అనే విషయంపై ప్రకటనలమీద ప్రకటనలు, వ్యాఖ్యానాల మీద వ్యాఖ్యానాలు వెలువడుతున్నాయి. వీటన్నిటిలోను, బ్రిటిష్‌వారు తటస్థ విధానం అవలంబిస్తున్నారనే ధోరణి స్పష్టంగా కనబడుతుంది. కాంగ్రెసువాదులు ముస్లింలీగుమీద, లీగర్లు కాంగ్రెసుమీద, తీవ్రమైన ఆరోపణలు చేస్తున్నారు. ఆవేశపూరితమైన ప్రకటనలు చేసుకుంటున్నారు. అసలు శత్రువు ఏ పక్షమూ వహించని తటస్థునివలె, తీర్పుచెప్పే న్యాయాధికారివలె, నటిస్తున్నాడు. ఈ కల్లోలాలకు మూలకారణమైన సామ్రాజ్యవాద నీతిని ఎవరూ చూడ్డంలేదు.

సామ్రాజ్య వ్యతిరేక ద్వేషాగ్ని

ఒక్కసారి కళ్ళుమూసుకొని, హిందువుల్లోను - మహమ్మదీయుల్లోను లోగడ వెల్లివిరిసిన సామ్రాజ్య వ్యతిరేక ద్వేషాగ్నిని, హిందూ-ముస్లిం ఐక్యతను జ్ఞప్తికి తెచ్చుకుందాం. కాంగ్రెసు, లీగ్ ఐక్యతకై ప్రజలు చూపిన ఆతృత గుర్తుకు తెచ్చుకుందాం. గాంధీ-జిన్నాలు కలుసుకున్నప్పుడు ప్రజల ఆనందం వర్ణనాతీతం. ఐక్యతకై వారుచేసిన ప్రయత్నం విఫలమయింది. ఎందుకు విఫలమయిందో కారణాలు తెలుసుకోవడం మవసరం. కాని, సామ్రాజ్యవాదులకు కావలసింది అది కాదు. కాంగ్రెసు - లీగ్‌ల మధ్య ఐక్యత కుదరకుండా ఉండడమే వారికి కావాలి. అనైక్యత ఐక్యతగా ఎక్కడ మారుతుందో అని వారు భయపడ్డారు.

కలకత్తా బొంబాయి నగరాలలో కొద్ది నెలలక్రితమే జరిగిన అపూర్వఘటనల నొకసారి జ్ఞాపకం చేసుకుందాం. కలకత్తాలో, ఆజాద్ హింద్‌ఫౌజు విడుదలకై హిందువులు - మహమ్మదీయులు కలిసి, అద్భుతమైన ఐక్యప్రదర్శనం చేశారు బొంబాయిలో, నావికుల తిరుగుబాటును బలపరుస్తూ, హిందువులు - మహమ్మదీయులు బ్రహ్మాండమైన హర్తాళ్ జరిపి, ప్రదర్శనంలో పాల్గొన్నారు. ప్రజల్లో విప్లవవెల్లువ ఎంత ఉన్నతస్థాయి చేరుకుందో, కలకత్తా, బొంబాయి నగరాల్లో జరిగిన ఆ ఐక్యతాప్రదర్శనం తెలియజేసింది. అనైక్యత నాయకుల్లోనే గాని, ప్రజల్లోకాదు - అని స్పష్టపరచింది.

బ్రిటిష్‌ప్లాను వెనుకనున్న రహస్యం

బ్రిటిష్ పాలకవర్గం పరిస్థితుల తీవ్రతను గమనించింది. తన ప్రణాళికను ప్రకటించింది. దేశం విప్లవ వెల్లువలో పడి కొట్టుకుపోకుండా, హిందూ-ముస్లిం కొట్లాటల్లో ఇరుక్కుపోతే, ఎంతమంచిది - అని ఆలోచించారు. విభజించి పాలించే తమ పాతపాలసీకి కొత్తరూపం యివ్వవలసిందని బ్రిటిష్ మంత్రులను పంపించారు వారొక ప్లాను తయారుచేశారు. దాని ప్రకారం, కాంగ్రెసు - లీగ్ విభేదాలు శాశ్వతంగా ఉంటాయి. తాము దేశాన్ని విడిచివెళ్ళడానికే సిద్ధంగాఉన్నట్లూ, అయితే ఎవరి చేతుల్లో అధికారం విడిచివెళ్ళాలో తెలియడంలేనట్లు, పైకి నటించవచ్చు. కాంగ్రెసు నాయకుల్నీ, లీగ్‌నాయకుల్నీ కూడా సామ్రాజ్యవాదులు తమవలలో వేసుకున్నారు. వారిచేత బ్రిటిష్‌ప్లానును అంగీకరింపజేశారు. కాంగ్రెసు నాయకులకు అది "స్వాతంత్ర్య ద్వారం" వలె కనిపించింది. లీగు నాయకులకు "పాకిస్థాన్ బీజం" వలె కనిపించింది.

నాయకుల పెనగులాట మూడోపార్టీ మధ్యవర్తిత్వం

కాంగ్రెసు నాయకులు, లీగ్ నాయకులు, బ్రిటిష్ ప్రణాళికను అంగీకరించిన తర్వాత, దేశంలో మనం చూచే దృశ్యం ఏమిటి? బ్రిటిష్ ప్రణాళిక తమ కనుకూలంగా ఉందని కాంగ్రెసు నాయకులు, కాదు మనకే అనుకూలంగా ఉందని లీగునాయకులు, పెనగులాడుతున్నారు. ఈ పెనగులాట తీవ్రమవుతున్నకొద్దీ బ్రిటిష్ పాలకవర్గానికి బలం చేకూరుతోంది. ఉభయపార్టీల మధ్య తగాదాలు తీర్చే న్యాయనిర్ణేతగా వారు నాటక మాడుతున్నారు. తమ సామ్రాజ్య ప్రయోజనాలకై, ముక్కుని ఎటుత్రిప్పితే మంచిదనుకుంటారో అటు త్రిప్పుతున్నారు.

మన ప్రధానరాజకీయపార్టీలు రెండూ తమ పలుకుబడిలోవున్న ప్రజాసామాన్యాన్ని ఒండొరులపైకి ఎంతఎక్కువగా రెచ్చగొడితే, అంత త్వరగా హిందూ-ముస్లిం ఐక్య సామ్రాజ్య వ్యతిరేక పోరాటాలు హిందు-ముస్లిం కొట్లాటలుగా మారుతాయి. ఉభయపార్టీలు బ్రిటిష్ సైన్యంయొక్క సహాయంకోసం ప్రాకేయ పడవలసివస్తుంది. దేశంలో "శాంతి"ని కాపాడ్డం కోసమే బ్రిటిష్ సేనలు ఉన్నట్టూ, తాము ఏపక్షమూ వహించనట్టూ, పైకి బ్రిటిష్ ప్రభుత్వం కనిపిస్తుంది; ఈవిధంగా, మన దేశంలో బ్రిటిష్ సేనలు శాశ్వతంగా ఉంటాయి.

దేశంలో నేడుజరిగే ఘటనలుచూస్తే, సరిగా యిదే కనిపిస్తుంది. కాంగ్రెసు నాయకులు, లీగ్ నాయకులు బ్రిటిష్ ప్లానును అంగీకరించారు. తర్వాత, అధికారపదవుల్లో ప్రవేశించడానికిఎత్తులు ప్రారంభించారు. కాంగ్రెసు మొదట తాత్కాలిక ప్రభుత్వంలో ప్రవేశించింది. ఆవిధంగా, ముస్లింలీగ్‌ను ఎత్తికొట్టినట్లు భావించింది. ముస్లింలీగ్ బయట ఉండి, "పోరాటం" "పోరాటం" అని ఒత్తిడితెస్తే బ్రిటిషు ప్రభుత్వం లొంగి వస్తుందని ఆశించింది. కాని, చివరకు, లీగ్‌కోరిన ఏకొత్తషరతులకూ వైస్రాయి అంగీకరించలేదు. ఇక లాభంలేదనుకొని, లీగ్‌కూడా ప్రభుత్వంలో ప్రవేశించింది. దేశం అంతర్యుద్ధజ్వాలల్లో భగ్గుమంది.

హిందూ—ముస్లిం కొట్లాటలు వ్యాపించ నీయడమే బ్రిటిష్ పాలసీ

హిందూ — ముస్లిం కొట్లాటలను అణచడంలో ఇటు బ్రిటిష్ వైస్రాయి, బ్రిటిష్ గవర్నరు, బ్రిటిష్ సైనికాధికారులు ప్రదర్శించే నిస్సహాయత చూడండి. అటు తిరువాన్కూర్ సంస్థానంలో సంస్థానప్రజల విప్లవపోరాటాన్ని అణచేటందుకు సంస్థాన ప్రభుత్వం మార్షల్ లా పెట్టడంలో ప్రదర్శించిన చురుకుతనం చూడండి. ప్రజలు ఒకరి గొంతుక లొకరు కోసుకొంటుంటే, నిస్సహాయత; కలిసి నిరంకుశ పాలనను ఎదుర్కొంటూంటే అణచివేయడం - ఇదే బ్రిటిష్‌వారి రాజనీతి. హిందూ—ముస్లిం కొట్లాటలను వెన్వెంటనే అణచడం కాకుండా, వ్యాపించనీయాలి—ఇదే నిరంకుశాధికారుల ఎత్తుగడ.

నౌఖలీ జిల్లాలో జరిగినది సరిగ్గా ఇంతే. నెలరోజులక్రితమే, బెంగాల్ అసెంబ్లీలో, రానున్న ప్రమాదంగూర్చి

(మిగతా 14 వ పేజీలో)

ఆర్థికమాంద్యంనుండి బయటపడటానికి
ప్రపంచ దురాక్రమణకు సిద్ధపడుతోంది అమెరికా

నేటి అంతర్జాతీయ ప్రాముఖ్య పరిస్థితి కంతకూ అతిప్రాముఖ్యమైన ఘటన ఒకటి అమెరికాలో జరిగింది. మే నెలలో ఎంతో ఉచ్ఛదశకు పోయిన సెక్యూరిటీ బాండుల విలువ ఒకసారి సెప్టెంబర్‌లో కూలిపోయింది. 300 కోట్ల పౌన్ల ఖరీదుచేసే సెక్యూరిటీ బాండుల విలువ పడిపోయింది.

తర్వాత రానున్న ఆర్థిక సంక్షోభాన్ని తెలియజేస్తూ 1929 లో కూడా ఇలాగే జరిగింది. కాని ఇప్పుడప్పుడే దీనిని దానితో పోల్చరాదు.

అమెరికాలో రెండేళ్ళలో ఎలాగూ ఆర్థిక మాంద్యం తప్పదని విషయజ్ఞులు లెక్కవేస్తున్నారు. కాని యుద్ధంముగిసిన సంవత్సరంలో ప్రజలు ఇలా గబగబా సెక్యూరిటీ బాండులను అమ్ముకోడానికి కారణం ఏమిటి? ఈ అపనమ్మకానికి కారణం ఏమిటి?

అమెరికా వర్తక వ్యాపారాలూ, పరిశ్రమలూ మంచి ఉన్నత స్థాయిలో ఉన్నాయి. టెక్నిక్ (ప్రావీణ్యత)లోనేమి, ఉత్పత్తిలోనేమి, వస్తుసముదాయ సంపదలోనేమి అమెరికా ఆకాశాన్ని అంటుకొంటోంది. ధరల కంట్రోల్‌కూడా తీసివేయబడింది.

అలాంటప్పుడు అమెరికా ప్రజలకింత భయందేనికి? అమెరికా ప్రజలు తాము ఎంతటి కుళ్ళు ఆర్థిక విధానం క్రింద జీవించుతున్నామో గ్రహించే వున్నారు.

యుద్ధం రేపోమాపో అనగానే, కార్మికవర్గం ఆదాయానికీ, పెట్టుబడిదారీవర్గ లాభాలకూ హస్తిమశకాంతరం వుంది. యుద్ధకాలంలో ఇది మరీహెచ్చింది. ప్రజానీకానికి అందకుండా ధరలు పెరుగుతున్నాయి. ప్రజల కొనుగోలుశక్తి తగ్గిపోతోంది.

యుద్ధకాలంలో ఉత్పత్తిశక్తి హెచ్చింది. ప్రజల కొనుగోలుశక్తి తగ్గింది. ముఖ్యంగా ధరలకంట్రోల్ తీసివేశాక ప్రజలకొనుగోలు శక్తి చివరి హద్దువరకూ వెళ్ళింది. కాని ఇంతకంటే మించడం అసాధ్యం.

అందుచే కుప్పతిప్పలుగా పడివుండే ఈ అదనపు ఉత్పత్తినంతా ఎగుమతి చేయడానికి అదుర్దా, ఇప్పటికన్న ఎన్నోరెట్లు హెచ్చుతుంది. దానితో విదేశాలపై దురాక్రమణచేసే పంథా మరింత తీవ్రమౌతుంది. ఆయుధ నిర్మాణానికీ - ఆవిధంగా యుద్ధానికీ దారితీస్తుంది. ఆధునిక అమెరికా పెట్టుబడిదారీ విధానంలో, అదిచేసే ఉత్పత్తినంతా వినిమయపరచడం యుద్ధంలోనే సాధ్యం.

అమెరికా నూతన సామ్రాజ్యవాదం

అందుచేతనే, అమెరికా ప్రస్తుతం నిర్దాక్షిణ్యమైన దురాక్రమణా విధానం అవలంబించుతోంది కొత్త మార్కెట్లకోసం ప్రతిదేశం గుమ్మం ముందు నిలబడి తలుపు తట్టుతోంది. తమ ప్రాబల్యాన్ని విస్తరింపజేసుకొంటోంది. ఒక ప్లాను ప్రకారం జరిగే ఆర్థిక విధానంపట్ల-ప్రభుత్వపరం చేయబడిన వర్తకంపట్ల - సోషలిజంపట్ల - అమెరికా నిప్పులు క్రక్కుతోంది. ప్రతి దేశ అంతర్గత విషయాలలో బాహాటంగా జోక్యం కలుగజేసికొంటోంది దాదాపు బడ్జెటులో సగభాగాన్ని సైనిక ఖర్చులకు ఉపయోగించుతోంది. అణుబాంబులను కూడబెడుతోంది ప్రపంచమంతటా సైనిక కేంద్రాలను నిర్మించుతోంది

"యుద్ధాన్ని ఆపేందుకు" అంటూ జాతీయ దురహంకార ప్రచారం సాగించుతోంది అమెరికాకు ప్రపంచాధిపత్యం కావాలని ప్రచారం విస్తృతంగా జరుగుతోంది.

అందువల్లనే అమెరికాలో కూడా అంతరంగిక పరిస్థితులు విషమించుతున్నాయి. ఒకప్రక్క ప్రజా అశాంతి, బ్రహ్మాండమైన సమ్మెలు. మరోప్రక్క అమెరికా ప్రజానీకంలో యుద్ధభయమూ వ్యాపించింది. [illegible]



రజనీ పామీదత్తు

కాని [illegible] ప్రపంచాన్ని అగ్నిగుండంలో పడవేస్తుంది

వాలెస్ హెచ్చరిక

ఈ సందర్భంలో వాలెస్ హెచ్చరిక గమనించాలి. సెప్టెంబర్ 12 న 10 వేల ప్రజలముందు వాలెస్ ఉపన్యాసం ఇచ్చాడు. ఒకప్రక్క సెక్యూరిటీబాండుల విలువ పడిపోవడంతోనే, ప్రపంచదృష్టిలో అమెరికా 'అభేద్యశక్తి'లో సత్తా ఏమిటో తెలిసిపోయింది. ప్రపంచాధిపత్యంకోసం అమెరికా చేసే కుయుక్తులవలన అప్రతిష్ఠ పాలయింది. ప్రభుత్వవర్గాలనుండి అమెరికా విధానాన్ని వ్యతిరేకిస్తూ మొదట బయటపడింది వాలెస్. బైర్న్స్-బెవిన్‌లు అవలంబించుతున్న సామ్రాజ్యవాద విధానాన్ని—సోవియటు వ్యతిరేక యుద్ధవిధానాన్ని అసహ్యించుకొనే అమెరికా ప్రజాభిప్రాయాన్ని వాలెస్ ఉపన్యాసం ప్రతిబింబించింది. వాలెస్ ఉపన్యాసాన్ని మొదట ట్రూమన్ బలపరచడం (తర్వాత బలపరచడం మానుకొన్నాడు) [illegible] గొంతుకు పట్టుకొంది. ఇతడు రిపబ్లిక్ పక్షానికి చెందిన అభివృద్ధి నిరోధకుడు. పారిస్ శాంతి సమావేశ ప్రతినిధులలో ప్రముఖుడు. తాము '[illegible] వారాలుగా' శాంతి సమావేశంలో [illegible] గంగలో కలిసిపోతున్నదని భయపడ్డారు. అందుచేతనే [illegible] వాలెస్ ఉపన్యాసానికి నిప్పులు క్రక్కారు. అమెరికా పాలకవర్గంలో, అది అవలంబించే విదేశాంగనీతిపట్ల అభిప్రాయభేదాలున్నాయని వాలెస్ స్పష్టపరిచాడు.

బ్రిటిష్ సామ్రాజ్యవాదనీతి అమెరికాను తిన్నగా యుద్ధపు సుడిగుండంలోకి ఈడ్చుకున్నదనేగాక, అమెరికా యుద్ధపుప్లానులను గూడా వాలెస్‌బయటపెట్టాడు. యూరప్‌పై దాడిచేయడానికి బ్రిటిష్ దీవులు అమెరికాకు మొదటిసైనిక కేంద్రాలు అని అతడు తెలియజేశాడు బ్రిటన్ అమెరికాలు తమ విమాన సైనిక కేంద్రాలతో ప్రపంచాన్ని చుట్టుముట్టాయనికూడా అన్నాడు. వాలెస్ ట్రూమన్‌కు వ్రాసినలేఖ తర్వాత ప్రచురించబడింది. అందులో బ్రిటిష్—అమెరికను సామ్రాజ్యవాదాల సోవియట్ వ్యతిరేక పంథా మరింత బయటపడింది.

అమెరికా ఎక్కడికిదారితీస్తోంది?

వాలెస్ ఉపన్యాసాన్ని మొదట ట్రూమన్ అంగీకరించాడు. ఆ ఉపన్యాసాన్ని తాను బలపరచననే ముందు, తన ఉద్దేశ్యాన్ని మార్చుకొనే ముందు, ట్రూమన్ బ్రిటన్‌కు ఒక హెచ్చరిక చేశాడు కూడా పడమటి ఆసియా ఖండంలో అమెరికా—సోవియటుల సహకారంతో గూడిన పంథాను అవలంబించుతామని ట్రూమన్ బ్రిటన్‌ను బెదిరించాడు.

కాని ఇది ఎన్నాళ్ళో నిలవలేదు. వాలెస్‌ను తాను బలపరచడం లేదని ప్రకటించాడు. వాలెస్‌ను బలపరచడం అంటే అమెరికా విదేశాంగనీతిని తల్లక్రిందులుగా మార్చడం అన్నమాట సోవియటుతో సహకారంకోరిన రూజ్‌వెల్ట్ పంథాను అవలంబించడం అన్నమాట. అలాచేసినపక్షంలో పెద్దపెద్ద రిపబ్లిక్‌పార్టీ పెట్టుబడిదార్లూ, డెమోక్రాట్ పక్షంలో మితవాదులూ గొంతు చించుకొని కేకలువేసేవారు. ఇంతమాత్రాన ఈసమస్య ముగిసింది అని భావించరాదు. వాలెస్ తర్వాత సమ్నర్‌వెల్స్ కూడా బైర్న్స్‌విధానాన్ని తీవ్రంగా ఖండించాడు. అందుచే ఈ విషయంలో స్పష్టంగా పాలకవర్గంలో విభేదాలున్నవని బయటపడుతుంది.

శాన్‌ఫ్రాన్సిస్కో సమావేశంలో, అమెరికా ప్రతినిధులు స్టెట్టినస్ నాయకత్వాన, ఈడెన్ చేతులలో కీలుబొమ్మలుగా వ్యవహరించారు. బ్రిటిషువారి సోవియట్ వ్యతిరేక విధానాన్ని గట్టిగా బలపరిచారు. కాని ఆ సమావేశం పూర్తికాగానే, తాము బ్రిటన్ పలుకుబడిక్రిందికి పోయామని అమెరికా గుర్తించి ఆ తర్వాత తన వైఖరిని సరిదిద్దుకుంది. అమెరికా చొరవవల్లనే ఆ తర్వాత మాస్కో సమావేశం జరిగింది. ఇలాంటి మార్పులు ప్రస్తుతయుద్ధానంతర అంతర్జాతీయ పరిస్థితులలో తప్పదు. ఒకసారి బ్రిటన్ మరొకసారి అమెరికా చొరవ తీసుకోడం తప్పదు. ఇంతేకాదు బ్రిటన్ సోవియటుల మైత్రిని వ్యతిరేకించే ప్రస్తుత బ్రిటిష్ విదేశాంగనీతిని పూర్తిగా ఉపయోగించుకొని, తర్వాత బ్రిటన్‌నుకాలదన్ని సోవియటుతో అమెరికా సంధికై ప్రయత్నించడంకూడా సాధ్యం కావచ్చు.

అమెరికాలోని అభ్యుదయ శక్తులు

వాలెస్ ఉపన్యాసం ఉత్త "ఎలక్షన్ స్టంట్" అంటూ బ్రిటిష్ ప్రభుత్వ పత్రికలు తేలికగా కొట్టివేశాయి. ఇదేనిజమైతే అర్థంఏమిటి? బ్రిటన్ — అమెరికాలు నేడు సోవియటును వ్యతిరేకించుతూ అవలంబించే విధానాన్ని అమెరికా ప్రజానీకం ద్వేషించుతోంది అన్నమాట. సోవియటుతో స్నేహంకావాలనికోరుతోంది అన్నమాట. ప్రజాఅభిప్రాయం అమెరికా పత్రికలు ప్రతిబింబించుతాయని ఇక్కడిపత్రికలు అంటున్నాయి. కాని పత్రికలలో చాలాభాగం పెద్దపెద్ద పెట్టుబడిదారీవర్గాలకు చెందియుండటంవల్ల అవి నిజం తెలియపరచవు. ఉదాహరణకురూజ్వెల్టు-డ్యూయీల పోటీ (అధ్యక్షపదవికి) తీసుకొందాం. డ్యూయీ సోవియటు వ్యతిరేక పంథాను అవలంబించిన వ్యక్తి. ఇతన్ని అమెరికాలో 100 కి 80 పత్రికలు సపోర్టుచేశాయి. కాని ఇతన్ని అమెరికన్ కార్మిక సంఘం (సి. ఐ. వొ), కమ్యూనిస్టుల చొరవతో పనిచేసే 'పొలిటికల్ యాక్షన్ కమిటీ' వ్యతిరేకించి ప్రచారంచేశాయి. డ్యూయీకి విరుద్ధంగా అమెరికా ప్రజలు ఎన్నికలలో వోటుచేశారు. రూజ్‌వెల్టును గెలిపించారు.

అయితే చర్చిల్‌ను ఎన్నికలలో ఓడించినా చర్చిల్ విధానాన్నే బెవిన్ బ్రిటన్‌లో కొనసాగించుతున్నాడు. అలాగే డ్యూయీ ఓడిపోయినా అతని పంథానే బైర్న్స్ అవలంబించుతున్నాడు. అభివృద్ధి నిరోధకులైన రిపబ్లికన్‌ముఠాకు ట్రూమన్ లొంగిపోయిననాటినుండీ అమెరికాలోని అభ్యుదయ వర్గాలలో గందరగోళమూ చీలికా హెచ్చింది.

అయినప్పటికీ, యుద్ధాన్ని వ్యతిరేకించే, ప్రజాతంత్ర అభ్యుదయ ప్రజాభిప్రాయాన్ని

(మిగతా 17 వ పేజీలో)

సరిహద్దులో సామ్రాజ్యవాదుల కుట్రలు

పఠానులలో చీలికలు కల్పించి తమ మిలిటరీ స్థావరాలను సుస్థిరం చేసుకోజూస్తున్నారు

నెహ్రూ వ్యతిరేక ప్రదర్శనాల అంతరార్థం ఇదే!

నెహ్రూ సరిహద్దులో కొండజాతులవారుండే ప్రాంతాలకు వెళతాడనే వార్త ప్రతి దేశభక్తుడ్ని పులకాంకితుడ్ని చేసింది. మనం సరిహద్దులోని కొండజాతివారిని మన దేశ ప్రజల్లో ఒక భాగంగానే భావిస్తున్నాం. బ్రిటిష్ విమానాలు వారిమీద బాంబులు వేశాయని విన్నప్పుడల్లా ఆగ్రహావేశాలతో దేశమంతా ఉడికిపోతూవుంది. ఈ "కొండజాతి సమస్య" అనేది సామ్రాజ్యవాదులు తెచ్చిపెట్టినదే అనే సంగతి ప్రతి దేశభక్తుడికీ స్పష్టంగా కనిపిస్తుంది.

పఠానుల ఐక్యత బ్రిటిష్‌వాళ్ళకి ముప్పు

ఎన్నో ఏళ్ళనుంచి సరిహద్దు పఠానులు మన స్వాతంత్ర్యపోరాటంలో ప్రథమశ్రేణిలో నిలబడుతున్నారు. అందుచేత వీరితో కొండజాతి పఠానులు కలవకుండా చేయడానికి సామ్రాజ్యవాదులు ఎల్లప్పుడూ ప్రయత్నాలు చేస్తూనే వున్నారు. కొండజాతివారు తమ సోదరులైన సరిహద్దు పఠానులతో కలవడమంటే మన స్వాతంత్ర్య పోరాటంలో ఒక అజేయమైన వీరసైనికదళం వచ్చి కలవడమన్నమాట. సామ్రాజ్యవాద పరిపాలనకు అంతిమదశ ఆసన్నమైందన్నమాట.

ఈ ఐక్యత ఏర్పడితే కొండజాతివారినుండి రక్షించడానికంటూ బ్రిటిష్‌వారు తమ సైన్యాన్ని అక్కడ వుంచడానికి అవకాశం వుండదు. ఈ వంకతో మన దేశాన్ని బంధించే సైనిక వ్యూహాలకు, మన పొరుగువారిపై దండెత్తే ఎత్తులకు స్వస్తి చెప్పవలసి వస్తుంది.

ఈ పరిస్థితుల్లో పండిత నెహ్రూ ఆ ప్రాంతానికి వెళ్ళడం సరిహద్దులో సామ్రాజ్యవాదుల మిలిటరీ స్థావరం ఎగరగొట్టడానికి మన స్వాతంత్ర్య పోరాటానికి రెండు వీర సైనిక దళాలు ఐక్యమవడానికి దారితీస్తుంది.

నెహ్రూకు "గుణపాఠం" నేర్పాలనుకున్నారు

ఈ ఐక్యత మన స్వతంత్రపోరాటానికి ఎంత ముఖ్యమో దానిని చెడగొట్టడంకూడ సామ్రాజ్యవాదుల కంత ముఖ్యం.

అందుచేతనే పొలిటికల్ డిపార్టుమెంటు, నెహ్రూను ఎలాగైనా ఆ ప్రాంతాలకు వెళ్ళకుండా చేయాలని తంటాలుపడింది. ఈ విషయం 17వ తేదీన పెషావరులో పత్రికా ప్రతినిధుల సభలో అబ్దుల్ గఫార్‌ఖాన్ బైట పెట్టాడు.

ఫ్రీప్రెస్ వార్తాసంస్థ ప్రకారం నెహ్రూను ప్రయాణం మానుకొనేటట్లు చేయడానికే, సరిహద్దు గవర్నరు ఢిల్లీకి పరుగెత్తినట్లు తెలుస్తోంది.

పండిట్‌జీ చక్కగా వీరి "సలహాల"ను త్రోసిపుచ్చి తన కార్యక్రమం సాగించాడు.

తమ మాటలు వినకుండా నెహ్రూ స్వతంత్రించి తన ప్లానుతో ముందుకు పోయినందుకు ఆయనకు "గుణపాఠం" నేర్పాలని వారాలోచించారని డాక్‌షాఖాన్ అన్నాడు.

కాని ఇందులో కేవలం కక్ష సాధించడమొక్కటేకాదు సామ్రాజ్యవాదుల ఆశయం. నెహ్రూ సంచార కార్యక్రమమంతా అల్లరి కావాలి. సరిహద్దు పఠానులతో కొండజాతివారి ఐక్యత కుదరకూడదు. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే కొండజాతివారి అల్లరులు అణచడానికి అక్కడ బ్రిటిష్ సైన్యం ఉండవలసిన అగత్యం వుందని ప్రపంచం అనుకోవాలి. ఇదీ వారి ఆశయం.

ఇదివారికి పెద్ద కష్టసాధ్యమైన పనేమీ కాదు. ఎందుకంటే, నెహ్రూ పర్యటనకు చేయవలసిన ఏర్పాట్లన్నీ పొలిటికల్ డిపార్టుమెంటు చేతులలోనే వదిలిపెట్టారు. ఈసంగతి తన ప్రకటనలో నెహ్రూయే అంగీకరించాడు.

పొలిటికల్ డిపార్టుమెంటు ఆఫీసర్లయిన తెల్లదొరలు ప్రయాణంలో నెహ్రూతో నడచినాగాని ప్లానుల్లోమాత్రం నెహ్రూకంటె ముందే వున్నారు. ప్రతివిషయం వివరంగా ప్లాను తయారుచేసి వుంచారు. వారి వ్యూహంలో నెహ్రూ కేవలం ఒకపాత్రధారిగా మాత్రమే తిరిగాడని చెప్పాలి.

పర్యవసానం మనం చూశాం. ముందుగానే పాఠాలునేర్పి తయారుచేసిన జిర్గాల (సభల) తతంగాలు, రాళ్ళువిసరడాలు, తుపాకుల కాల్పులు మొదలైన నిగ్గుమాలిన చర్యలన్నీ మనం చూశాం.


రమేష్ చంద్ర

కొత్త ఎత్తులు

ఈనాటకానికి డైరెక్టర్లు చాలా తెలివిగల వాళ్ళు. కొండజాతుల్లో ఇదివరకే విభేదాలు కల్పించారు. ఒకచిన్న ముఠా బ్రిటిష్‌వాళ్ళకి తొత్తులుగా పనిచేస్తోంది. మిగిలిన వారిలో అధికసంఖ్యాకులు సరిహద్దులోని రెడ్‌షర్టు ఉద్యమంపట్ల సానుభూతిగలవారు. వీరు ఎక్కువగా బ్రిటిష్ వ్యతిరేక స్వభావం గల్గి వున్నారు. వీరికి, బ్రిటిష్ తొత్తులైన మైనారిటీ ముఠాకీ ఎప్పుడూ పడదు. ఈ స్పర్ధలే ఇప్పుడు రెచ్చగొట్టి ప్రదర్శించితే తమపని అంతబాగా నెరవేరుతుందని పొలిటికల్ డిపార్టుమెంటు గ్రహించింది.

అందుచేత తమ తొత్తుల ముఠాను ఒక్కసారిగా ముస్లింలీగ్‌ను బలపర్చేవారినిగాను, పాకిస్తాన్ వాదులుగాను బనాయిస్తే కాంగ్రెస్-లీగ్ స్పర్థలను మరింత ఎక్కువ చేయవచ్చు. తమ పని బాగాసాగుతుందని ఆలోచించారు.

అందుకనే, బ్రిటిష్‌వాళ్ళ దళ్ళుతినే మాలిక్ జాతివాళ్ళంతా "మాకు జిన్నాకావాలి; పాకిస్తాన్ కావాలి" అనే నినాదాలివ్వటం జరిగింది.

ఈ కుటిల తంత్రాలన్నీ అబ్దుల్ గఫార్ ఖాన్ చక్కగా గ్రహించాడు. "పఠానులలో అంతర్యుద్ధం రెచ్చగొట్టడానికి పొలిటికల్ డిపార్టుమెంటు పన్నాగాలు పన్నుతోంది" అన్నాడు.

తెల్ల ప్రభువులింకోటికూడా అనుకున్నారు. ఇప్పుడు కొంతమంది కొండజాతులవారి చేతుల్లోని లీగుపతాకం సరిహద్దులో జరిగే బ్రిటిష్ వ్యతిరేక పోరాటంనుండి భారతదేశ దృష్టిని మరలించుతుంది. సరిహద్దు సమస్య కూడా భారతదేశమంతటావున్న కాంగ్రెసు-లీగు సమస్యలాటిదే అనే భావం కలిగించుతుంది అనివారి అంచనా.

ఈ దుర్మార్గపు ప్లానులవల్లనే నెహ్రూ సంచార కార్యక్రమంలో ప్రతి అంశమూ ఏర్పాటు చేయబడింది.

పఠానులలో ఎన్నో ఏళ్ళనుండి ఈపొలిటికల్ డిపార్టుమెంటుచేసే కుతంత్రాలన్నిటిని [illegible] గ్రహించాడు. తన ఆత్మతో ప్రసిద్ధ [illegible], కమిటీ సభ్యులు, ఈ దాళ్ళ విసరడాలు, ఈ తుపాకి కాల్పులు అన్నీ పొలిటికల్ డిపార్టుమెంటువారు ప్లాను వేసినవే అని కుండ బద్దలుగొట్టాడు.

డాక్‌షాఖాన్ కూడ ఇలా అన్నాడు.

"నేనీ కుట్రలన్నీ గ్రహించాను. వారు మమ్మల్ని చంపాలనే చూశారు. మాపై జరిగిన ఈ హత్యా ప్రయత్నానికి నైతికంగా ప్రతి బ్రిటిష్ పౌరుడు బాధ్యుడవుతాడు."

ఇవంతా తెలిసికొనే 18వ తేదీన రజ్మక్‌లో ఏర్పాటుచేయబడినసభలో మాట్లాడానికి డా॥ ఖాన్‌సాహెబ్ నిరాకరించాడు. ఆ మీటింగుకు వచ్చిన వారంతా పొలిటికల్ డిపార్టుమెంటుచే ముందే ఏర్పాటు చేయబడ్డారన్నాడు. ఈమాటలకు పొలిటికల్ డిపార్టుమెంటు ఆఫీసర్లు అసమ్మతి తెల్పారు. అలాంటిది జరగలేదని హామీ ఇస్తామన్నారు. కాని నెహ్రూ మాత్రం ఇలా అన్నాడు. "ఇవంతా ముందేప్లాను వేసి చేసినదైతే ఈ విషయమై తప్పక దర్యాప్తు జరగాలి."

తిరుగులేని సాక్ష్యం

నెహ్రూకు ఈ ధర్మ సందేహం రావడం ఆశ్చర్యకరంగానే వుంది. ఖాన్ సోదరులిచ్చిన సాక్ష్యాలు పండిట్‌జీకి చాలకపోతే ఈ క్రింది విషయాలు గమనించటం మంచిది.

● నిజమైన బ్రిటిష్ వ్యతిరేక కొండజాతులవారంతా సరిహద్దురాష్ట్ర రెడ్‌షర్టు ఉద్యమంపట్ల ఎల్లప్పుడూ సానుభూతితోనే వున్నారు. స్నేహ భావంతోనే వున్నారు. ఇప్పుడు ఏర్పాటు చేయబడిన జిర్గాలకు (సభలకు) వారెవరు హాజరుకాలేదు.

అంతేకాదు. ఈమధ్య బ్రిటిష్‌విమానాలచే బాంబు చేయబడిన షాబికెల్ గ్రామాల ప్రజలు పండితనెహ్రూకొక జాబువ్రాశారు. ఆ లేఖలో తాము నెహ్రూను కలుసుకోవాలని చాలాకుతూహల పడుతున్నామనీ, కాని "కొన్ని కారణాలచే" కలుసుకోలేక పోయామనీ వ్రాశారు. నెహ్రూగారిని వారు ఆహ్వానించారు. తమపట్ల నెహ్రూకున్న అభిమానానికి అభివందనాలు తెల్పారు.

ఇదేవిధంగా మరికొన్ని జాతులవారు కూడా నెహ్రూను తమవద్దకుఆహ్వానించారు. కాని ఈ పొలిటికల్ డిపార్టుమెంటు ఉద్యోగులెవరూ లేకుండానే ఆయన ఒక్కడినే రమ్మని కోరారు.

● అసోసియేటెడ్ ప్రెస్ పంపిన వార్తలన్నీ నెహ్రూపై వ్యతిరేకంగా కల్పించి పంపినవే.

● పత్రికా ప్రచురణకుకూడా పెద్ద ఏర్పాట్లు చేయబడ్డాయి. అభివృద్ధినిరోధక వార్తలల్లడంలో పేరుమోసిన ఆల్ఫ్రెయిటార్స్ లాంటి విదేశ పత్రికావిలేఖరులు ప్రత్యేకంగా ఆహ్వానించబడి నెహ్రూతోపాటు తిరిగారు.

● న్యూఢిల్లీలోని బ్రిటిష్‌అధికార్లు [illegible] కోసంగా పత్రికా విలేఖరుల సమావేశాలు జరిపి, కొండజాతి ప్రజలతో స్నేహసంబంధాలు ఏర్పరచుకోవడం కుదరదనీ, పొలిటికల్ డిపార్టుమెంటు అవలంబించే పాలసీయే సరియైన మార్గమనీ ప్రకటనలుచేయడం మొదలుపెట్టారు.

ముస్లింలీగ్ భ్రమ

బ్రిటిష్‌వాళ్ళ కపటనాటకమంతా స్పష్టంగా వుంది. ఇదిచూచి, లీగ్‌నాయకులు తామేదో అక్కడ పలుకుబడి సంపాదించి లాభం పొందగలమని అనుకుంటే అంతకంటె తెలివితక్కువ ఏదీ వుండదు. సరిహద్దు రాష్ట్రంలో సామ్రాజ్యవాదులు తమ నమ్మిన బంట్లనే లీగులో ప్రవేశపెట్టారు. పఠానుల స్వాతంత్ర్యోద్యమాన్ని సదా వ్యతిరేకించే వారినే లీగులోకి దూర్చారు.

బ్రిటిష్‌వారి దళ్ళుతిన్న కొద్దిమంది కొండజాతివాళ్ళ నేడు "పాకిస్తాన్ కావాలి" అని అరుస్తూ లీగు భక్తులయారని ఏ లీగు సభ్యుడయినా భ్రమపడితే పడొచ్చు. కాని వారొక సంగతి గమనించాలి. ఈ కొత్తభక్తులవల్ల స్వాతంత్ర్యంకోసం పోరాడే పఠాను జనసామాన్యం లీగు ఆశయానికి మరింత దూరమౌతుందేగాని దగ్గరకుచేరదు.

ఈ ఘటనలనుబట్టి కాంగ్రెసువాదులు కూడా ఒక సత్యాన్ని గుర్తించాలి. తాత్కాలిక ప్రభుత్వానికిచ్చిన అధికారాలు ఏమీ లేవు. ఇండియాను వదలివెళ్ళిపోతామని సామ్రాజ్యవాదులు చెప్పే పెద్ద కబుర్లన్నీ వట్టి బూటకం.

అదొక్కటేకాదు, వారు ఇంకో విషయం కూడా తెలుసుకోవాలి. కొండజాతులవారి సహకారం, స్నేహం సంపాదించాలంటే కేవలం మాటలలో సానుభూతి తెల్పడం చాలదు. వారు ఈపొలిటికల్ డిపార్టుమెంటు బంధాలను తెంచుకుని మన స్వాతంత్ర్యోద్యమంలోకివచ్చి చేరేటట్లు, వారికి బలాన్ని, ధైర్యాన్ని కలిగించేందుకు ఆచరణలో నిర్దిష్టమైన కార్యక్రమాన్ని అనుసరించాలి.

నెహ్రూగాని, ఇతర కాంగ్రెసువాదులుగాని బ్రిటిష్ విమానాలు, బ్రిటిష్ తుపాకులను రక్షణపెట్టుకొని వారివద్దకు వెళ్ళినంతకాలం కొండజాతి ప్రజలు ఈనాయకులను నమ్మరు. కాంగ్రెసుతోవచ్చి కలవరు. ఎందుకంటే, ఈ తెల్లదొరలే, ఈ తుపాకులే, ఈ విమానాలే వారిని నిత్యంకాల్చి చంపుతున్నాయి.

అందుచేత వారి గర్భశత్రువులైన ఈ పొలిటికల్ డిపార్టుమెంటుతో కాంగ్రెసు నాయకులు సంబంధాలు తెంచుకోవాలి. ఆనాడే ఆ వీరజాతి, ఆ అజేయ సైనికదళంవచ్చి మన స్వాతంత్ర్య పోరాటంలో చేరుతుంది. సరిహద్దులో సామ్రాజ్యవాదుల స్థావరాన్ని శాశ్వతంగా నిర్మూలిస్తుంది.

ఆంధ్రరాష్ట్ర నిర్మాణం: ఇంగ్లీష్ సామ్రాజ్యవాదుల కు

ఆంధ్ర కాంగ్రెసు నాయకుల ధోరణి

(3)

పుచ్చలపల్లి సుందరయ్య

గత రెండు వ్యాసాలలో, ఇంగ్లీషు సామ్రాజ్యవాదుల కుట్రల, భాషాప్రయుక్త రాష్ట్రనిర్మాణానికి వారి వ్యతిరేకత, అఖిలభారత కాంగ్రెసు నాయకులు ఇంగ్లీషు సామ్రాజ్యవాదులతో రాజీపోకడల నవలంబిస్తూ, భాషాప్రయుక్త రాష్ట్ర నిర్మాణానికికూడ వాయిదా వేయడానికి ఏ రీతిగ తయారవుతున్నారో చూశాం. ఈ వ్యాసంలో ఆంధ్ర కాంగ్రెసు నాయకుల ధోరణి ఏమిటో చూద్దాం. మన ప్రజలేమి చేయవలసి ఉంటుందో చూద్దాం.

ఇంగ్లీషు సామ్రాజ్యవాదుల ఎత్తులను ఖండించడంలేదు

ఆంధ్రరాష్ట్రాన్ని ఏర్పరచాలంటూ గత 30 సంవత్సరాలుగ ఆందోళన చేస్తున్న ఆంధ్ర కాంగ్రెసునాయకులు, ఇంగ్లీషు సామ్రాజ్యవాదుల కుట్రను బట్టబయలుచేసి ఖండించడంలేదు. ఇంగ్లీషు ప్రభుత్వం సూచించిన రాజ్యాంగ నిర్మాణసభ, దానిపై భాషాప్రయుక్త రాష్ట్రనిర్మాణం సాధ్యంకాదంటూ ఇంగ్లీషు సామ్రాజ్యవాదులు నమ్మినబంటు సర్. బి. యన్. రావు పంపిన నివేదిక, ఇదంతా మనలనుచీల్చి తగాదాలు పెట్టుతూ, ఇంగ్లీషువారి పెత్తనాన్ని సంస్థానాధీశుల పెత్తనాన్ని మామూలుగానే సాగించే కుట్ర అని ఎత్తిచూపడంలేదు.

రాజ్యాంగ నిర్మాణసభకై విశ్వనాథంగారి ఆశ

ఇంగ్లీషు సామ్రాజ్య వాదుల కుట్రను గ్రహించలేకపోబట్టే. బి. యన్. రావు నివేదికను విమర్శిస్తూ తెన్నేటి విశ్వనాథంగారు యిలా వ్రాశారు. "బి. యన్. రావు ఇటువంటి మహాగొప్ప సూచనలు ఎందుకు వ్రాయవలసివచ్చిందో తెలియదు. కానీ, వారి మనస్సులో ఉన్నటువంటి విజ్ఞానాన్ని వెలిబుచ్చడం కోసం వ్రాసిఉంటారు" తన విజ్ఞానాన్నంతా సామ్రాజ్యవాదులకు అమ్ముకొనిన బి. యన్. రావు సామ్రాజ్యవాదుల ప్లానును మన ప్రజలచే ఒప్పించడానికి పూనుకున్నాడని విశ్వనాథంగారు తెలుసుకుంటే మంచిది.

రాజ్యాంగ నిర్మాణసభ సర్వ స్వతంత్రమయినది. అది కొత్త రాష్ట్రాలను ఏర్పరచగలదు. ఆకొత్త రాష్ట్రం రాజ్యాంగాన్నికూడ నిర్ణయిస్తుంది. ఈనిర్ణయాలననుసరించి ఎన్నికలు జరుగుతాయి అని విశ్వనాథంగారు ఆశిస్తున్నారు.

ప్రస్తుతం ఏర్పడిన రాజ్యాంగనిర్మాణసభ సర్వస్వతంత్రమయినది కాదు. ఇంగ్లీషు సామ్రాజ్యవాదులు పెట్టిన హద్దులలో నడిపించడానికి వారు విశ్వప్రయత్నాలుచేస్తారు. కాంగ్రెసు-లీగు తగాదాలద్వారా తమప్లానును నెగ్గించుకోవాలని ఇంగ్లీషు సామ్రాజ్యవాదులు చూస్తున్నారు. వారి యెత్తులను భగ్నం గావించి, రాష్ట్రనిర్మాణాన్ని, స్వతంత్ర విశాలాంధ్రనిర్మాణాన్ని సాధించాలంటే, ఇంగ్లీషు సామ్రాజ్యవాదులతోను, వారి తాబేదారులైన సంస్థానాధీశులతోను రాజీ సంప్రదింపులు మానివేసి హోరాహోరిగ పోరాడాలి. యీ సత్యాన్ని ఎంత త్వరగా గ్రహించితే ఆంధ్ర రాష్ట్ర నిర్మాణం అంత త్వరగా సాధ్యమవుతుంది.

1935 ఇంగ్లీషు ప్రభుత్వ చట్టం ద్వారా రాష్ట్రనిర్మాణం చేస్తారట

కళా వెంకట్రావుగారు అక్టోబరు 13 ఆంధ్రపత్రికలో ఇలా వ్రాశారు: "భాషాప్రయుక్తరాష్ట్ర విభజన అవశ్యకతనుగురించి ఇంత వాదిస్తున్నప్పటికీ మన రాజ్యాంగ వేత్తలకు ఏమైనా శంక ఉన్నట్లయితే, ప్రస్తుతం అధికారంలోఉన్న కేంద్రప్రభుత్వం ద్వారాగాని, లేక రాజ్యాంగ పరిషత్తుద్వారాగానే గాని మీ మాటలకు అర్థమేమిటో చెప్పవలసిందని ఇంగ్లీషుమంత్రులనే అడిగి తెలుసుకోవచ్చునట. భాషాప్రయుక్తరాష్ట్ర విభజనకు ఏవైనా అడ్డంకులూ, అవాంతరాలూ వున్నట్లయితే వారిచేతనే వాటిని తొలగింపచేసుకోవచ్చునట.

కళా వెంకట్రావుగారు ఇంతటితో ఆగలేదు. రాజ్యాంగ నిర్మాణసభకు భాషాప్రయుక్తరాష్ట్ర విభజన చేయడానికి హక్కులేకపోతే 1935 చట్టం ప్రకారం రాష్ట్ర నిర్మాణానికి పనిచేయమంటున్నాడు. ఇప్పుడున్న రాష్ట్ర శాసనసభలే తీర్మానంచేసి, కేంద్ర ప్రభుత్వంచేతకూడ, ఢిల్లీ శాసన సభలలో కూడ ప్యాసుచేయించి ఇండియా మంత్రికి పంపమనికోరుతున్నాడు. ఆరకంగా తీర్మానాలుచేసి పంపితే ఇండియా మంత్రి అంగీకరిస్తాడని ఆశ; 1938లో ఇండియా మంత్రి ఇట్టి తీర్మానాన్ని బుట్టదాఖలు చేశాడన్న సంగతి మరచిపోయాడు.

భాషాప్రయుక్తరాష్ట్ర విభజన చేయడమంటే ఇంగ్లీషు సామ్రాజ్యవాదులు మనలో చీలికలుపెట్టడానికిఉపయోగించే ఒకసాధనం పోగొట్టుకోవడమే అవుతుంది. అందుకనే వారికి చేతనైనంతవరకు భాషాప్రయుక్త రాష్ట్ర విభజనకు వారు వ్యతిరేకిస్తూ ఉంటారు. ఇంగ్లీషుప్రభుత్వంమీద ఆశపెట్టుకుంటేకాదు మన రాష్ట్రనిర్మాణం సాధ్యమయ్యేది. ఇంగ్లీషు సామ్రాజ్యవాదుల కుట్రను పూర్తిగా తెలుసుకొని, దానిని అన్నివిధాల అన్ని వైపులనుండీ ఎదుర్కొని, ఆ ప్రభుత్వాన్ని, దాని తాబేదారులైన సంస్థానాధీశులను త్రోసివుచ్చినప్పుడు తేలికగా సాధ్యమవుతుంది. ఈ సత్యాన్ని కళా వెంకట్రావుగారు, ఆంధ్ర కాంగ్రెసు నాయకులు ఎంతత్వరగా తెలుసుకుంటే అంతమంచిది.

ప్రకాశం పట్టాభిగార్ల ధోరణి

ప్రధానిగా ఉన్న ప్రకాశంగారు, భాషాప్రయుక్తరాష్ట్ర నిర్మాణం గూర్చి శాసనసభలో ప్రశ్నలు వేసినపుడు, రాజ్యాంగనిర్మాణసభలో అన్నీ పరిష్కారమవుతాయి త్వరపడవద్దని జవాబు చెప్పారు. కాని ఇంగ్లీషు సామ్రాజ్యవాదులకుట్రను బట్టబయలు చేయలేదు. పైగా ఆంధ్రపత్రిక బి. యన్. రావు నివేదిను ప్రకటించినపుడు దాని యజమానులను పిలచి చీవాట్లుపెట్టినట్టు మాకు తెలుస్తూఉంది. అందుచేతనే కాబోలు బి. యన్. రావు నివేదికను ప్రకటించి ఆంధ్ర ప్రజలను జాగరూకులను గావించిన ఆంధ్రపత్రిక దానిమీద ఎట్టి సంపాదకీయాన్నీ వ్రాయలేదు.

మద్రాసు శాసనసభలోని తెలుగుశాసన సభ్యులందరూ, మంత్రులు, పార్లమెంటరీ కార్యదర్శులు తప్ప, మిగిలిన వారందరూ వెంటనే ఆంధ్రరాష్ట్ర నిర్మాణానికి పూనుకోవాలంటూ ఒకనివేదికనుపంపారు. కాని దానిలో కూడ రాష్ట్రనిర్మాణానికి అడ్డంకమైన ఇంగ్లీషు సామ్రాజ్యవాదుల కుట్రలను ఎత్తిచూపలేకపోయారు.

అఖిలభారత కాంగ్రెసు నాయకులలో కొంతమంది ముఖ్యంగా వల్లభాయి పటేలు, పెద్దపెట్టుబడిదారుల పలుకుబడిక్రింద ఇంగ్లీష్ ప్రభుత్వంతోను, సంస్థానాధీశులతోను సాగించే రాజీవిధానాన్ని ఖండించడం లేదు. ఆరాజీధోరణివల్లనే వల్లభాయి ఆంధ్రరాష్ట్ర నిర్మాణాన్నిగూర్చి మరి రెండేళ్లవరకు మాట్లాడ వద్దంటున్నాడనే సత్యాన్ని ఎవరూ ఎత్తిచూపలేదు.

ఆంతేగాక వీరందరూ, ప్రకాశంగారి గ్రూపుగాని, పట్టాభిగారి గ్రూపుగాని, రంగాగారి గ్రూపుగాని, ఎవరుకూడ ఆంధ్రరాష్ట్ర నిర్మాణమని చెప్పినప్పుడు మద్రాసులోని తెలుగు జిల్లాలను ఒక రాష్ట్రంగా ఏర్పాటు చేయాలని సూచించేవారేకాని, నైజాంనవాబు పరిపాలన పోవాలి, తెలంగాణలోని ఆంధ్రులంతా తిరిగి తమసోదరులలో కలసి ఐక్యవిశాలాంధ్రలో ప్రజారాజ్యం స్థాపించాలని ఒకరూ ఒకమాట కూడ చెప్పడంలేదు, సామ్రాజ్యవాదులమీద ఆశ పెట్టుకుంటున్నారేగాని. ఆంధ్ర ప్రజల పోరాటాలను పెంపొందించి విశాలాంధ్రను నిర్మించాలనే ఆలోచనే లేకపోయింది.

అసలుసమస్యను వెనక్కి నెట్టారు స్వల్పవిషయాలను ముందుకు తెచ్చి ప్రజలలో చీలికలు కల్గిస్తున్నారు

ఆంధ్రప్రజల సర్వతోముఖాభివృద్ధికి విశాలాంధ్ర నిర్మాణం అత్యంత అవసరం. ఇంగ్లీషుప్రభుత్వం, నైజాంప్రభుత్వం పోయినపుడే ఐక్య విశాలాంధ్ర ఏర్పడుతుంది. ఈ సమస్యను ఆంధ్ర ప్రజలముందు కాంగ్రెసు నాయకు లెవరూ పెట్టడంలేదు. ఆంధ్రరాష్ట్ర మంటే మద్రాసులోని తెలుగు జిల్లాలను మాత్రం దృష్టిలో పెట్టుకొని పనిచేస్తూ ఉంటారు.

ఈపరిమిత ఆంధ్రరాష్ట్రానికి సరిహద్దులేవి; తమిళులకు ఎక్కువ డబ్బు ఖర్చు పెట్టుతున్నారు; తమిళదేశంలో పరిశ్రమ లభివృద్ధి చెందాయి; ఆంధ్రదేశం వెనకబడి ఉంది; తమిళనాడులో ఎక్కువ ఇరిగేషను ప్రాజెక్టులు, విద్యుచ్ఛక్తి యంత్రాగారాలున్నాయి కాబట్టి ఆంధ్రరాష్ట్రాన్ని ఏర్పరచేటప్పుడు ఆ పెట్టుబడిలోని వాటాను తమిళనాడు నుండి తిరిగి రాబట్టుకోవాలి; ఉద్యోగాలలో తమిళులకే ఎక్కువ వుద్యోగాలు ఉన్నాయి; విద్యాసౌకర్యాలు తమిళులకే ఎక్కువగా వున్నాయి; అంటూ అనేక చిన్నచిన్న సమస్యలను ప్రజలముందు తెస్తున్నారు. వీనిపై ఆంధ్ర తమిళ తగాదాలను పెంచుతున్నారు.

ఈ సమస్యలన్నిటినీ ఆంధ్ర, తమిళ ప్రజలు ఐకమత్యంతోపరిష్కరించుకొంటూ, తమ ప్రధాన శత్రువులు, తమకోర్కెలన్నిటికీ ప్రబల శత్రువులయిన ఇంగ్లీషు సామ్రాజ్యవాదుల పరిపాలనను నైజాం, తిరువాంకూరు సంస్థానాధీశుల పరిపాలనను నాశనం గావించడానికి కృషి చేయవలసి ఉంటుంది.

సరిహద్దు సమస్యలు-మద్రాసు పట్టణం

మద్రాసుపట్టణం ఆంధ్రరాష్ట్రానికేరావాలి. అచ్చట తెలుగు ప్రజలు సగానికి సగంమంది ఉన్నారు. నాలుగవవంతు మాత్రమే ఉన్నారని జనాభాలెక్కలు తేల్చి తేతమిళ ఉద్యోగస్థులు వాటిని తప్పుగ తయారు చేశారు. తెలుగు ప్రజలను కూడ తమిళుల క్రింద లెక్కించారు. కాబట్టి మద్రాసు ఆంధ్రరాష్ట్రంలోనే ఉండాలనివాదిస్తున్నారు. కనీసం మద్రాసులో కూవం నదికి ఉత్తర భాగమంతా ఆంధ్రులకు రావాలంటున్నారు. చంద్రగిరి తెలుగురాజులే ఈ చెన్నపట్టణ ప్రదేశాన్ని ఇంగ్లీషువారికిచ్చారు. కాబట్టి చారిత్రకంగా చూచినా మద్రాసు తెలుగువారిదేనంటూ పట్టు పట్టుచున్నారు. మద్రాసు తెలుగువారిదంటూ ఇక్క[illegible] ప్రచారం చేస్తే, తమిళ [illegible] రావాలంటూ, తమిళ నాయకులు ప్రచారం [illegible].

మద్రాసులో తమిళులే అత్యధి[illegible] అన్న సంగతి అప్పటికి వెళ్ళిన ప్రతి ఆంధ్రుడు అంగీకరించక తప్పదు. ఒక్క మద్రాసులోనే గాక, మద్రాసు చుట్టుప్రక్కల 25 మైళ్ళ వరకున్న ప్రదేశమంతా అరవభాషను మాట్లాడే తమిళ రైతాంగంతో తమిళ గ్రామసీమలతో, ఉంది. ఈ ప్రదేశంలో తెలుగువారు అల్పసంఖ్యాకులుగా వున్నారు. అందుచే మద్రాసులో అరవవారు అధికసంఖ్యాకులుగా ఉండినా, చుట్టుప్రక్కల ప్రదేశం తెలుగు ప్రజల నివాసస్థానం. అందుచే మద్రాసునగరాన్ని మనం కోరడం సమంజసమనే వాదనకూడ ఎగిరిపోయింది.

చుట్టూ 25 మైళ్ళవరకు తమిళులు నివసిస్తూ మద్రాసు పట్టణంలో అత్యధిక సంఖ్యాకులు తమిళులున్నప్పుడు ఆపట్టణాన్ని మనదని మొండివాదన చేసి, తమిళ ప్రజలతో పరస్పర కయ్యానికి కాలు దువ్వడానికి బదులు మన ఆంధ్ర కాంగ్రెసు నాయకులు హైదరాబాదు పట్టణంకోసం పోరాడితే ఎంతో ముందుకు వెళ్ళేవాళ్ళం. హైదరాబాదు పట్టణంలో సగం మంది తెలుగు ప్రజలు వున్నారు. చుట్టూ 50 మైళ్ళవరకు [illegible] ప్రజలు నివసించే ప్రదేశం వుంది. కాని హైదరాబాదు పట్టణం మాకు రావాలని పల్లెత్తుమాట మాట్లాడరు.

ఒరిస్సా - ఆంధ్రసరిహద్దు

అదేరీతిగా కోరాపుట్టుజిల్లా, బరంపురం పరిసరప్రాంతాలూ, తెలుగువారికే రావాలంటూ, ఒరిస్సా ప్రజలతో వారినాయకులతో వాద వివాదాలు చేస్తారు. ఒరిస్సా ప్రజలు అత్యధిక సంఖ్యాకులుగా నివసించే గ్రామాలు ఒరిస్సారాష్ట్రంలో ఉండాలి. తెలుగు ప్రజలు ఎక్కువగా ఉండే ఆగ్రామాలు తెలుగు సరిహద్దులోకి రావాలి. దీనిని గూర్చి భేదాలుంటే ఆ ప్రాంతాలకువెళ్ళి అచ్చటి వాస్తవిక పరిస్థితులను తెలుసుకోవాలి. అచ్చటి ప్రజల అభిప్రాయాన్ని తెలుసుకొని దానిననుసరించి పనిచేయాలి.

సరిహద్దు గ్రామాలు ఎంతజాగ్రత్తగా విభజించినా, కొంతమంది తెలుగు ప్రజలు ఒరిస్సాలోను, కొంతమంది ఒరియా ప్రజలు ఆంధ్రలోను వుంటారు. ఈ అల్పసంఖ్యాక ప్రజలకు వారి భాషలోనే చదువు చెప్పాలి. వారి భాషలోనే అచ్చటి పరిపాలనాయంత్రాన్ని కోర్టులు, కచ్చేరీలన్నీ నడుపాలని ఉంటుంది. వారికి ఉద్యోగాలు, వృత్తులు కల్పించవలసి ఉంటుంది. మనప్రాంతంలో మరో మైనారిటీ ప్రజలుండడమంటే, వారి అభివృద్ధికి మనపై మరింత ఎక్కువ బాధ్యతలు పడుతాయి. అందుచే ప్రజలరాజ్యంలో మరొక ప్రజల భూమి మనరాష్ట్రంలోకి రావాలని కోరరు.

పెట్టుబడిదారులు, జమీందారులు, తమ ప్రభుత్వంలో ప్రజల విద్యాభివృద్ధులకు ప్రత్యేక బాధ్యత వహించరు. వారిని దోచుకోవడమే వీరికి ప్రధానాశయం కాబట్టి మైనారిటీ ప్రజలకోసం ప్రత్యేకంగా శ్రద్ధ వహించరు. తమ దోపిడికి, ఎంత ఎక్కువగా ఇతర ప్రజల ప్రాంతాలను కలుపుకొంటే అంత లాభకరమని, అనేక తప్పుడుదారులు వెదుకుతారు.

ఈ సూత్రాలను మనస్సులో పెట్టుకుంటే సరిహద్దు సమస్యలను తేలికగా పరిష్కరించుకోవచ్చు.

కోరాపుట్టుజిల్లాలో 7 లక్షలమంది ప్రాథమిక తెగలకు చెందినవారు, 2 లక్షలమంది ఒరియా ప్రజలు, మరొక 2 లక్షలమంది తెలుగు ప్రజలు నివసిస్తూఉన్నారు. అందుచే కోరాపుట్టు పూర్తిగా ఒరిస్సాదికాదు. ఆంధ్రలోదికాదు. (మిగతా [illegible])

(7 వ పేజీ తరువాయి)

కోరాపుట్టి జిల్లాలోని ప్రాథమిక తెగల అభివృద్ధికి అనువయినట్లు, దాని సరిహద్దులు నిర్ణయించవలసి వుటుంది. అందు ఒరిస్సా, ఆంధ్రప్రజ లిరుపక్షవారలని పనిచేయడానికి ఎంతేని అవకాశముంది.

ఈ సరిహద్దు సమస్యను ఆంధ్ర ఒరియా కాంగ్రెసు నాయకులు తీరీతిగా పరిష్కరించు కోడానికి తయారుకారు. ఆంధ్రలోని భాగాలు మాకింకా రావాలని ఒరిస్సా వారు, ఒరిస్సాలోని భాగాలు మావి చాల వున్నాయి, అవి రావాలని మీరు తీసుకులాకుమంటారు. కాని ఒరిస్సా కాంగ్రెసు నాయకులు, ఒరిస్సాను చిన్నాభిన్నంగా చేసివేసిన ఒరిస్సా సంస్థానాధీశులపోవాలి అనే నినాదం తీసు కొని ప్రజలను నడపరు. ఆంధ్ర కాంగ్రెసు నాయకులు కూడ, 80 లక్షల తెలుగు ప్రజలు విపరీత బాధలు పడుతున్న నైజాం నవాబు పెత్తనంపోవాలి. మా తెలుగు ప్రజలు మా తెలుగు దేశంతో కలిసి వుండాలి అనే నినాదం తీసుకోరు.

ఒరియాలు, తమిళులకు వ్యతిరేకంగా చేసే దుమారాన్ని నైజాం నిరంకుశ రాజ్యానికి వ్యతిరేకంగా చేసితే మన ఆంధ్రోద్యమమూ, స్వాతంత్ర్యోద్యమమూ ఎంతేని ముందుకుపోయి వుండేవి.

ఉద్యోగాలు

తమిళులకే ప్రభుత్వ ఉద్యోగాలు ఎక్కువగా ఇస్తున్నారు. ఆంధ్రులకేమీ ఇవ్వటంలేదని దుమారం తేలికగా రెచ్చగొట్ట బడుతూంది.

తమిళులకు ఆంధ్రులకన్న ఎక్కువప్రభుత్వ ఉద్యోగాలున్న మాటనిజమే. ఆంధ్ర దేశంలోని కంపెనీలలోను, ప్రభుత్వ ఉద్యోగాలలోను తెలుగువారినే ప్రధానంగా నియమించాలనడం కూడ సరియైనదే. ఎందుకంటే, ఆంధ్రప్రజల నిత్యవ్యవహారాలను చూడడానికి తెలుగు తెలిసినవారయితే సులభమవుతుంది కాబట్టి. అయితే ఆంధ్రలో ఇప్పుడున్న ఉద్యోగా లన్నిటిలోను తమిళులను తీసివేసి వారి స్థానాన తెలుగువారిని పెట్టినా మరొక రెండు వేల మందికి అదనంగా ఉద్యోగాలు దొరక వచ్చు. కాని ఆంధ్రలో నిరుద్యోగ సమస్య అంతటితోపోదు. అదేరీతిగా అటు తమిళుల నిరుద్యోగ సమస్యకూడ ఈ రెండువేల ఉద్యోగాలతో సమసిపోదు.

మన నిరుద్యోగానికి మూలకారణం ఈ సామ్రాజ్యవాదుల పెత్తనం. పెట్టుబడిదారీ ఆర్థిక విధానంవల్ల మనదేశంలో తగినన్ని పరిశ్రమలు అభివృద్ధి చెందలేదు. అందువల్ల మన ప్రజలకు ఉద్యోగాలు, వృత్తులు దొరకడం లేదు. అందుచే మన ప్రజలందరికీ ఉద్యోగాలు, వృత్తులు దొరకాలంటే, ఉన్న ఉద్యోగాలలో తమిళులకెన్ని వచ్చాయి, ఆంధ్రులకెన్ని వచ్చాయని కీచులాడుకోవడం కాదు మార్గం. నిరుద్యోగానికి మూలకారణములయిన సామ్రాజ్యవాదుల పరిపాలనను, పెట్టుబడిదారీ విధానాన్ని నాశనం గావించడానికి, ఆంధ్రులు, తమిళులు ఇరువురూ కలసి పనిచేయడమే మార్గం.

ఆంధ్రరాష్ట్ర నిర్మాణమయినంత మాత్రాన మన ప్రజలందరికీ ఉద్యోగాలు దొరుకుతా యనుకోవడం వెర్రితనం; సామ్రాజ్యవాదుల పెత్తనం, సంస్థానాధీశుల పెత్తనం, పెట్టుబడి దారీ ఆర్థిక విధానం పోతేనే అది సాధ్య మవుతుంది. ఈ లోపం రాష్ట్రం ఏర్పడితే, మనకు ఉద్యోగాలు లేకపోవడానికి తమిళులు, తమిళులకు ఉద్యోగాలు లేకపోవడానికి ఆంధ్రులు కారణమంటూ మనలో మనకు తగవులు పెట్టడానికి సామ్రాజ్యవాదులకు ఆంధ్ర, తమిళ పెట్టుబడి దారులకు అవకాశం లేకుండా పోతుంది. ఆంధ్ర, తమిళ కార్మికులు, ప్రజలు తమతమ పెట్టుబడిదారుల విచ్ఛిన్న పద్ధతులను ఎదు ర్కోవడం తేలిక అవుతుంది. సామ్రాజ్య వాదులు మనలో చీలికలు పెట్టే కుట్రలను భగ్నంగావించి ఢీకోవడం తేలికఅవుతుంది.

విశాలాంధ్ర నిర్మాణానికి కదలిరండు!

తమిళనాడులోనే ఎక్కువ కళాశాలలు విద్యాలయాలు వున్నాయి. విద్యకోసం తమిళ నాడులో ఖర్చుపెట్టే డబ్బుకన్న అంతకన్న వెనుకబడిన మన ఆంధ్రలో చాల తక్కువ ఖర్చు పెట్టుతున్నారని మరో దుమారం రేగుతూ వుంది.

తమిళనాడులో ఆంధ్రలోకన్న ఎక్కువ కళాశాల లున్నమాట నిజమే. ఎక్కువ విద్యా సౌకర్యా లున్నమాటకూడ నిజమే. అయితే యిప్పుడున్న కళాశాలలు, కొత్తగా తెరుస్తున్న కళాశాలలుకూడ తమిళ ప్రజలందరికీ విజ్ఞాన వికాసాలు కల్గించడానికి ఏమాత్రం చాలవు. తెలుగుదేశంలో ఎన్నో విద్యాలయాలు, కళాశాలలు మరింత అధికంగా త్వరితంగా ఏర్పడాలి. దానికి అడ్డంకి ఏమిటో దానిని తొలగించాలి. అంతేకాని ఇప్పుడున్న అవకాశాలలో తమిళులకు ఎక్కువఇచ్చారనీ ఆంధ్రులకు తక్కువ ఇచ్చారనీ తగాదాలలోకి దిగడంవల్ల ఏమీరాదు.

కాంగ్రెసుమంత్రులు, మన విద్యార్థులందరికీ, తమిళ, ఆంధ్రులని విభేదం లేకుండా బ్రాహ్మణ, బ్రాహ్మణేతరులనే విభేదం లేకుండా అందరికీ వారివారికి కావలసిన విద్యను అభ్యసించడానికి కావలసిన అవకా శాలు కల్గించవలసినదిగా మనం ఒత్తిడి తేవాలి. ఇదితరహాలా సాధ్యంకాకపోవడానికి డబ్బులేదనేసాకుకు కారణం, కాంగ్రెసు మంత్రులు సామ్రాజ్యవాదుల బడ్జెటునే అనుసరిస్తున్నారుకాని ప్రజలకు కావలసిన రీతిని ప్రజాబడ్జెటు సూత్రాలననుసరించి పని చేయడంలేదు.

పోలీసులకు ఒకటిన్నరకోటి రూపాయలు అదనంగా మంజూరుచేశారు కాని విద్యకోసం 25 లక్షలకన్న ఎక్కువఇవ్వలేదు. పెట్టుబడి దారులమీద అధికలాభాలపన్నని సామ్రాజ్య వాదులు తీసివేసి 7½కోట్లరూపాయల ఆదాయం వదులుకుంటే తలలూపారేగాని, దానినితిరిగి ప్రవేశపెట్టలేదు. జమీందారులకు నష్టపరి హారమిస్తామంటూ ఇంకా కోట్లకొలది అప్పు చేయడానికి తయారవుతున్నారు. అంతేగాని జమీందారీ విధానాన్ని నష్టపరిహారంలేకుండా రద్దుచేసి రైతుల అభివృద్ధికి తోడ్పడంలేదు. దొంగవ్యాపారస్థులు విపరీతలాభాలు వేసు కొని సంపాదించిన ఆస్తులను స్వాధీనపర్చు కొని ప్రజల అవసర కార్యాలకు తీర్చడానికి ఉపయోగపర్చడం లేదు.

మనమిట్టి విధానాన్ని కాంగ్రెసుమంత్రు లచే అవలంబింపజేయడానికి ఆంధ్రులము, తమిళులము ఇరువురమూ కలసి ఆందోళన చేయాలి. ఉన్నవానిలో తమిళులకే విద్యా వృత్తి నిర్మాణానికి విద్యాలయాలను బట్టి లలో ఎక్కువ ఇచ్చారని మనలోమనం తగవులాడుకోవడంవల్ల ఏమీరాదు.

పరిశ్రమాభివృద్ధి

ఆంధ్రలో పరిశ్రమలు అభివృద్ధి చెంద లేదు. తమిళనాడులో అభివృద్ధి చెంది వున్నాయి. ఆంధ్రలో ఇర్రిగేషను ప్రాజెక్టుల కోసం విద్యుచ్ఛక్తి, యంత్రాగారాలు, కోసం తమిళనాడులోకన్న తక్కువ ఖర్చు పెట్ట బడింది. అందుచే ఆంధ్రరాష్ట్రాన్ని తమిళ నాడునుండి విడదీసేటప్పుడు, తమిళనాడులో అదనంగా ఖర్చు పెట్టాడిన డబ్బంతా తిరిగి ఆంధ్రులకు ఇచ్చివేయాలంటూ కొందరు వాదిస్తారు.

మన దేశంలో పరిశ్రమాభివృద్ధిలో హెచ్చుతక్కువలు రావడానికి కారణం ఇంగ్లీషు సామ్రాజ్యవాదుల పెత్తనం. వారి క్రింద అభివృద్ధిచెందని పెట్టుబడిదారీవిధానం. అందుచే సామ్రాజ్యవాదులు చేసిన తప్పి దానికి తమిళప్రజలనుండి నష్టపరిహారాలు కోరడానికన్న అపహాస్యంవేరొకటివుండదు. తమిళప్రజలు, ఆంధ్రులు కలసి సామ్రాజ్య వాదులను తరిమివేయాలి. తమ తమ స్వతంత్రరాష్ట్రాలలో పారిశ్రామిక, ఆర్థికాభి వృద్ధులకు ఒకరికొకరు చేయూత నిచ్చు కోవాలి. అంతేగాని ఒకరినొకరిని శత్రు వులుగా భావిస్తూ నష్టపరిహారాలు, మొదలైనవాటి ఇవ్వమనడం పెట్టుబడిదారుల కుట్రలను, దురాశలను తెలియజేస్తాయి కాని ప్రజాపోరాటాన్ని వెల్లడించవు.

బిర్లా, గుజరాతి పెట్టుబడిదారులకు ఆంధ్రలో స్థానమివ్వరాదు?

అసహ్య దాల్మియా దానేపల్లిలో సిమెంటు ఫ్యాక్టరీని కట్టినప్పుడు, మొన్నబిర్లా రాయల సీమలో ఒకపత్తి ఫ్యాక్టరీకి అనుమతి సంపాదించినప్పుడు, ఆంధ్రలో పెద్ద దుమా రము చెలరేగింది. ఆంధ్ర పెట్టుబడిదారు లకు మొదట అవకాశమివ్వకుండా బిర్లాలకు, పరాయి ప్రాంతాలనుండి వచ్చే పెట్టుబడి దారులకు యివ్వడమేమి టని ఆందోళన చెలరేగింది. ఒకే ఫ్యాక్టరీని నెలకొల్పడానికి అవకాశమున్నప్పుడు ఆంధ్రపెట్టుబడిదారులకు మొదటి అవకాశ మిచ్చితీరాలంటూ ఆందోళనబయలుదేరింది.

ఉన్న ఒక ఫ్యాక్టరీని బిర్లాకు ఇవ్వాలా లేక ఆంధ్రపెట్టుబడిదారులకు ఇవ్వాలా అని చూస్తే ఈప్రశ్నకు సరియయిన పరిష్కారం దొరకదు. మనకు నేడు కావలసినది ఒక ఫ్యాక్టరీకాదు చాల ఫ్యాక్టరీలు వివిధరకములైన ఫ్యాక్టరీలు కావాలి. ఆంధ్రదేశంలోని పెట్టుబడిదారు లంతా కలసినా, మనరాష్ట్రంలో నేడేర్పాటు చేయాలసిన ఫ్యాక్టరీల నన్నిటిని ఆరంభించ లేరు. మనదేశంలోకి ఇతర రాష్ట్రాలనుండి పెట్టుబడిదారులు ఇచ్చటకువచ్చి పరిశ్రమలు స్థాపిస్తామంటే మనం ఆహ్వానిస్తాం.

కాని ఆంధ్ర పెట్టుబడిదారులైనా, ఇతర రాష్ట్ర పెట్టుబడిదారులైనా, మన ప్రజలను దోచుకోడానికివీలులేదు. రైతులనుండిసరుకు లకు సరియైన ధరలిచ్చేటట్లు ప్రభుత్వం శాస నంచేయాలి. కార్మికులకున్యాయమైనజీతాలు, సుఖజీవనానికి కావలసిన సదుపాయాలన్నీ చేసేటట్లుచట్టాలుచేయాలి. ప్రజలకునరసమైన ధరలకు అమ్మేటట్లు ధరలను నిర్ణయించాలి. పెట్టుబడిదారుల లాభాలను పరిమితంచేసి ప్రభుత్వం కంట్రోలు చేయాలి. ఇంతే కాకుండా వ్యక్తిగత పెట్టుబడిదారులకు ఉప పరిశ్రమలలోనే సొంత ఫ్యాక్టరీలను పెట్టు కొని కొంతవరకు పరిమిత లాభాలకు అవ కాశముంటుందికాని, కీలకపరిశ్రమలన్నిటినీ ప్రభుత్వమే నడపాలని ఉంటుంది.

ఈ సూత్రాల ననుసరించి పనిచేసినప్పుడు ఆంధ్రదేశ పరిశ్రమాభివృద్ధికి ఎట్టి ఆటంకం రాదు. ఎటువంటి పెట్టుబడిదారునికి మన పరిశ్రమలపై గుత్తాధికారం ఉండదు. బిర్లాకు ఇవ్వాలా లేక ఆంధ్ర పెట్టుబడిదారులకు ఇవ్వాలా-అవిధంగా సమస్యనుతెస్తే, బిర్లాను ఇతరరాష్ట్ర పెట్టుబడిదార్లను శత్రువులనుగా చూసి, మన రాష్ట్ర పెట్టుబడిదారులను మనం బలపర్చడమే అవుతుంది. ప్రజల లాభాలను కాపాడుకొనే ప్రజాపద్ధతిని వదిలివేసినవార మవుతాం.

భాషాప్రయుక్త రాష్ట్రాలే ఉంటే వివిధ ప్రజలమధ్య ఈ ద్వేషాలు పెంచడం సులభసాధ్యంకాదు

నేడు ఈసరిహద్దుల సమస్య, ఉద్యోగాల సమస్య, విద్యాసౌకర్యాలసమస్య పరిశ్రామి కాభివృద్ధి సమస్య, ఆదాయ వ్యయాల సమస్య (బడ్జెటు) వీటన్నిటిలోను, కలగూర గంప రాష్ట్రాలుగ ఉండటంవల్ల, ఒకరిపై నొకరికి అనుమానాలు ద్వేషాలు పెంచడానికి ఒక్క సామ్రాజ్యవాదులనే గాక, వివిధ ప్రజలలోని పెట్టుబడిదారులకు, కూడ అవ కాశం దొరుకుతూ ఉంది. ప్రజల దుస్థితికి కారణమయిన తమ తప్పులను కప్పిపెట్టు కొని, ఇతరులమీద త్రోసివేయడానికి తేలిక అవుతూ ఉంది.

భాషాప్రయుక్తరాష్ట్రాలేఉంటే, సామ్రాజ్య వాదులే తమ దుస్థితికి కారణంగాని, తమిళులు గాని మరొకరుగాని కాదని, ప్రజలు మరింత స్పష్టంగా తెలుసుకుంటారు. తమ తమ నాయకులు, సామ్రాజ్యవాదులతో రాజీ పడ డానికి ప్రయత్నిస్తే దాని ఫలితాలను ప్రజలు ప్రత్యక్షంగా చూస్తారు. ఇప్పుడుంటు తమిళ నాయకుల మీదో, ఇతరులమీదో పడవేయ డానికి వీలుండదు.

ఉదాహరణకు ఒక్క విషయం చూడండి. మద్రాసులో కాంగ్రెసుమంత్రివర్గం ఏర్పడినది మొదలు ఆంధ్ర తమిళ విభేదాలు, మంత్రులు గావించే అవకతవక పనులకు దోహద మిచ్చాయి. ఈ అవకతవక పనులు ఆంధ్ర తమిళ విభేదాలను మరింత హెచ్చుచేశాయి.

ప్రకాశం ఆంధ్రప్రధాని కాబట్టి, యస్. ఐ. ఆర్. రైల్వే కార్మికులపై ఈ తీవ్రనిర్బంధ విధానం అవలంబించాడంటూ "ద్రావిడ కళ గం" అనే తమిళ చాందసులు తీవ్ర ప్రచారం చేస్తున్నారు. తమిళ ప్రజలకున్న కష్టాల కన్నిటికీ కారణం ఆంధ్ర ప్రధాని అంటూ కామరాజనాడార్ గ్రూపుకూడ ప్రచారంచేస్తూ ఉంది. ముఖ్యంగా మొన్న బట్టలమిల్లులు మద్రాసులో స్థాపించడానికి అనుమతి నివ్వనని ప్రకాశం ప్రకటన కామరాజనాడార్ ప్రచా రానికి మరింత తోడ్పడింది.

నిరుపయోగమయిన ఖాదీస్కీముద్వారా ప్రజలకు కావలసిన గుడ్డ నివ్వలేరనేది అందరికీ తెలుసు. దీనిని తమిళనాడులో ఆంధ్ర ప్రధాని ముసలితనపు అవకతవక చర్యలుగా వారు విమర్శిస్తున్నారు. ఇద్దరు స్కీమును జయప్రదం చేయాలనుకుంటే, ఎట్టి బట్టల మిల్లులుకూడలేని మీ ఆంధ్రలోనే పరీక్ష చేయవచ్చునే. తమిళనాడులో కొత్తగా ఏర్పాటు చేయదలచుకొన్న 21 మిల్లు లకు అడ్డురావడం దేనికంటూ తీవ్రప్రచారం సాగిస్తున్నారు.

నేడు ఆంధ్రుల కర్తవ్యమేమిటి

ఆంధ్రప్రజలు సర్వతోముఖాభివృద్ధికి ఇం గ్లీషు సామ్రాజ్యవాదుల పెత్తనం పోవాలి. నైజాం నవాబుపోవాలి. ఐక్యవిశాలాంధ్రలో ప్రజారాజ్యం ఏర్పర్చాలి. దీనికోసం అప్పుడే ఆంధ్రరైతాంగం జమీందార్లకు, భూస్వాము లకు వ్యతిరేకంగా పోరాటం ఆరంభించింది. సాగుచేసేవారికే పొలం. ప్రజలకు తిండి అంటూ నినాదాలిస్తూ ఉంది.

ఆంధ్ర కార్మిక లోకం యజమానులకు దొంగవ్యాపారస్థులకు వ్యతిరేకంగాపోరాటం ఆరంభించింది. ప్రజలందరికీ పని, సుఖజీవ నానికి కావలసిన జీతాలు సదుపాయాలంటూ నినాదాలిస్తూవుంది.

ఐక్యవిశాలాంధ్ర ప్రజాస్వాతంత్ర్య పోరా టానికి అగ్రగామిగా నైజాంలోని మన తెలం గాణ ఆంధ్రసోదరులు, రైతులు, కూలీలు, పట్టణకార్మికులు, హిందువులు, ముస్లిములు ముందునిలబడి పోరాటాన్ని సాగిస్తున్నారు. తుపాకి గుండ్లకు ఎదురురొమ్ములు ఒడ్డు తున్నారు. దేశముఖు జాగీర్దారు విధానం పోవాలి-రైతుకూలీలకు పొలాలు. ప్రజలకు తిండి-బిడ్డలకు తల్లిభాష తెలుగులో చదువు-పౌరసత్వ హక్కులు, ప్రజల హక్కులు కాపాడడానికి ప్రజలరాజ్యం కావాలి-నైజాం ప్రభుత్వం పోవాలి. ఈ నినాదాలు దశదిశలా మ్రోగిపోతున్నాయి.

ఈ దివ్యవిశాలాంధ్ర ప్రజాస్వాతంత్ర్య పోరాటంలో ఆంధ్రప్రజానీకమంతా, కాంగ్రెసు, కమ్యూనిస్టులు కలసి ఐక్యసంఘ టనగా నిలబడి పోరాడాలి. భారతదేశమం దలి ఇతరప్రజలు మనతో కలుస్తున్నారు. ఇంగ్లీషు సామ్రాజ్యవాదాన్ని, సంస్థానాధీశుల నిరంకుశ ప్రభుత్వాలను కూల్చదోస్తాం. వివిధస్వతంత్రజాతులు స్వేచ్ఛగ ఏర్పరచు కొన్న నిర్ణయించుకున్న) ఐక్యభారతఖండంలో విశాలాంధ్ర ప్రజారాజ్యాన్ని నిర్మిస్తాం.

ఆస్తిపాస్తుల్ని కొల్లగొడుతున్న జమీందార్లను ప్రతిఘటిస్తేనే రైతాంగానికి విముక్తి

1939లో ప్రకాశంకమిటీ రిపోర్టు ప్రకటించబడ్డ నాటినుంచీ మూటా-ముల్లె సర్దుకోటం-కోసం జమీం దార్లు చేస్తున్న' అక్రమాలకు హద్దూ-పద్దూ లేకుండా పోతూంది. మొన్న ఆగస్టులో మద్రాసు ప్రభుత్వం కౌలుదార్ల రక్షణ చట్టాన్నీ, అటవీ రక్షణచట్టాన్నీ ప్రకటించినప్పటినుండి ఈ అన్యాయాలు మరీ ఎక్కువయ్యాయి. రైతులు అనాది నుంచి సాగుచేసుకుంటున్న భూముల్ని జమీందార్లు అన్యాక్రాంతం చేస్తున్నారు. పాతతేదీలు వేసి బినామీపట్టాలు సృష్టి స్తున్నారు. బలవంతంగా రైతుల్నీ, కౌలుదార్లనూ భూముల్లోంచి వెళ్ళగొడు తున్నారు. సాముదాయక భూములనూ, అడవులనూ అమ్మివేస్తున్నారు. ఈ పరి స్థితుల్లో రైతాంగానికి రక్షణ కల్పించ వలసిన బాధ్యత ప్రభుత్వంపైన ఉన్నప్ప టికీ వాస్తవంలో ఏంజరుగుతున్నదో కొన్ని ఉదాహరణలు తీసుకుచూద్దాం.

కృష్ణా జిల్లాలో

చల్లపల్లి ఎస్టేట్‌లో కృష్ణలంకలైన గాజుల్లంక, చింతల్లంక, సుగ్గులంక మొదలైన గ్రామాల్లోని శేరీ మెరక భూమికి 1908లో రైతులకు పట్టా లిచ్చారు. క్రమక్రమంగా కృష్ణవరదల వల్ల లంకలు విరగటం, నదీపాతం కావటం, మరోచోట తేలటం జరుగు తున్నప్పుడల్లా, తేలిన లంకంతా తనదేనని జమీందారు దొంగరికార్డులు సృష్టించుకొంటూ వచ్చాడు. యదార్థానికి రైతుభూమి ఎప్పుడూ రైతుభూమిగానే వుంటుందిగాని, కొన్నాళ్ళు మునిగి వున్నంత మాత్రాన రైతుభూమి కాకుండా పోదు. జమీందారుని దొంగరికార్డులవల్ల గాజుల్లంక రైతులకు 1908 లో 195 యకరాల పట్టాభూమి వుంటేయివ్వాళ 5 ఎకరాల పట్టాభూమిమాత్రమే మిగి లింది. మిగతాదాన్ని జమీందారు తన స్వంత కమతంగా చూపెడుతున్నాడు. అయితే భూమిమాత్రం మక్తాక్రింద రైతుల స్వాధీనంలోనేవుంది. ప్రభుత్వం కౌలుదార్ల రక్షణ చట్టాన్ని ప్రకటించే సరికి తన హక్కు స్థాపించుకోవాలని జమీందారుకు దుర్బుద్ధిపుట్టింది. బినామీ పట్టాలు సృష్టించాడు. 600 జనాన్ని కత్తులు-కటారులతో లంకలపై దాడికి పంపించాడు. అందులో 63 గురిని ఆయుధాలతోసహా అరెస్టు చేశారు. ఆ తర్వాత, సాగుచేసుకుంటున్న భూము లపై రైతులకు స్వతస్సిద్ధమైన హక్కు ఉన్నప్పటికీ, రైతులుకూడ భూముల్లోకి వెళ్ళకూడదని బందరు డిప్యూటీకలెక్టరు 145 సెక్షన్ జారీచేశాడు. అరెస్టుచేసిన జమీందారీ జనాన్ని ఊరికే వదిలివేశారు.

తిప్పలకట్ట, కిష్కింధపాలెం, పోతా ర్లంక మొదలైన గ్రామాల రైతులు సాగుచేసుకున్నటువంటి పోతరాజుడబ్బ, నడిమిలంకపొట్టివానిలంక, కోటిపల్లిలంక లాలావారి లంకభూములనుకూడ చల్ల పల్లి జమీందారు యిలాగనే ఆక్రమించ చూడాడు, రైతులు ప్రతిఘటించారు. ప్రభుత్వం ఈ భూములు కూడ పోలీసు కావలాలోనే వుంచింది. 145 సెక్షన్ క్రింద విచారణజరుగుతోంది.

చల్లపల్లి ఎస్టేట్‌లో యీ లంకల భూముల దురాక్రమణే కాకుండా, సాము దాయక భూముల్ని స్వాధీన పర్చుకొని, అమ్మకోవాలన్న కుతంత్రాలు కూడ జరుగుతున్నాయి. కాజ గ్రామంలో 64 యకరాల సాముదాయక భూమివుంటే లోగడనే 42 యకరాలను జమీందారు దురాక్రమణ చేశాడు. ఉన్నటువంటి 22 యకరాలనూ ఉమ్మడి పనులకై గ్రామ స్థులు ఉపయోగించు కొంటుంటే, అది కూడ కాజేయవలెనని జమీందారుకు బుద్ధి పుట్టింది. పదిమంది అమాయక రైతుల్ని కోటకు పిలిపించి, 12 యక రాలకు హద్దులు పెడతానని రు 4800/-లు తీసుకొన్నారు. ఆ భూమిని స్వాధీన పర్చటానికని తన నౌకర్లనూ, రౌడీలనూ పంపాడు. కాని గ్రామస్థులు తమ సమిష్టి భూముల్ని కాపాడుకోటానికై సమిష్టిగా ప్రతి ఘటించేసరికి జమీందారీ నౌకర్లు పలా యన మంత్రం పఠించారు.

ఇలాగనే తిరువూరు తాలూకాలోని జమీందార్లకు, మొఖాసాదార్లకూ కూడ భూముల్లోనుంచి కౌలుదార్లను తొలగిం చటం, ఆభూములను అమ్మకోవటం నిత్య కార్యక్రమమై పోయింది.

ఎరుకోపాడు గ్రామంలో 70 హరి జన కుటుంబాలవారు 78 యకరాల సర్వీస్ ఈనాంను అనాదినుంచీ అనుభ విస్తూన్నారు. ఆ భూమిని అపహరిం చాలెనని గంపలగూడెం జమీందారు, 144 సెక్షన్ యిప్పించాడు ఆప్పీలులో అనాదినుంచి రైతుల హక్కుభుక్తాల లోనే వుందని రుజువయ్యేసరికి 144 రద్దు చేయాల్సివచ్చింది. దానిమీద జమీం దారు తన గూండాలను పంపి హరిజను లను కొట్టించాడు. ఇలా కొట్టిబెదిరించి భూముల్ని స్వాధీనపర్చుకోవాలని జమీం దారు ఎత్తు. కాని ఆత్మరక్షణకు వారు గూండాల నెదిరించి తరిమిపారేశారు. జమీందారు తన ఎత్తులు ఫలించలేదన్న కుళ్ళుబోతుతనంతో రైతుల హక్కుల్ని రక్షించుటకై కృషిచేస్తున్న కామ్రేడ్ వీరపనేని రంగారావును పోలీసులచే అరెస్టు చేయించాడు. హరిజనులపై క్రిమినల్ కేసులు పెట్టిస్తున్నాడు.

ఇలాగనే చాట్రాయిలో మొఖాసా దార్లు రజకుల తాలూకు 35 యకరాల సర్వీస్ ఈనాంను లాక్కున్నాడు. వెల గలగూడెం యానాందారు 40 బీదకుటుం బాలవారు అనాదినుంచి సాగుచేసుకుం టున్న 300 యకరాల్లోనూ రైతుల ప్రవేశించకుండా 144 సెక్షన్ యిప్పిం చాడు. క్రిమినల్ కేసులు పెట్టి రైతుల్ని లొంగదీయాలని చూస్తున్నాడు. అంపా పురం మొఖాసాదారు కైకలూరుతాలూకా లోని వైవాక గ్రామంలో యిల్లాంటి దురాక్రమణే చేస్తున్నాడు. గన్నవరం తాలూకా తేలప్రోలులో 30 యకరాల మంద బయలను ఆక్రమించుకోవాలని తేలప్రోలు జమీందారు బినామీ పట్టాలు సృష్టించాడు.

పశ్చిమ గోదావరి జిల్లాలో

సరిగ్గా యిటువంటి దురాక్రమణలే పశ్చిమ గోదావరి జిల్లాలోని కానూరు, జీడిగుంట లంకల్లోనూ, కలవలపల్లి ఎస్టేట్‌లోనూ కూడ జరుగుతున్నాయి. ఎలమర్రుజమీందారు కానూరులంకల్లోని 300 యకరాలను కానూరు, కానూరు అగ్రహారం, పెండ్యాల గ్రామాల్లోని హరిజనులకూ, బీదరైతులకూ కౌలు కిచ్చాడు. ఆభూముల్ని దున్నుకొని, సేద్యంచేసుకోబోయే సరికల్లా కౌలుదార్ల చట్టంవచ్చింది. ఈ చట్టం మూలంగా రైతులకు [illegible] దుతుందనిజమీం దారు బెంగారుపడ్డాడు. ఆఫీసర్లనుకట్టు కున్నాడు. 144 యిప్పించాడు. జీడి గుంటలో వున్న బంజర్లను కూడ ఇలా గనే మొదట సాగుకిచ్చి, యిప్పుడు రైతుల్ని వెళ్ళగొట్టాడు. అక్కడకూడ 144 యిప్పించాడు.

కలవలపల్లి జమీందారు 80 యక రాల భూమిని 20 మంది సూరాపురం రైతులకు సేద్యం చేసుకోమని ఇచ్చాడు. ఇప్పుడు ఆరైతుల్ని భూములనుంచి వెళ్ళగొట్టి స్వాధీన పర్చుకోవాలని, గూండాలతో 50 యకరాల్లోని నువ్వుల పైరును కోయించి ఎత్తుకుపోయాడు. ఇంకో 30 యకరాల్లోని సజ్జ, వేరుశనగ పైరులను గొడ్లనుతోలి నాశనం చేయిం చాడు. యీఅక్రమాలను గురించి ప్రధానికి చెప్పుకున్నమీదట జిల్లాకలెక్టరు రైతు లను సాగుచేసుకొమ్మని ఆర్డరిచ్చాడేకాని జమీందారీ దురాక్రమణల నాపుటకు మాత్రం ఇంజెక్షన్ ఉత్తర్వులు యివ్వ లేదు. రైతుల్ని సాగుచేసుకోమన్న ఉత్తర్వుకూడ 15-10-1946 వరకే నన్నారు. ఆగడువుపూర్తయింతర్వాత ఆభూముల పరిస్థితులను గురించి విచా రించి, రిపోర్టుయివ్వడానికి జిల్లాకలెక్టరు ఒకకమీషనరును ఏర్పాటు చేశారు. ఆయన 19వ తేదీన విచారణకు వస్తా డన్నారు. ఆనాడు తమ హక్కుల్ని రుజువు పర్చుకొందామని రైతులంతా ఎదురుచూశారు కమీషనరురాలేదు సరి గదా! జమీందారు మనుష్యులు మాత్రం వందమంది కర్రలతోనూ, బల్లాలతోనూ వచ్చి కనపడ్డ రైతునల్లా క్రూరంగా హింసించారు. ఏడుమందుగురికి ప్రమాద మైన దెబ్బలు తగిలాయి. పోలీసులకు రిపోర్టిచ్చినా, ఇంతవరకు జమీందారీ మనుష్యులనెవ్వరినీ అరెస్టు చెయ్యలేదు.

వస్తానన్నరోజు తప్పించి మరునాడు ఆకమీషనరు వచ్చాడు. రైతుల్నిహిం సించి చెల్లాచెదరు చేసిన జమీందారీ మనుష్యుల ఆధీనాన భూమిని దున్ను తున్నట్లుగా నాటక మాడారు. భూమి జమీందారు స్వాధీనంలోనే వుందని ఆ కమీషనరు రిపోర్టు తీసుకపోయ్యాడు.

అడవుల దురాక్రమణ

ఆగస్టులో అటవీరక్షణ చట్టం ప్రభు త్వంచే ప్రతిపాదించబడగానే వుయ్యూరు రాజా 415 యకరాల వైశాల్యంగల అడవులను హేమంత అను నామెకు వ్రాసిఇచ్చేశాడు. ఆమె మరునెలలోనే గన్నవరంతాలూకా మెట్టపల్లిలోవున్న అడవులను అమ్మకానికి పెట్టింది. యీ అడవి 'రిజర్వు ఫారెస్టు' అవటంవల్ల వాస్తవానికి జమీందారుకేమీ హక్కులేదు. అందుకని అడవిని నరికివేస్తుంటే రైతులు ప్రతిఘటించి, అనాదిసిద్ధంగా వున్న హక్కుల్ని కాపాడుకుంటున్నారు

నూజివీడుతాలూకా దిగవల్లిలో వెయ్యి యకరాల అడవిని గొల్లపల్లిజమీందారు అమ్మేశాడు. ఇలాగనే ముక్త్యాల, ఎల మర్రు జమీందార్లు, తిరువూరు తాలూకా లోని కొండపర్వ, చిత్తపూరు, తుమ్మ గూడెం, మల్లవరం మొఖాసాదార్లూ అడవుల్ని అమ్మేస్తున్నారు. చెట్లన్నీ నరికి బొగ్గుచేయించుతున్నారు. రైతులు అభ్యంతరం తెలుపుతున్నప్పటికీ స్థాని కాధికారులు పట్టించుకోకపోవడంవల్ల అడవుల్ని నరకటం నిరాఘాటంగానే సాగిపోతూవుంది.

రైతుల్లో రైతులకు చీలికలు పెడుతున్నారు

చల్లపల్లి జమీందారు పోతర్లంక శివారు తడికలపూడిలో కూలీలకు భూమిలిస్తానని ఆశ చూపెట్టాడు. (కాని కూలీలు ఒప్పుకోలా.) నడిమిలంకను సాగుచేసుకొంటున్న కిష్కింధపాలెం, తిప్పలకట్ట గ్రామాల రైతుల్ని భూముల నుంచి తొలగించి తురకపాలెం మహమ్మ దీయులకు సాగుకిచ్చాడు. లాలావారి లంకలో కిష్కింధపాలెం రైతులు సాగుచేసుకుంటున్న 50 యకరాల ఖండాన్ని దోనేపూడి షాహుకార్లకు అమ్మి, వాళ్ళకి - వీరికి తగాదా పెట్టాడు. కాజలో సాముదాయక భూముల్ని పది మంది రైతులకు అమ్మి, రైతుల్లో రైతులకు చీలికలు తేవాలని చూచాడు. ఇంకా అనేకచోట్ల యిటువంటి ప్రయ త్నాలు సాగుతున్నాయి.

ఈ రకంగా గ్రామాల్లో అశాంతిని, కలహాలనూ రెచ్చగొట్టడానికై జమీం దార్లు ఎంతటి దుష్కృత్యానికైనా ఒడి గట్టుతున్నారు. ఇంకెన్నెన్నో కొత్త కొత్త కుట్రలు పన్నటానికే ఆంధ్ర రాష్ట్రంలోని జమీందార్లంతా మొన్న నూజివీడులో సభ పెట్టుకున్నారు.

(మిగతా 14వ పేజీలో)

హిందూ - ముస్లిం కొట్లాటలవల్ల అసలు శత్రువులు బలపడుతున్నారు

(౧ వ పేజీ తరువాయి)

సత్యాలు హెచ్చరించారు. కొట్లాటలు జరిగితే వాటిని అణచడంకోసం సైనికులు సిద్ధంగా వున్నారని మిలిటరీఅధికారులు ప్రకటించారు. అల్లరులు జరగడానికి నెలరోజులు ముందుగానే, ప్రజలు జిల్లా అధికారులకు విజ్ఞప్తుల ద్వారా తెలియజేశారు. ఇన్ని జరిగినా అధికారులు, చర్య తీసుకోలేదు. పోలీసు ఇన్‌స్పెక్టర్ జనరల్, కమీషనరు, నౌఖలీకి స్థిమితంగా వారంరోజులతర్వాత బయల్దేరివెళ్లారు. ప్రభుత్వ యంత్రం ఇంత మందకొడిగా వుండడానికి కారణం లేకపోలేదు. "భారతీయుల్లో భారతీయులు నరుక్కుచస్తారు. బ్రిటిష్ సేనలకై ప్రాధేయపడతారు. బ్రిటిష్ గవర్నర్లు జోక్యం కలిగించుకొని రాష్ట్ర మంత్రివర్గాలను అదుపులల్లో వుంచమని విజ్ఞప్తులు చేస్తారు. అప్పుడు పైచేయి తమదే అవుతుంది. "ఇదీ బ్రిటిష్‌పాలకుల పన్నాగం. నౌఖలీలో జరిగింది కూడా ఇంతే. ఒక ప్లాను ప్రకారమే ఇదంతా జరిగింది.

అసలు నేరస్తులు బ్రిటిష్‌వారు

కాబట్టి, అసలు నేరస్తులు బ్రిటిష్‌వారు. నానాటికీ బలపడుతూన్నది వారే. దేశంలో శాంతిని కాపాడేటందుకు వారి సైనికులమీదే మాటిమాటికి ఆధారపడవలసి వస్తోంది. ప్రత్యేకాధికారాలు ఉపయోగించవలసివస్తుందని వైస్రాయిని, గవర్నర్లనూ మాటిమాటికీ వేడుకోవలసిన గతి పట్టింది.

ఇప్పుడే పరిస్థితులిలా ఉంటే రాజ్యాంగ నిర్మాణసభలో ఎలా ఉంటాయో వేరే చెప్పనక్కర్లేదు.

గుణపాఠం

ఈ దురంతాలు బ్రిటిష్ ప్లాను అనే వృక్షం యొక్క మొదటి విషపుష్పాలు మాత్రమే. ఇప్పుడైనా మనం నేర్చుకోవలసిన గుణపాఠం ఏమంటే బ్రిటిష్ ప్రణాళిక అనుసరించి మన నాయకులు నడచినంతకాలం మనలో మనకు కొట్లాటలు బ్రిటిష్ సామ్రాజ్యవాదుల పెత్తనం తప్పవు.

లీగ్ నాయకులు ఖండించలేదు

అక్టోబరు 10 వ తేదీన ప్రారంభమైన నౌఖలీ దురంతాలను బాధ్యతగల రాష్ట్రలీగ్ నాయకులుగాని, ఆ॥భా॥ముస్లింలీగ్ నాయకులుగాని, చాలారోజులవరకూ ఖండించనేలేదు. లీగ్ తాత్కాలిక ప్రభుత్వములో ప్రవేశించడానికి నిర్ణయింపబడిన తర్వాతనే, ప్రకటనలు ప్రారంభమయాయి. బెంగాల్ ప్రధాని 16 వ తేదీవరకు దురంతాలను ఖండించలేదు. రాష్ట్రముస్లింలీగు 19 వ తేదీవరకు ఊరుకుంది. 24 వ తేదీవరకుగాని, జిన్నా "మానవజాతి"ని గురించి ఆలోచించడానికి తీరికలేకపోయింది!

మొదట ప్రజల్ని రెచ్చగొట్టడం-తరవాత, జరిగినవాటికి బాధ్యత్వం కాదని తప్పించుకోవడం-ఇది బూర్జువా రాజకీయ వేత్తలు మొదటినుంచీ అవలంబించే విధానమే. "అహింస" పేరుతో కాంగ్రెసు, "శాంతిభద్రతల" పేరుతో ముస్లింలీగు, ప్రజల్ని ఖండించడం మామూలైపోయింది. ముస్లింలీగు "పోరాట" నినాదాన్ని ప్రచారం చేయడం ఎందుకంటే, బ్రిటిష్ ప్రభుత్వం బలవంతంగా రుద్దిన తాత్కాలిక ప్రభుత్వంలోను, రాజ్యాంగ నిర్మాణసభలోను, తన కోర్కెలు సాధించుకోవడంకోసం, ఒత్తిడి తేవడానికితప్ప మరొకందుకుకాదు. ఈ నినాదంతో ఉద్రిక్తులైన ముస్లిం ప్రజాసామాన్యం లీగ్‌కూడా తాత్కాలిక ప్రభుత్వంలో చేరగానే, ఏమిచేయడానికి తోచడంలేదు.

ఇప్పుడు లీగ్‌నాయకులు శాంతిని కాపాడమని విజ్ఞప్తులు చేస్తున్నారు. కాని, అంతగా వుపయోగం కనబడ్డం లేదు.

నౌఖలీ ఘటనలతర్వాత హిందువుల విశ్వాసం చూరగొనడానికి ముస్లింలీగే మొందడుగు వేయాలి. అంతర్యుద్ధాలను ఆపడానికి వెంటనే ముస్లింలీగ్ మంత్రివర్గం క్రింది చర్యలు తీసుకోవాలి.

లీగ్ మంత్రివర్గం తీసుకోవలసిన చర్యలు

(1) నేరస్థులైన దుండగీండ్రను శిక్షించాలి.

(2) వారితో చేయికలిపిన, లేదా చేతగానితనం ప్రదర్శించిన, అధికార్లను ఉద్యోగాలనుంచి తొలగించాలి.

(3) ప్రజలకు రక్షణ యివ్వడంకోసం ఐక్యకమిటీల నిర్మాణానికి పూనుకోవాలి.

(4) ప్రజల్లో ఏకాభిప్రాయం కలుగకుండా చేయడానికి, అన్నిపార్టీలవారు రాష్ట్రమంతటా కలిసి సంచారంచేయడానికి, ఒక కమిటీని నియమించాలి.

(5) బెంగాల్ ప్రజలను కాపాడ్డంకోసం అన్నిపార్టీలు ఉన్న సంయుక్త మంత్రివర్గం ఏర్పరచాలి.

ఇలాచేస్తేనే, శాంతిస్థాపనకై జిన్నాచేసిన విజ్ఞప్తి ఫలిస్తుంది.

కాంగ్రెసు స్వయం నిర్ణయ సూత్రాన్ని అంగీకరించాలి

ముస్లిం ప్రజలపై హిందువులు కసితీర్చుకోవడంకోసం తొందరపడి ఏపనీచేయవద్దని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ విజ్ఞప్తిచేసింది. ఇది ప్రశంసించవలసిన విషయమే. కాని, దేశాన్ని ఈగొడవలనుండి బయటికి తీయడానికి నిర్మాణాత్మకమైన సూచన ఏదీచేయలేదు. వివిధజాతుల స్వయం నిర్ణయ హక్కును, యెట్టి షరతులు లేకుండా, గుర్తించడం అవసరం. లేకపోతే, ముస్లిం ప్రజా సామాన్యం మతాన్నిబట్టి ప్రత్యేక రాజ్యాలు ఏర్పడాలనే తప్పుడు మార్గం చేపట్టి మానరు. బ్రిటిష్‌ప్రణాళికను "ఉన్నది ఉన్నట్లుగా" అమలు జరిపే విధానాన్ని కాంగ్రెసు విడిచిపెట్టనంతకాలం, ముస్లింలీగ్ సామ్రాజ్యవాదుల బంటు అని నిందించడంలో అర్థం లేదు. దానికట్టి నైతిక హక్కు ఉండదు. కాంగ్రెసు వెంటనే బ్రిటిష్ ప్రణాళికను త్రోసిపుచ్చి, సంపూర్ణ స్వాతంత్ర్యం, స్వయం నిర్ణయాధికారం, ప్రజాతంత్రం అనే సిద్ధాంతాల కనుగుణ్యమైన రాజ్యాంగ చట్టాన్ని తయారు చేసేటందుకు లీగ్‌తో రాయబారాలు ప్రారంభించవలసియుంది. అలా జరక్కపోతే ముస్లిం లీగ్ గవర్నమెంటుతో కలిసిపోయిందని కాంగ్రెసు నాయకులు, కాంగ్రెసు గవర్నమెంటుతో కలిసిపోయిందని లీగు నాయకులు ఆరోపణలు చేసుకోవడం, ప్రజాసామాన్యం అంతర్యుద్ధాలలో చిక్కుకొని, ఒకరినొకరు పొడుచుకుచావడం-తప్పదు. బ్రిటిష్ పాలకవర్గం సంతోషంగా తమ ప్లాను నిరాటంకంగా అమలుజరుపుకుంటారు. నేడు మన యెదుట రెండే రెండు మార్గాలున్నాయి.

1. బ్రిటిష్ ప్లానును భగ్నంచేయడానికి కలిసిపోరాడేటందుకు ముందుకు నడవటమా,

లేక 2. అంతర్యుద్ధంలో ఆహుతి కావడమా?

ఈ రెంటిటిలో ఏదోఒక మార్గంచేపట్టాలి. కాంగ్రెసు కేవలం ముస్లింలీగ్‌ను ఖండిస్తూ, గవర్నరు సహాయంకోరుతు చేయిచాచి ఆత్మరక్షణచేసుకోవాలనిందని విజ్ఞప్తులుచేస్తే, ప్రయోజనం ఉండదు.

పరిస్థితులు ఇప్పటికే విషమరూపం దాల్చాయి. "నౌఖలీ దురంతాలకు ప్రతీకారం చెయ్యాలి" అనే నినాదంతో హిందూమహాసభ నాయకులు కాంగ్రెసు అనుచరుల్ని ఆవేశపరుస్తున్నారు. నౌఖలీ తర్వాత ఛాప్రా (బీహార్), లూధియానా (పంజాబ్) పట్టణాలలో కల్లోలాలు జరిగాయి. కలకత్తా, బొంబాయి నగరాలలో శాంతి పరిస్థితులు లేర్పడకపోవడమేగాక, నానాటికి కలహాలు వ్యాపిస్తున్నాయి. దేశమంతటా కొట్లాటల వాతావరణం అలముకొంటున్నది.

కార్మికుల కర్తవ్యం

సంఘటితకార్మికవర్గం మాత్రమే, యీ కల్లోలాలలో ఐక్యంగా నిలవకలిగింది. ముందుముందు కార్మికులు నెరవేర్చవలసిన బాధ్యతలు చాలా ఉన్నాయి.

ప్రజాసామాన్యానికి వారొక మార్గంచూపవలసియుంది.

ఈ కల్లోలాలకు కారణమైన బ్రిటిష్ ప్లానును వ్యతిరేకిస్తూ బ్రహ్మాండమైన సభలు, ప్రదర్శనలు జరపాలి.

ప్రజలందరికీ రక్షణ యివ్వడానికి, అన్ని పార్టీలవారితో కలిసి ఐక్య శాంతిరక్షణ కమిటీల నేర్పరచాలి.

శరణార్థులను రక్షించి, వారికి సహాయం చేయాలి.

ఆచరణలో హిందూ - ముస్లిం ఐక్యతను సాధించడ మెలాగో, ప్రజలకు చూపాలి. అన్నదమ్ముల కలహాలవల్ల స్వాతంత్ర్యం రాదనే విషయం కాంగ్రెసు ప్రజా సామాన్యానికి, లీగ్ ప్రజాసామాన్యానికి, ప్రబోధం చెయ్యాలి. భేదాభిప్రాయాలను ప్రజాతంత్ర పద్ధతులతో పరిష్కరించుకోవాలని నచ్చచెప్పాలి.

బ్రిటిష్ ప్రణాళికను అమలు జరపదలంచే, హిందూ - ముస్లిం కొట్లాటలలో ఒండొరులు హత్యలు చేసుకొంటూ, స్వాతంత్ర్యం మాట మరచి పోవడమన్న మాట.

ఇప్పుడు కాంగ్రెసు-లీగ్‌నాయకు లవలంబించే విధానం, వాటినుంచి బయటపడ్డానికి మార్గంచూపదు. పైగా, ఇంకా లోతుగా దిగబడతాం.

దేశమంతటా - కార్మిక సమ్మెలవెల్లువ, జమీందారీ వ్యతిరేక పోరాటాలు, తెలంగాణ ప్రజలలో నూతన చైతన్యం, తిరువాన్కూర్ సంస్థానప్రజల వీరోచిత ప్రతిఘటన-ఇవన్నీ ప్రజావెల్లువ చిహ్నాలు. ఒకవైపు కలకత్తా, నౌఖలీలలో హిందూ - ముస్లిం కొట్లాటలు జరిగే సమయంలోనే, యీవిప్లవ వెల్లువ నలుమూలలకు వ్యాపిస్తోంది. బ్రిటిష్‌ప్లాను ఒకవైపు అమలు జరుగుతూన్నప్పటికీ, భారత విప్లవోద్యమం ఫలించి తీరుతుందనే ఆశ వీటివల్ల ద్యోతకమవుతుంది. మనం కూడా ఈఉద్యమానికి బలంచేకూర్చి మన కర్తవ్యాన్ని నిర్వహించవలసియుంది.

హిందూ - ముస్లిం కొట్లాటలను నిరోధించుదాం. వాటివల్ల మనకు లభించేవి పోలీసురాజ్యం, మిలిటరీకాల్పులు.

రైతులు, కార్మికులు, ప్రజాసామాన్యం ఐక్యతతో తమ హక్కులకై పోరాటాలు ప్రారంభించేలా చేయూతనిద్దాం.

జమీందార్ల అక్రమాలు

(13 వ పేజీ తరువాయి)

ఇటువంటి కుట్రలన్నీ పన్ని రైతుల భూముల్ని జమీందార్లు అపహరించాలెనని చూస్తుంటే, స్థానికోద్యోగులూ, పోలీసులూ అంగబలం, అర్థబలమున్న జమీందార్లకే మద్దతిస్తున్నారు కాని, రైతాంగం యొక్క హక్కుల్ని సంరక్షించుటకై పూనుకోవటమేలేదు.

ఈ క్రింది ఉదాహరణలు ఈ విషయాన్ని మరింత స్పష్టపరుస్తాయి.

— గాజుల్లంకరైతులపై దాడిచేయటానికి కత్తులు కఠారులతోవున్న చల్లపల్లి రాజా జనాన్ని అరెస్టుచేసినూడ ఊరికే వదలేశారు. కష్టించి పండిచుకొంటున్న భూముల్లోకి రైతులనేమో అడుగుపెట్టవద్దన్నారు.

— కలవలపల్లి ఎస్టేట్‌లో తమ భూములనూ, పంటలనూ కాపాడుకుంటున్న రైతుల్ని అతి క్రూరంగా హింసించిన జమీందారు మనుష్యుల్నిగానీ, జమీందారును గానీ ఇంతవరకు అరెస్టు చెయ్యలేదు.

— గంపలగూడెం ఎస్టేట్‌లో ఎరుకోపాడు రైతుల్ని భూములనుండి వెళ్ళగొట్టాలని జమీందారు ప్రయత్నిస్తుంటే పోలీసులు జోక్యం కల్పించుకోనేలేదు. పైగా తమ హక్కులను కాపాడుకున్నందుకుగాను రైతులపై క్రిమినల్ కేసులుపెట్టారు. రైతు సేవకుడు రంగారావుగారిని అరెస్టుచేశారు.

—జీడిగుంటలో విడవోలుపోలీసు సబిన్‌స్పెక్టరు కూలీపేటల్లోకి వచ్చి కనపడ్డవారినల్లా తిట్టాడు. కొడతాననీ, కేసులు పెడతాననీ బెదిరించాడు. తలకు 25 రూ. చొప్పున లంచాలివ్వమని నిర్బంధించాడు. ఇవ్వకపోతే జైల్లో పెడతానన్నాడు.

ఇలాగనే ఎక్కడ పడితే అక్కడ, జమీందార్లు అడగటమే తడవుగా 144, 145 సెక్షన్లు వచ్చి పడుతున్నాయి.

కాంగ్రెసుమంత్రులు తమకర్తవ్యాన్ని గుర్తించాలి. తక్షణం యీ పనులు చెయ్యాలి.

—కౌలుదార్ల రక్షణ చట్టంలోనూ, అటవీ రక్షణ చట్టంలోనూ నిర్వచించినట్లుగా భూములపై రైతులహక్కుల్ని కాపాడటానికి తగిన రక్షణ ఏర్పర్చాలి. ఇట్టి రక్షణ నేర్పరచకపోతే జమీందారీ విధానం రద్దుకావాలని చెప్పటం వట్టిబూటకమే ఔతుంది. జమీందార్లకు రైతులకూ జరుగుతున్న పోరాటాల్లో పోలీసులు జోక్యం కల్పించుకోకుండా చెయ్యాలి.

రైతుల కర్తవ్యం

కాంగ్రెసు మంత్రులు రైతులకుతగిన రక్షణ నేర్పర్చు వరకూ రైతాంగం తీవ్రమైన ఆందోళన చెయ్యాలి. రైతుల హక్కుల్ని అపహరించుటకై జమీందార్లుచేస్తున్న కుతంత్రాలను ఏమాత్రమూ సాగనివ్వకూడదు. ఈకర్తవ్య నిర్వహణకై ఎంత ఐక్యంగా ప్రతిఘటిస్తారో, అంతగా తమ హక్కులను రక్షించుకోగల్గుతామన్న సత్యాన్ని రైతాంగం గుర్తించాలి.

పెట్టుబడిదార్లు పీల్చిపిప్పిచేస్తున్న ★ ★ ★ ★ ఫ్యాక్టరీ కార్మికుల జీవితం

జనవరి సీజనుకు ముందే పోరాటం అవశ్యకత

యల్. వి. రత్నం

రైస్ అండ్ ఆయిల్‌మిల్లు కార్మికులు సమాజానికి వెన్నెముకలాంటివారు. యుద్ధకాలంలో ఆంధ్ర ప్రజానీకానికి యీ కార్మికులు అమోఘమైన సేవచేశారు. యజమానులు బ్లాక్‌మార్కెట్టు కొనసాగించడానికి, ఇంట్లోనే దేశసంగి విధానాన్ని వ్యతిరేకిస్తూ, ప్రజలకు బియ్యంలేకుండా చేయడానికి ఫాక్టరీలను మూసివేసే పరిస్థితులలో కార్మికులు అడ్డుపడ్డారు. తాము జీవించడానికి న్యాయమైన జీతాలు, యితర సౌకర్యాల విషయం ఎలావున్నా, ప్రజలయందు విశ్వాసంతో మిల్లులు మూతపడకుండా కాపాడారు. కరువుకాటకాల దినాలలో రేయింబవళ్ళు పనిచేసి, ప్రజలకు బియ్యాన్నందించారు. కాని యజమానివర్గంమాత్రంకార్మికులసౌకర్యాలను తలపెట్టలేదు. క్రమేపీ కార్మికులు యజమానుల పేరాసకొద్దీ సాగించిన దోపిడీ విధానాన్ని ఎదుర్కొన్నారు. నీతి నియమాలులేని బ్రిటిషు సామ్రాజ్యవాదుల అండతో యజమానివర్గం,యుద్ధంకాలంలోనూ, తర్వాతనూ అటు దొంగమార్కెట్టుద్వారా ప్రజానీకాన్ని, యిటు స్వల్ప జీతాలతో ఫాక్టరీ కార్మికులను అతిదారుణంగా దోచుకొన్నారు. నిజం చెప్పాలంటే యుద్ధంవల్లనే యజమానులు లక్షలు ఆర్జించారు. రేయింబవలు చమటోడ్చి కష్టించి పనిచేసే ఫాక్టరీ కార్మికులస్థితి ప్రమాదకరంగా తయారయింది.

పేరుకుమాత్రమే చట్టాలు

కార్మికుల యిబ్బందులను విచారించే దిక్కులేని రోజులలో, యజమానులు పనిగంటల పరిమితి లేకుండా కార్మికులతో అహర్నిశలు పనిచేయించుకొనేవారు. భారత కార్మికవర్గం సంపాయించుకొన్న పనిగంటల చట్టాన్నికూడా, యజమానులు వుల్లంఘించారంటే ఆశ్చర్యంలేదు. 1922 లో ఫ్యాక్టరీ చట్టం, 1923 లో కార్మికులకు కంపెన్‌సేషన్ చట్టం ఏర్పడినా, యివి నామమాత్రంగానే వుండిపోయాయి. పేరుకు చట్టాలు చేశామని చెప్పుతున్నా, ప్రభుత్వం ఆచరణలో యజమానులకే మద్దతుయిచ్చింది అసలు యీ చట్టాలు తమకొరకు వున్నాయన్న సంగతి 1943 వరకు అమాయిక ఫ్యాక్టరీ కార్మికులకే తెలియదు.

దాదాపు 20 సంవత్సరాలపాటు ఈ చట్టాలు రైస్ ఫ్యాక్టరీ కార్మికులకు ఎంతవరకు అమలు జరిగిందీ చూద్దాం.

(1) ఫ్యాక్టరీ చట్టం ప్రకారం వారానికి 54 గంటలకు మించి పనిచేయకూడదు.

(2) పనివారల ఆరోగ్యానికిగాను ఫ్యాక్టరీలను శుభ్రంగా వుంచాలి.

(3) కార్మికులకు మంచినీళ్ళు వసతి, విశ్రాంతిగదుల, మరుగుదొడ్లు ఏర్పర్చాలి.

(4) మిషన్లవద్ద పనిచేయు కార్మికులకు అపాయం కలుగకుండా ఫెన్సింగు వుంచాలి.

(5) మిషన్లవద్ద స్త్రీలతో పనిచేయించరాదు.

(6) రాత్రులందు స్త్రీలతో పనిచేయించరాదు.

(7) మెటర్నిటీ చట్టం ప్రకారం గర్భిణీ స్త్రీలకు బెనిఫిట్ యివ్వాలి.

(8) ఆదివారం ఫ్యాక్టరీ మూసివేయాలి. ఏ పరిస్థితులలోనయినా ఫ్యాక్టరీ పనిచేయాల్సివస్తే సోమ, మంగళ, బుధవారాలలో ఒక రోజు సెలవు యివ్వాలి.

(9) ఓవర్‌టైమ్ పనికి 1 రెట్లు జీతం యివ్వాలి.

(10) ఫ్యాక్టరీలలో కార్మికులకు కలిగే అపాయాలకు కంపెన్‌సేషన్ యివ్వాలి.

యీ పై సౌకర్యాలు అమలుపర్చకపోవడమే కాకుండా, యజమానులు ఖుండ్లపద్ద కార్మికులతో వెట్టిచాకిరీలు చేయించుకొనేవారు. యజమానుల యిండ్లను సాంతం దగ్గరనుండి, అడ్డమైనచాకిరీ చేయాల్సి వచ్చేది. కాలపరిమితిలేకుండా ఫ్యాక్టరీలలో పని, వెట్టిచాకిరీ చూస్తూంటే బానిసయుగం జ్ఞప్తికి వస్తుంది.

దినదిన గండమైన జీవితం

యిక కార్మికుల జీతాల విషయం మరీ అధ్వాన్నంగా వుంది. అతి హీనమైన జీతాలవల్ల నానాటికి కార్మికుల జీవిత పరిస్థితులు విషమరూపం దాల్చాయి. ఫ్యాక్టరీల చట్టం ప్రకారం, కార్మికులకు పై సౌకర్యాలు లేకపోవడంవల్ల ఘోర వ్యాధులకు గురికావలసి వస్తోంది. అనేకమంది దగ్గుతోనూ, [illegible] మసకలతోనూ బాధపడాల్సిన గతి పట్టింది. మెషిన్ల విషయంలో యజమానులు ఫెన్సింగు వేయకపోవడం, పనక్కర్లకు దుస్తులు యివ్వకపోవడంవల్ల, చీటికి మాటికి కార్మికులు ప్రమాదాలకు గురి అవుతూ వచ్చారు. సకాలంలో మిషన్ల రిపేరు జేయకుండా అశ్రద్ధచూపడంవల్ల అనేకమంది కార్మికులు ప్రాణాలు కోల్పోవడం, శాశ్వత అంగవైకల్యం సంభవించడం జరిగింది. యీ రకంగా అపాయాలకు గురి అయిన కార్మికులకు, వారి కుటుంబాలకు చట్టరీత్యా కించిత్తయినా యజమానులు ధన సహాయం చేసేవారు కాదు. లేబరు ఆఫీసర్లకు లంచాలు మేసి, కార్మికులను మోసం చేసేవారు. ఒక్క మాటలో చెప్పాలంటే కార్మికులను పశువులకంటె అన్యాయంగా చూచారు. దేశభక్తి పేరుతో కాంగ్రెసు ముసుగు వేసుకొని పెద్ద పెద్ద నీతులతో దంబాలుకొట్టే యజమానులు కూడా, కార్మికులకు అన్యాయంచేసి లక్షలు ఆర్జించారన్న విషయం చరిత్ర కాదనలేదు. 20 - 30 సంవత్సరాల అనుభవంవల్ల మన మెకానిక్కు, డ్రయివర్లు వందలు, వేలూ జీతాలు తీసుకొనే యింజనీర్లను కూడా ఆశ్చర్యపర్చే టెక్నికల్ పరిజ్ఞానాన్ని సంపాదించారు. యింత చాకచక్యం వున్నప్పటికి పరాయిప్రభుత్వ దోపిడీ విధానంవల్ల మన దేశంలో పరిశ్రమాభివృద్ధి లేక నేటి మనమెకానిక్కు, డ్రయివర్లు అతి నికృష్టమైన జీవితాన్ని గడపాల్సిన గతి పట్టింది.

నివురుగప్పిన నిప్పు ప్రజ్వలించింది

యుద్ధారంభంనుండి జీవితవస్తువుల ధరలు రోజురోజూ విపరీతంగా పెరిగిపోవడం, ఆదాయం మాత్రం మామూలు స్థితిలోనే వుండడంవల్ల, కార్మికులలో తీవ్ర సంచలనం బయలుదేరింది. యజమానుల అత్యాచారాలనుండి బయటబడి తమ నికృష్ట స్థితిని తొలగించుకోడానికి ఫాక్టరీ కార్మికులంతా పిడికిలి బిగించారు. జీవితంకొరకు దేశంలో సోదర కార్మికులు సాగించే పోరాటాలు విశ్వాసాన్ని కలిగించాయి.

1943 నాటికే జీవితవ్యయం దారుణంగా పెరిగింది.

ఉదా:

1939	అగస్టులో	95	పాయింట్లు
1943	జనవరిలో	170	,,
1944	,,	220	,,
1945	,,	265	,,
1946	అగస్టులో	309	,,

1943 వరకు రైస్ ఫాక్టరీల కార్మికుల జీతాలు ఎంతమాత్రం పెరగలేదు. యజమానుల అడుగు జాడలలో మెదిలే రోజులకు స్వస్తి చెప్పారు. అప్పటికే పట్టణాలలో మునిసిపల్ కార్మికులు, రైల్వే కార్మికులు సాగించే పోరాటాలను ప్రాతిపదికగా తీసుకున్నారు. మొట్టమొదట తెనాలి, ఏలూరు, బెజవాడ, గుడివాడ పట్టణాలలో రైస్ అండ్ ఆయిల్‌మిల్లు కార్మికులు సంఘటిత పర్చబడ్డారు.

ప్రతిచోట యజమానుల అఘాయిత్యాలకు వ్యతిరేకంగా [illegible] పోరాటాలు సాగించారు. యీ పోరాటాల ఫలితమే నేటి రైస్ మిల్లు కార్మికోద్యమం క్రిష్ణా, ప॥ గోదావరి, గుంటూరు జిల్లాలలో విజృంభించింది.

యీ వుద్యమం ప్రభావంవల్ల మద్రాసుఎసెంబ్లీ ఎలక్షన్లులో లేబరు అభ్యర్థిని గెలిపించుకొన్నారు. యీ ఎలక్షన్ సందర్భంలోనే ఫ్యాక్టరీ కార్మికోద్యమాన్ని విచ్ఛిన్నం చేయడానికి కాంగ్రెసు ముసుగుతో యజమానివర్గం సాగించిన ఘాతుక చర్యలను ఎవ్వరూ మరువలేరు.

దురాశతో యజమానుల దారుణాలు

యుద్ధానికిముందు ఫ్యాక్టరీ యజమానులు మిల్లింగురేటు బ 1 కి 0-3-0 నుండి 0-3-6 వరకు నిర్ణయించేవారు. అప్పటిపరిస్థితులలో యిదిమార్కెటురేటుగా వుండవచ్చు 1943లో బ 1 కి 0-8-0 నుండి 0-10-0 వరకు ప్రభుత్వమే నిర్ణయించింది. దీన్నిబట్టిచూస్తే 3 రెట్లు మిల్లింగురేటు పెరిగింది. యీనామాషాను బట్టయినా ధరల పెరుగుదలనుబట్టి కార్మికుల జీతాలుకూడా3రెట్లుపెరగాలి. కాని,ప్రజలప్రాణాలలోచలగాటమాడేపెట్టుబడిదారులు కార్మికుల జీతాలు మాత్రం, బుద్ధి పూర్వకంగా పెంచిన పాపానపోలేదు. అందుచేత వర్కర్సుకు యజమానులమీద విశ్వాసం నశించింది. తమ జీవిత హక్కులకొరకు తీవ్రంగా పోరాడారు. యీ పోరాటాలఫలితంగా నూటికి 25 నుండి 50 వరకు మాత్రమే జీతాలు పెరిగాయి. భీమవరం - పాలకొల్లు నరసాపురం - అకివీడు ఫాక్టరీ కార్మికులకు అసలు ఏ మాత్రం జీతాలు పెరుగలేదు. చాలా పట్టణాలలో యజమానులు సీజన్ టైమ్‌లో ఫాక్టరీలు రేయింబవలు ఆడిస్తూన్నారు. రాత్రిపూటపని భీమవరం మొదలగు ప్రాంతాలలో వుచితంగా చేయించుకొంటున్నారు. చిన్నపిల్లల చేతిలో బెల్లంపెట్టి ఓదార్చినట్టు, రాత్రిపూట పనికి టిఫిను(ఖర్చు)క్రిందమాత్రం 2-0-0 రూపాయలు యిస్తారు. ఏలూరు, బెజవాడ, గుడివాడ, బందరు, తాడేపల్లిగూడెం, తెనాలి ప్రాంతాలలో యజమానులు ఫాక్టరీలను రేయింబవలు 6 మాసాలు ఆడించి, మిగతా కాలం కట్టివేస్తూ వర్కర్సును నిరుద్యోగానికి అప్పచెపుతున్నారు.

యిందువల్ల వర్కర్సు ఆరోగ్యం అనతికాలంలో నశించడం, ఓవర్‌టైమ్, రాత్రి డ్యూటీలకు ప్రతిఫలం లేకపోవడం కార్మికులలో తీవ్రమైననిరుత్సాహాన్ని కలుగజేసింది. ఆరుగాలం పనిచేసి పస్తులతోమాడి చావాల్సిన గతి ఎందుకు పడుతోందో వర్కర్సు తెలుసుకున్నారు.

కార్మికులు సాధించిన విజయాలు

ఇంచుమించు అన్నిప్రాంతాల వర్కర్సు తమ సంఘశక్తితోనే యీక్రింది విజయాలు సాధించుకొన్నారు.

(1) రేయింబవలు యజమానులకు చేసే వెట్టిచాకిరీలు పోగొట్టుకొన్నారు.

(2) ఫ్యాక్టరీ చట్టాన్ని కొంతవరకు అమలు పర్చేటట్లు చేసుకొన్నారు.

(3) ఫ్యాక్టరీలలో జరిగే అపాయాలకు ప్రతిచోట కంపెన్‌సేషన్ రాబట్టు కొంటున్నారు.

(4) జీతాల [illegible] పెంపుదల నూటికి 25 వంతులు నుండి 50 [illegible] వరకు జరిగింది.

(5) ఏలూరు, బెజవాడ మొదలగు కొన్ని ప్రాంతాలలో ఓవరుటైమ్‌పనికి 1½ రెట్లు జీతం సంపాదించుకున్నారు.

(6) వారానికొకరోజు సెలవు పొందుతున్నారు.

ఈ పై విజయాలు సంపాదించినా ఇంకా ప్రధాన సమస్యలు అట్లాగే వుండిపోయాయి. అన్నిటికంటే విశేషమేమంటే, యజమానుల ఘాతుకకృత్యాలను ఎదుర్కొని కార్మికులు నిలబడగలిగారు.

శైశవాస్థనుండి తప్పటడుగులు వేసుకుంటూ వుద్యమం ముందుకు నడుస్తోంది. ప్రతిచోట పునాదులు గట్టిపడ్డాయి. పై విజయాలను ఆధారంచేసుకొని, న్యాయమైన హక్కులు సాధించుకొనేందుకు ఫ్యాక్టరీ కార్మికులు ఎలుగెత్తి చాటాల్సివుంది.

ఫ్యాక్టరీ కార్మికుల కోర్కెలు

జీతాలు

(1) మెకానిక్స్‌కు, డ్రైవర్లకు నెలకు 50 రు ఆరంభంచేసి సంవత్సరానికి రు 5 యింక్రిమెంటుతో యిప్పటివరకున్న సర్వీసునుబట్టి అమలు జరపాలి.

(2) హల్లర్, షల్లర్ మెన్, ఫైర్ మెన్లకు నెలకు 40-0-0 నుండి 3-0-0 యింక్రిమెంటుతో,

(3) ఆయిల్‌మెన్స్‌కు 30-0-0 నుండి సం॥ 2-0-0 యింక్రిమెంటుతో,

(4) ముఠాకూలీలకు కంట్రాక్టుపద్ధతి రద్దుచేసి నెలకు 45-0-0 జీతం ఏర్పరచాలి.

(5) డ్యూటీకూలీలకు నెల 1 కి 30-0-0 జీతం యివ్వాలి.

సర్వీసు

ఫాక్టరీలో పనిచేయువారందరును తక్షణమే పర్మనెంటుచేయాలి. సర్వీసు గ్యారంటీ యివ్వాలి.

(మిగతా 16 వ పేజీలో)

కాంగ్రెసు వేషంతో మిల్లు యజమానులు తమ దోపిడీవిధానాన్ని కప్పుచ్చుకుంటున్నారు

(16 వ పేజీ తరువాయి)

ప్రతి ఫాక్టరీలోనూ స్టాఫ్ చాలా తక్కువగా వుంటోంది. చాలా మిల్లులలో వున్న స్టాఫ్‌ను తగ్గిస్తున్నారు. ప్రతి ఫాక్టరీలోనూ ఫైర్‌మన్, ఆయిల్‌మెన్, డ్రైవరు, అసిస్టెంటు డ్రైవరు, హల్లర్‌మన్, షల్లర్‌మన్ కనీసం వుండాలి. హల్లరు, షల్లర్లవద్ద చేమేస్త్రీలు ఇవ్వబడుతుండాలి. హెచ్చు మిల్లులలో యీ విధంగా స్టాఫ్ లేదు. సైరంగా స్టాఫ్‌ను వేయాలి.

రాత్రులందు ఫ్యాక్టరీలు ఆడించరాదు

ఇప్పటివరకు యజమానులు కార్మికులకు జీతాలు పెంచకుండా రేయింబవలు పనిచేయిస్తున్నారు. ప్రతి సంవత్సరం కొత్త ధాన్యంవచ్చినప్పుడు 4 మాసాలు రేయింబవలు ఆడిస్తూ, సంవత్సరంలో 6 మాసాలు ఫ్యాక్టరీలు కట్టివేసి, కార్మికులను నిరుద్యోగులను చేస్తున్నారు. ఇకమీదట యీ పద్ధతి మాని, ఏ పరిస్థితిలోనూ రాత్రిపూట ఫ్యాక్టరీ ఆడించడం పనికిరాదని, పగలు 8 గంటలకు మించి ఆడించకూడదని, ప్రభుత్వం వెంటనే చర్యతీసుకోవాలి.

ఇతర సౌకర్యాలు

(1) ఫ్యాక్టరీచట్టాన్ని అమలు పర్చాలి.

(2) ఓవర్‌టైమ్ పనిచేయించకూడదు.

(3) ప్రతిఆదివారం ఫ్యాక్టరీనికట్టివేయాలి.

(4) సంవత్సరానికి 1 నెల రోజులు నిక్కచ్చి, 10 రోజులు కాజువల్ లీవు నిండు జీతంతో యివ్వాలి.

(5) ప్రావిడెంటుఫండుపద్ధతి ఏర్పర్చాలి.

(6) మెటర్నిటీ చట్టం ప్రకారం స్త్రీ కూలీలకు సౌకర్యాలు కలుగచేయాలి.

(7) దుస్తులు అమలు జరపాలి.

(8) సంవత్సరానికి 2 మాసాల జీతం బోనసుగా యివ్వాలి.

(9) వర్కుర్సుకు యింకా సౌకర్యాలు చూపెట్టాలి.

నిరుద్యోగభత్యం

ప్రభుత్వం ప్రకటించిన నిరుద్యోగభత్యమైనా వర్కర్సుకిందకు తక్షణమే అమలుజరపాలి.

సంఘాలను గుర్తించాలి

యజమానులు కార్మిక సంఘాలను గుర్తించాలి. ప్రతి ఫ్యాక్టరీకమిటీని గుర్తించి వారితో వ్యవహరించాలి.

కార్మికుల కర్తవ్యాలు

ఈ ప్రధాన కోర్కెలమీద కార్మికులంతా తీవ్రమైన ప్రచారాన్ని సాగించాలి. ఆయా పట్టణాల ప్రజలలో కార్మికుల ఘోర పరిస్థితులన్నీ ప్రచారం చేయాలి. దయా దాక్షిణ్యం లేకుండా యజమానులు కార్మికులను ఎలా పీడిస్తున్నారో వివరాలతో కరపత్రాలద్వారా రుజువు చేయాలి. ఏటేటా యజమానులు గడించే లాభాలు-వర్కర్సుకు ఇచ్చే స్వల్ప జీతాల బండారాన్ని బట్టబయలు చేయాలి.

ఉదా 1939 లో రైస్ ఫ్యాక్టరీలు 2 వేలనుండి 3 వేల వరకు అద్దెకు యిచ్చేవారు. యుద్ధకాలంలోనూ, యిప్పుడు 6 వేల నుండి 10 వేల వరకు అద్దె వున్నట్లు తెలుస్తోంది. ఒకొక్క ఆయిల్ ఫ్యాక్టరీకి సంవత్సరానికి, 25 వేల నుండి 35 వేల వరకు లాభాలు వచ్చినట్లు లెక్కలు చెపుతున్నాయి. ఇది కాంగ్రెసుమార్కెట్ల అర్జన చెప్పనలవికాదు.

గత 6 సంవత్సరాలలో అధికలాభాలతో మత్తెక్కినయజమానులవర్గాన్ని ఎదుర్కొని తమ కోర్కెలు సాధించుకోడానికి ఫ్యాక్టరీ కార్మికులంతా సంఘాలలో చేరి బలపర్చుకోవాలి. యజమానుల తియ్యని మాటలకు భ్రమపడి మోసపోకుండా, కార్మికులలో ఐక్యతను కాపాడుకోవాలి. ప్రతి నెల చందాలు చెల్లించాలి.

యీవిధంగా సంఘాలను బలపర్చుకోడానికి ప్రతి ఫ్యాక్టరీలోను, ముగ్గురతో కూడిన కమిటీని ఎన్నుకొని, కార్యక్రమం సాగించాలి.

ప్రభుత్వానికి సూచనలు

అవ్యవస్థిత ప్రభుత్వం అవలంబించే పాడువైఖరివల్లనే, ఫ్యాక్టరీలు హెచ్చుకాలం మూతపడి కార్మికులు నిరుద్యోగానికి బలి అవుతూ వచ్చారు. యీ అవకాశాన్ని తీసుకొని, యజమానులు తమ యిష్టం వచ్చినట్లు ప్రవర్తించారు. కార్మికులు హెచ్చు జీతాలడిగితే, దీనిని సాకుగా తీసుకొని, ఫ్యాక్టరీలు కట్టివేస్తామని, బెదిరిమాటికి బెదరించడం పరిపాటి అయింది. ప్రతి జిల్లాలోనూ వున్న అన్ని ఫ్యాక్టరీలు సక్రమంగా ఆడటంలేదు. పట్టణాలలో వున్న ఫ్యాక్టరీలకు ధాన్యంకూడా వుండడంలేదు. దీనికి ముఖ్య కారణం ప్రభుత్వ కంట్రాక్టుపద్ధతి. పల్లెటి ప్రాంతాల ఫ్యాక్టరీలకు కావలసినంతధాన్యం సప్లయి అవుతోంది. అందువల్ల ప్రభుత్వం వెంటనే జిల్లాలోవున్న ధాన్యం, అన్ని రైస్ ఫ్యాక్టరీలకు హార్పు పరువుసుబట్టి పంపిణీ చేయాలి. యీ విధంగా ప్లాను వేసి నడిపించినట్లయితే ఫ్యాక్టరీకార్మికులను నిరుద్యోగానికి గురికాకుండా ఆపగలుగుతాం. కార్మికులశ్రేయస్సుకు వ్యతిరేకంగా ప్రవర్తించే యజమానుల ఫ్యాక్టరీలను ప్రభుత్వమే వశపర్చుకొని నడిపించాలి.

యజమానుల కుట్రను ఎదుర్కోవాలి

ఫ్యాక్టరీ కార్మికోద్యమం బలపడుతూన్న కొలదీ యజమానులు కక్షతో దాడి ప్రారంభిస్తున్నారు. కార్మికులలో వచ్చిన సంచలనానికి భయపడి యజమానులు కాంగ్రెసు ముసుగు వేసుకొన్నారు. ప్రతి సమస్యను కాంగ్రెసు - కమ్యూనిస్టు తగవుగా చిత్రించుతున్నారు. యిటీవల బెజవాడ ధనలక్ష్మి ఫ్యాక్టరీ తగవు, ఏలూరు సుదర్శన ఆయిల్ మిల్లు తగవు, గుడివాడ ఇద్దుమిల్లువారి ఫ్యాక్టరీ తగవు, గుంటూరు పాండురంగ రైసుమిల్లు తగవులు మనకు యీ విషయం స్పష్టంగా బోధపరుస్తున్నాయి. ఒకప్రక్క కార్మికుల కడుపుకొట్టుతూ, రెండవప్రక్క కాంగ్రెసు వేషంతో ప్రజలను మభ్యపరుస్తూ యజమానులు తమ దోపిడీవిధానాన్ని కప్పిపుచ్చుకొంటున్నారు. కొన్నిచోట్ల కార్మికులను వుద్ధరించేవారిలాగా, యజమానులు పోటీసంఘాల కార్యక్రమానికికూడా దిగారు. యిలాంటి పరిస్థితులలో ఫ్యాక్టరీ కార్మికులు మెలకువగా వుండాలి. జనవరి సీజన్ రాకముందే పోరాటాన్ని ప్రారంభించాలి. సభలు, సమావేశాలు, ప్రదర్శనాలద్వారా ఫ్యాక్టరీ కార్మికుల కోర్కెలు ప్రజాసామాన్యంముందు ఎలుగెత్తి చాటాలి. కార్మికుల కోర్కెలు తీర్చడానికియజమానులు అంగీకరించకపోతే, ప్రతి ఫ్యాక్టరీ కార్మికుడు సమ్మెకు సిద్ధం కావాలి. ఫ్యాక్టరీ కార్మికుల పోరాటాన్ని సోదర కార్మికులు, మిగతా ప్రజాసామాన్యం బలపరుస్తూ అండగా వుంటారు. ఫ్యాక్టరీ కార్మికులం ఒంటరిగా వుంటామనే రోజులు గతించాయి. న్యాయంకోసం, జీవనభృతి కోసం, నిరంకుశ విధానానికి వ్యతిరేకంగా సాగించేపోరాటంలో కార్మికవర్గమూ ప్రజలూ వారిని బలపర్చుతారు.

నవంబరు 7

★

శ్రీరామకవచం వెంకటేశ్వరశాస్త్రి

★

లేవండోయ్ కార్మికులారా
రా రండోయ్ కర్షకులారా
శ్రామికవర్గ సంకెలవీడి
శ్రామికరాజ్యం శాంతిరాజ్యము
జయపతాక నెగురవేసిన
పీడితప్రజల పండుగదినమిది ॥లేవం॥

స్వతంత్రకాముక సోవియట్ప్రజకు
సంకెలవేసిన సామ్రాజ్యవాదులు
భారతభూమిని బ్రద్దలుచేయగ
పన్నెదు కుట్రల బయలుచేయగ ॥లేవం॥

కాకలుదీరిన కార్మికశక్తుల
కవోష్ణరక్తం కాలువగట్ట
ప్రజావుద్యమాల్ భగ్నపరచెడి
ప్రజాపీడకుల పరిమార్పంగ ॥లేవం॥

సోదరప్రజల నఖ్యతచెరచి
మతకుల కక్షకు మార్గముచేసిన
దేశద్రోహుల దుండగీడుల
పీడకలలను కల్లపరచగ ॥లేవం॥

నైజాం నాజీ నరకపాలన
జమీందారుల జులుముతోడుగ
బోల్షివిస్టులాతీ వల్లెవల్లెల
పాలిస్తోంది పేదప్రజలపై ॥లేవం॥

బానిసవిద్యా బాధలుమీరె
స్వేచ్ఛాకాంతులు చూపులుమాసె
కోర్కెలుతీరని కార్మికప్రజల
కవోష్ణరక్తం పొంగులుదీరె ॥లేవం॥

వైదేశికుల విషపుపాలన
విషఫలితాలు వినపడుతున్నయ్
భారతీయుల భావిజీవిత
విషమఘట్టం వేరులువేసెను ॥లేవం॥

కడుపుకుతిండి కట్టగబట్ట
కాటకమొచ్చిన కరువురోజుల
యంత్రపరిశ్రమ లసహ్యమంటె
కోట్లప్రజలకు కూడేదనుచు ॥లేవం॥

అధికాహారోత్పత్తిని జేయగ
సస్యశ్యామల భూమినిచూడగ
విప్లవపు శంఖమునూది
విప్లవగీతిక వియత్తునంటగ ॥లేవం॥

— విప్లవం వర్ధిల్లాలి —

తగ్గింపు ధరలు

★

1	అంతిమపోరాటానికిఐక్యమవుదాం		0- 1.0
2	కాంగ్రెసుకార్యవర్గానికి కమ్యూనిస్టుల జవాబు	1 భా	0- 8.0
3	..	2 భా	0.12.0
4	..	3 భా	0.12.0
5	అందరికి తిండి		0- 4.0
6	అందరికి ఉద్యోగాలు		0- 4.0
7	మేము కాంగ్రెసులో ఎందుకు చేరలేదు?		0- 4.0
8	అంతిమపోరాటానికి కదలిరండు		0.10.0
9	సిక్కు మాతృభూమి		0- 4.0
	మొత్తం ధర		3.11.0
	సెట్టు ఒకేసారి కొనువారికి ధర		2- 0.0

★

ప్రజాశక్తి ప్రచురణాలయం
మొగల్రాజపురం, బెజవాడ

—తాత్కాలిక ప్రభుత్వం— వైస్రాయి సలహాసంఘం మాత్రమే

మిలిటరీ అధికారులకు ఆస్టరన్ కమాండర్ పంపిన సర్క్యులరు

“కేవలం భారతీయులతోనే కొత్త కార్యవర్గం ఏర్పడింది. అయినా చక్రవర్తి ప్రతినిధియైన వైస్రాయికి సలహా మాత్రమే యిచ్చే మామూలు కార్యవర్గంనాటి పరిస్థితులే ఇప్పుడూ వున్నాయనే సంగతి మరువకూడదు. మీరంతా తీసుకున్నట్టే మంత్రులూ రాజభక్తి ప్రమాణం తీసుకుంటారు.”

ఆస్టరన్ కమాండు అఫీసులోని అఫీసర్లందరకు గతమాసం పంపబడిన సర్క్యులరులో భాగం యిది. క్రమశిక్షణ మీరు రాజభక్తి ప్రమాణమే తీసుకోవాలి సైన్యపు నిబంధనలలో మార్పేమీరాలేదు. అని కల్నల్ కర్తారా సింగ్ తెల్లసైన్యాధిపతి చెప్తున్నాడు.

‘క్రమశిక్షణ, శాంతి’, ‘అ...’ కలిగి వుండాలి సైన్యం

ఇంక పండిట్ నెహ్రూ, ఆయన మంత్రివర్గము వట్టి ‘కార్యవర్గము’, వైస్రాయి ‘సలహాదారులు’ మాత్రమే. మిగిలిన పైని వలందరిలాగే చక్రవర్తియెడ విశ్వాసంగల పాలకులు మాత్రమే.

అందుచేత మిరప్పుడే జాతీయ సైన్యంగా మారిపోయామనుకుని రాజకీయ చర్చలలోకి దిగకండి జాగ్రత. చక్రవర్తి ప్రతినిధులమైన మేమే మీకు నిజమైన యజమానులం.

జాతీయ సైన్యాన్ని గురించి అంత దీర్ఘోపన్యాసం ఇచ్చిన సర్దార్ బలదేవసింగ్ ఈ సైనిక సర్క్యులరు కేమంటాడో. ఈసర్క్యులరు పంపినవారు తాత్కాలిక ప్రభుత్వం అధీనంలో వున్నామంటూనే ఆ ప్రభుత్వానికి సవాలు విసురుతున్నారు.

ఇంతేకాదు, సైన్యాలకోసం చేసిన ఉపన్యాసంలో సర్దార్ బలదేవసింగ్ భారతదేశం యొక్క రక్షణ వ్యవహారించాలని తెగపొగడిన బ్రిటిష్ ఆఫీసర్లు ఈ మాదిరి సర్క్యులర్లు పంపుతున్నారు.

ఇవాళ ‘భక్తి’ సర్దార్ బలదేవసింగ్ ‘జాతీయ సైన్య’మొక్క పలుకుబడి ఇంతే.

బ్రిటిష్-అమెరికన్ సామ్రాజ్యవాదుల స్పర్ధలా - స్నేహాలా

(5 వ పేజీ తరువాయి)

పత్రికలు దాచలేవు. బ్రిటన్—సోవియట్—అమెరికాలమధ్య సహకారంద్వారా ప్రపంచ శాంతిని కాపాడాలని; అభివృద్ధి నిరోధక పంథాను వీడాలని కోరే మన ప్రజలు అమెరికాలోని అభ్యుదయ కాముకవర్గాలతో చేతులు కలపాలి.

‘వెలుగుబాట’లో

అమెరికాలో పెద్దపెద్ద గుత్తవ్యాపారస్థులంతా అభివృద్ధినిరోధకపంథా అవలంబించుతున్నారు. రిపబ్లికన్ పార్టీలోని పెద్దపెద్ద పెట్టుబడిదారులూ, డెమొక్రటిక్‌పార్టీ మితవాదులూ ఈ విషయంలో కలుస్తున్నారు. రూజ్‌వెల్టుకు అపకీర్తితెచ్చిన ట్రూమన్ వీరికి ఆశ్రయమిస్తున్నారు. అటు బ్రిటన్‌లో టోరీలకు, మ్యూనిక్ మువాకు. కమ్యూనిస్టు వ్యతిరేక కార్మిక మితవాద నాయకత్వం ఆశ్రయమిస్తోంది. ఈ రెండు బ్రిటిష్—అమెరికన్ సామ్రాజ్యవాదముఠాలూ. తమ స్వార్థంకోసం, ప్రపంచంపై ఆధిపత్యం సంపాదించ దలచుతున్నాయి. వీరి పంథా బ్రిటిష్—అమెరికన్ ప్రజల ముఖ్యఅవసరాలను తీర్చేదికాదు. పైగా ప్రపంచశాంతికి భంగకరమైంది.

ఒకప్పుడు జపానుతోను అక్షరాజ్యాలతోను సహకారంచేసిన—ఈనాడు అమెరికన్ నైనికబలంతో "స్వతంత్ర" ఫిలిప్పైన్సుకు అధ్యక్షుడుకాగల్గిన — రోక్సాస్, అమెరికా ప్రపంచ దురాక్రమణను ఇలా పొగిడాడు:

"బ్రిటిష్ ఆదినివేశదేశాలు భూగోళరీత్యా అమెరికా రక్షణరంగంలోకి చాలావరకు వస్తాయి. మన రక్షణ — మనకేగాదు తక్కిన ప్రపంచానికి అంతటికీకూడా — అమెరికా వెలుగుబాటలోనే వుంది."

ఇందులో ఆశ్చర్యంలేదు. కాని కార్మిక పార్టీకి చెందిన విదేశాంగమంత్రి బెవిన్‌కూడా ఈపాటనే పాడటంలో అర్థం ఏమిటి?

నిలకడలేని మైత్రి

బ్రిటన్ - అమెరికా సామ్రాజ్యవాదగుత్త వ్యాపారస్తుల మైత్రి అభివృద్ధి నిరోధకమైనదేగాదు, నిలకడలేనిదికూడాను. సోవియట్ యూనియన్‌నూ, ప్రజాతంత్ర యూరప్‌నూ తీవ్రంగా ద్వేషించుటలో ఇవి ఐక్యమైనా, ఒకసంగతి మనం మరచిపోరాదు. ప్రధాన వైరుధ్యాలు కల్గిన రెండు సామ్రాజ్యవాదుల మైత్రి ఇది అని మనం మరచిపోగూడదు. వలసరాజ్య దోపిడీ, మార్కెట్లు, ముడి పదార్థాల సమస్య వచ్చినప్పుడూ యూరప్‌లో, దక్షిణ అమెరికాలో, ఆసియాలో గుత్తవ్యాపార విషయం వచ్చినపుడు ఈ రెండు సామ్రాజ్యవాదాలకు ఘర్షణబయటపడుతుంది

సింహమూ - రాబందూ

బ్రిటన్‌కుచిహ్నం సింహం, అమెరికాకు చిహ్నం రాబందు. తమకంటె చిన్నవాటిని సింహమూ - రాబందూ చంపుతాయి. ప్రపంచాన్ని జయించి తమ ప్రాబల్యాన్ని నెలకొల్పాలనే ఉద్దేశ్యంతో, అముసలిసింహమూ దురాశాపీడితమైన ఈ రాబందూ కలిస్తే కలియవచ్చు. కాని, వాటి దృక్పథాలు వేరు. సింహానికి దానిగుహలో అది జీర్ణించుకోలేనంత ఆహారంవుంది. కాని, వృద్ధాప్యంవల్ల సింహం వంజాలు పనిచేయడంలేదు.

దాని దోపిడికి గురిఅయినవన్నీ చుట్టూ తిరగబడుతున్నాయి. సింహం ఆ తిరుగుబాట్లను అదుపులో పెట్టలేకపోతోంది. శక్తి ఉడిగిపోతున్న సింహం రాబందు ముక్కువంక గోళ్ళవంక ఆశతో చూస్తోంది. కాని, రాబందు సింహపుగుహలోచిదేగాక మొత్తం అడవినంతా గాలించి జయించాలని అనుకుంటూంది. సింహపుగుహలో శ్రేష్ఠతరమైన హారం ఉందని రాబందుకు తెలుసు అందుకనే సింహం గుహద్వారంవద్ద నిలబడి రాబందు తలుపు తట్టుతోంది.

గుహలో హారాన్నంతా గుత్తకొని ద్వారం వద్ద కట్టిన అడ్డుగోడలను తొలగించమని సింహాన్ని రాబందు కోరుతోంది. అలా తొలగించకపోతే తన మైత్రి ఉండదని బెదరించుతోంది: యావత్తు ఆరణ్య ఆధిపత్యానికి తాపత్రయ పడుతున్న రాబందు, శరీరంలో దాసత్వం ఉడిగిపోయిన సింహాన్ని కోరిన షరతులేమిటి? బ్రిటన్ సామ్రాజ్యములో తమ పెత్తనం కావాలన్నారు. సామ్రాజ్య వర్తకంలో అర్థంకు ఉండగూడదని అమెరికా కోరుతోంది. అంతేగాక బ్రిటిష్ స్టెర్లింగ్ నిల్వలపై అమెరికా దాడి చేస్తోంది. దక్షిణ అమెరికా విషయము యీ రెండింటికి గల వైరుధ్యం సుస్పష్టమే. ముఖ్యంగా యిటీవల అర్జంటైనా వర్తక వ్యాపార విషయాలలో యిది బయటపడింది. యూరప్‌లో, మధ్యధరాసముద్రంలో, పడమటి ఆసియా ఖండంలో ఈ వైరుధ్యాలు స్పష్టంగా కన్పడుతున్నాయి. ఉదాహరణకు ఇటీవల పశ్చిమ జర్మనీ విషయంలో బ్రిటన్ - అమెరికాల వైరుధ్యం కన్పించుతోంది. బ్రిటన్ తమ కీలుబొమ్మలయిన సోషల్ - డెమాక్రేట్లను బలపర్చితే, అమెరికా తమ కీలుబొమ్మలయిన కాథలిక్‌లను బలపరచింది.



యుద్ధంలో ప్రథమ కబళంగా ఉపయోగించాలని చూస్తోంది.

సైనికంగా - రాజకీయంగా స్నేహం ఆర్థికంగా ఘర్షణ

మాంట్‌గోమరీ, ఐసెన్ హోవర్‌లు అమెరికాలో సమావేశమై, బ్రిటిష్, అమెరికా సైన్యాలను కలిపివేయాలని ప్లానులు వేయవచ్చు. నూతన ప్రజాతంత్ర యూరప్‌యొక్క సోవియట్‌యొక్క పురోగమనాన్ని ఆపడానికి; పోట్సడం, క్రైమియా నిర్ణయాలను ఉల్లంఘించడానికి; అభివృద్ధి నిరోధక శక్తుల్ని కొత్తరూపం దాల్చిన ఫాసిజాన్ని రక్షించడానికి; తూర్పు యూరపులో సోషలిజానికి వ్యతిరేకమైన కోటగోడగా, పశ్చిమ జర్మనీలో గుత్తవ్యాపార ప్రాబల్యాన్ని తిరిగి నిర్మించడానికి; తమ తమ కీలుబొమ్మలతో గూడి పారిస్ శాంతి సమావేశంలాంటి వాటిలో లాడేల్ హార్డీలు (కరటకదమనకుల) లాగా బైరన్సు-బెవిన్‌లు ఐక్యంగా నడవవచ్చు. కాని బ్రిటన్ - అమెరికాల వైరుధ్యాలు ఈ క్రింది విషయాలలో స్పష్టమవుతున్నాయి. బ్రిటన్‌కు అమెరికా యిచ్చిన ఋణం విషయమై జరిగిన చర్చల్లో కొందరు అమెరికా శాసనసభ్యులు

మధ్యధరా సముద్రంలో అమెరికా తన యుద్ధనౌకలను ప్రదర్శించితే, బ్రిటన్‌కూడా దానికి ‘జవాబు’ గా తన నౌకలను ప్రదర్శించింది. (ఒకప్రక్క ఇవి తమతమ బలాబలాల్ని పోటీగా ప్రదర్శించుతూ, మరోప్రక్క, మధ్యధరాసముద్ర తీరంలోని ప్రజాప్రభుత్వాలను బెదరించాయి.) పడమటి ఆసియా ఖండంలో పెట్రోల్ విషయంలో ఈరెండింటికి తగదా ఉండనేవుంది.

ఓటమిలేని ప్రజాతంత్రయూరప్

నాజీజాన్ని కూలద్రోసిన యూరోపియన్ ప్రజలు, బ్రిటిష్, అమెరికాల పెత్తనాన్ని ఏమాత్రమూ అంగీకరించ సిద్ధంగాలేరు. 1918-39 లలో లాగ ఇపుడు సోవియటు ఒంటరిగా వేరుపడిలేదు. యూరప్‌లో కొత్తగా తలయెత్తిన ప్రజాతంత్రరాజ్యాలు సోవియటు యూనియనుతో సన్నిహితసహకారాన్ని నెలకొల్పాయి. పారిస్ శాంతిసమావేశంలో ప్రపంచశాంతిని నిలబెట్టడంకోసం, అన్ని దేశాల ప్రజల స్వాతంత్ర్య హక్కులకోసం, ఈదేశాలు అత్యద్భుతంగా, విసుగు లేకుండా పోరాడుతున్నాయి. అమెరికాఇచ్చే అంత్యపందేశాల బెదిరింపుకు లొంగకుండా యుగోస్లావియా గట్టిగా ఎదురునిలబడింది. యుగోస్లావియాపై అమెరికా విమానదళాలు దాడిచేసి తిరగడాన్ని యుగోస్లావియా బయటపెట్టింది. యుగోస్లావియాలో కూలిన అమెరికా విమానాలలో ఒక్క గూఢచారి ఉండటం, అతడు రహస్యపత్రాలతో పట్టుబడటం, జరిగింది. వీటితో అమెరికా లోకమెరిగింది. తమ బెదిరింపులను ఉపసంహరించుకుంది.

ఇతర దేశాలతో బేరం

స్వీడెన్ గుణపాఠం

సోవియట్‌తో దీర్ఘకాలపు వాయిదా అప్పుతో చేసుకొనే వర్తక ఒడంబడికను, బ్రిటన్ ఆపివేసింది. (ఈమధ్య బ్రిటన్ - సోవియట్‌ల మధ్య జరిగిన వర్తక ఒడంబడిక చాల కొద్దిది. అదే చాలా ఆలస్యంగా జరిగింది.) కాని స్వీడెన్ సోవియటుతో 5ఏండ్ల ఒడంబడిక చేసుకొంది. 3 కోట్లపౌనుల విలువగల వస్తువుల మారకపు ఒడంబడికనే గాక 7 కోట్ల ఋణఒడంబడికను కూడా చేసుకొన్నాయి. దీనిలో గర్వపోతు అమెరికా తిరిగి స్వీడెన్‌కు ఒక అంత్య పందేశం యిచ్చింది. ఈ ఒడంబడికను రద్దుచేసుకోమని స్వీడెన్‌ను కోరింది. స్వీడెన్ తన హుందాను నిలబెట్టుకుంటూ జవాబిచ్చింది. తమ స్వాతంత్ర్యంలో జోక్యం కలుగజేసుకొంటే సహించమని ప్రపంచ నియంతృత్వాన్ని ఆపేక్షించే అమెరికాకు చక్కని జవాబు చెప్పింది.

డాలర్ నియంతలకు (అమెరికా సామ్రాజ్యవాదులకు) ఈచేదుమాత్ర మింగటం కష్టమైంది. ‘న్యూ యార్కు హెరాల్డు ట్రిబ్యూన్’ స్వీడెన్ యిలాఅనుకొంటున్నట్లు వ్రాసింది. "యుద్ధానంతర ఆర్థిక సంక్షోభాన్ని అమెరికా పరిష్కరించగల్గుతుందనే నమ్మకం స్వీడెన్‌కు లేదు. సోవియటుతో ఒడంబడిక చేసుకోడంతో భవిష్యత్తులో స్వీడెన్ ఆర్థిక మాంద్యపు దెబ్బను తట్టుకోగలదు. ప్రపంచ ఆర్థిక సంక్షోభపుదెబ్బ సోవియటుకు తగలదు."

స్వీడెన్ గుణపాఠాన్ని బ్రిటిష్ ఆర్థిక పరిపాలనావేత్తలు గ్రహించితే బాగుండును. సోవియట్, ఫ్రాన్సు, స్వీడెన్, డెన్మార్కు, హంగరీ, జెకోస్లొవేకియా, బల్గేరియా, మొదలగు యూరప్ దేశాలతో ఆర్థిక ఒడంబడికలు చేసుకొంది. అమెరికా పెనుతుపానునుండి రక్షించుకోడానికి యూరప్‌లో రక్షణకుడ్యాలను నిర్మించుకుంటున్నారు. కాని బ్రిటన్‌మాత్రమే "స్వేచ్ఛావర్తకం" పేరుతో, అమెరికాతోకకుముడిపడికూర్చుంది.

సామ్రాజ్యవాదం నశించిందా?

"బ్రిటిషు సామ్రాజ్యవాద విధానాన్ని" వాలెస్ విమర్శించినందుకు బ్రిటిష్ పత్రికలు, —టోరీ పత్రికలు మొదలుకొని లేబర్ పార్టీ పత్రికలవరకు, ఒక్కసారి మండిపడ్డాయి.

మేము ఇండియాకు స్వతంత్రం ఈయలేదా? ఈజిప్టును స్వతంత్రం చేయబోవడం లేదా? వలస దేశాలన్నిటికీ - అవి స్వతంత్రానికి ఎంతవరకు తగిఉంటాయో అంతవరకు మేము స్వతంత్రం ఇయ్యలేదా? అని ఈ పత్రికలు ప్రశ్నించాయి. నిజమాదితే విడ్డూరమే. ఏ దేశంవెళ్ళినా అభ్యుదయాన్ని కోరే ప్రతివ్యక్తి మనల్నిప్రశ్నలడుగుతున్నారు:

"ప్రపంచమంతటా సాయుధ సేనలబలముతో, సామ్రాజ్యవాదాన్ని కాపాడుకొనే బెవిన్ విధానాన్ని బ్రిటిషు కార్మికవర్గం ఇంకా ఎన్నాళ్లు సహించుతుంది?"

బ్రిటిష్ సాయుధ సైన్యాలు ప్రపంచమంతటా చేస్తున్న పనులను ప్రపంచం చూస్తోంది. ఒక్క మాజీ శత్రుదేశాలలోనే గాక, గ్రీస్, వైట్రెన్, పాలస్తీనా, ట్రాన్స్‌జోర్డాన్, ఇరాక్, ఇండియా, బర్మా, మలయా, ఇండోనేషియాలలో బ్రిటిష్‌సైన్య కార్యకలాపాలను గమనించుతున్న వారేమనుకొంటారు? ప్రపంచంలో అయిదవభాగాన్ని సైనికంగా ఆక్రమించుకోవడం అకరాలా సామ్రాజ్యవాదంఅని విర్ధారణకు వస్తారు.

(మిగతా 18 వ పేజీలో)

భారత తాత్కాలిక ప్రభుత్వానికి నిజమైన అధికారాలు లేవు

బ్రిటిష్ కార్మిక మంత్రుల సామ్రాజ్యవాద పంథా

(17 వ పేజీ తరువాయి)

ఇండియాలో బ్రిటిష్ సేనలు ఇంకా ఎన్నాళ్ళుంటాయి. అనే ప్రశ్నకు అధికార రీత్యా ఎట్టిజవాబులేదు. ఫలానా తారీకు వరకు ఉంటాయి; తర్వాత వచ్చేస్తాయి అనేహామీలేదు. అమత్య బెవిన్ భద్రతా సంఘంలో ఇరాన్‌ను గురించి ఎన్నో గంభీరోపన్యాసాలిచ్చారు. ఏదేశంలో నైనా విదేశసేనలు ఉంటే ఆట్టిదేశం యొక్క ప్రతినిధులతో స్వేచ్ఛగా రాజీ సంప్రతింపులు జరపడం అసంభవమని అతడు బల్లగుద్ది చేప్పేవాడు. ఇదితన "ముఖ్యసూత్రాలలో ఒకటి" అనేవాడు. కాని, బెవిన్ తన "ముఖ్యసూత్రాన్ని" ఇండియాకు ఎందుకు వర్తింపజేయడో, భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం ఇవ్వబడిందనే మాట వట్టిబూటకం.

తాత్కాలిక ప్రభుత్వానికి నిజమైన అధికారాలు లేవు

నెహ్రూ వైస్రాయి కార్యనిర్వాహక వర్గానికి ఉపాధ్యక్షుడుగా నియమింప బడినమాట నిజమే. ఇంకా చాలమంది కాంగ్రెసు నాయకులు వైస్రాయి కార్య నిర్వాహక వర్గంలో సభ్యులుగా నియమింపబడ్డారు. కాని, ఎట్టి పరిస్థితుల్లో, బ్రిటిష్ ప్లానును నిర్నిబంధంగా అంగీకరిస్తున్నామని ఒప్పుకున్న తరవాత, ప్రజాతంత్ర సూత్రాలకు విరుద్ధమైన అనేక షరతులకు లోబడి పనిచేస్తామని అంగీకరించిన తరవాత, రాజ్యాంగ వ్యవహారాలన్నింట్లోను వైస్రాయికి సర్వాధికారాలు ఉంటాయి. వైస్రాయి తన వీటోఅధికారాన్ని సాధారణ పరిస్థితుల్లో ఉపయోగించనని "పెద్దమనిషి హోదా"లో వాగ్దానం చేసినప్పటికీ, యదార్థ పరిస్థితుల్లో మార్పేమీ ఉండదు. బలవంతంగా బ్రిటిష్ ప్రభుత్వం భారతీయుల మీద ఒక పాదుషాహానాన్ని రుద్దింది. భారత జాతీయనాయకులు దాన్ని ఆపదాటకుండా అమలుజరుపుతున్నారు. ఇక వీటో అధికారాన్ని ఉపయోగించవలసిన అవసర మేముంది; ఒకవైపు బ్రిటిష్ సైనికులు, పోలీసులు భారత ప్రజలమీద తుపాకులు కాలుస్తుంటే, భారత జాతీయనాయకులు తామే అందుకు బాధ్యతఅంతా తీసుకుంటున్నారు. ఒకవేళ ఎప్పుడైనా వైస్రాయికి, ప్రభుత్వ సభ్యులకూ మధ్య తీవ్ర భేదాభిప్రాయాలువస్తే, 5 నిమిషాల్లో వైస్రాయి వారిని డిస్మిస్‌చేసి, తమ కిష్టమైన వారిని నియమించవచ్చు.

భారతదేశ సర్వసేనాని ఇండియా ప్రభుత్వానికి జవాబుదారీ వహించరు. లండన్‌లోఉన్న బ్రిటిష్ ప్రభుత్వానికే జవాబుదారీ వహిస్తారు. హిట్లర్ ఇంగ్లండును జయించాడనుకుందాం. ఒక నాజీ గవర్నర్ జనరల్ క్రింద అట్లీ ఉపాధ్యక్షుడుగా నియమింపబడ్డాడనుకుందాం. లక్షలాది జర్మన్ సేనలు ఇంగ్లండ్‌లో ఉన్నాయనుకుందాం. అలాంటి పరిస్థితి ఏర్పడితే, తమకు హిట్లరు స్వాతంత్ర్యం ప్రసాదించినట్లు బ్రిటిష్ ప్రజలు సంతోషం ప్రకటిస్తారా?

బ్రిటన్‌కు ఇండియా కీలకప్రదేశం

ఇండియానుంచి బ్రిటిష్ సేనలు ఫలానా తేదీలోగా వైదొలగుతాయనే హామీ లేకపోవడం మాట అటుంచి. అసలు వైదొలగేసూచనే కనపడ్డంలేదు. మొన్న జూన్‌నెలలో (బ్రిటిష్ ప్లాను ప్రకటించబడినతరువాత) బ్రిటిష్‌వైమానికాధికారులు భారతదేశానికొక రహస్య సర్క్యులర్ పంపించారు. ఇండియాను కీలక ప్రాంతంగా తయారుచేయడానికి 1946 సంవత్సరాంతంలోగా 11 వైమానిక దళాలు, 1950 లోగా 18 వైమానిక దళాలు నిర్మింపబడ వలసిందని ఆ రహస్య సర్క్యులర్‌లో ఉంది.

ఇండియాకు సంపూర్ణ స్వాతంత్ర్యం ఇవ్వడం నిజమైతే, 1950 వ సంవత్సరంలోకూడా భారత వైమానికదళాలపై బ్రిటిషు మిలిటరీ అధికారుల పెత్తనం ఉంటుందని భావించే ధీమా ఎక్కడ్డించి వచ్చింది? రెండవ ప్రశ్న: 1950 లో ఇండియాలో 6 భారీ బాంబరు విమాన దళాలు ఎవరిమీద ప్రయోగించడానికి?

బ్రిటిష్ లేబరు మంత్రుల సామ్రాజ్యవాద పంథా

రెండు నెలలక్రితం హెర్బర్టు మారిసన్ న్యూయార్కులో అమెరికన్లఎదుట ఇలా ఉపన్యసించారు: "చాలకాలం నుంచీ మనం బ్రిటిష్ సామ్రాజ్యానికి మిత్రులం. ఇక ముందుకూడా మనం దానికి అంటిపెట్టుకొని ఉండాలి."

జూన్ (1940) నెలలో మారిసన్, నవాక్ దీవిని కలుపుకున్నందుకు సంతోషం ప్రకటిస్తూ, కామన్సుసభలో యిలా అన్నాడు: "బ్రిటిష్‌సామ్రాజ్యానికి మరో చిన్న దేశం కలుస్తోంది."

విదేశాంగ మంత్రి, బెవిన్, లోగడ పార్లమెంటులో ఉపన్యసిస్తూ, సోవియటు ప్రభుత్వం మధ్యధరాదేశాల వ్యవహారాలలో జోక్యం కలిగించుకోవటం అంటే అర్థం." బ్రిటిష్ సామ్రాజ్యం యొక్క గొంతుక కోయడమే" అని గర్జించాడు.

వీటినిబట్టి, బ్రిటిష్ లేబర్ మంత్రులు సామ్రాజ్యవాద పంథానే అవలంబిస్తున్నట్లు స్పష్టం అవుతోంది.

జనరల్‌స్మట్సు, ఒకవైపు బ్రిటిష్ సామ్రాజ్యం యూరోజాన లేనేలేదని ఢంకాలు వాయిస్తూ, మరోవైపు భారతీయులపట్ల, దక్షిణాఫ్రికా ప్రజలపట్ల, ఘోరమైన అపచారాలు చేస్తున్నాడు. కొన్నిజాతులు ఎక్కువ, కొన్నితక్కువ అనే సిద్ధాంతం లేవదీసి, తక్కువ జాతులనబడే వారిని కఠిన శాసనాలతో అవమానాలకు గురిచేస్తున్నాడు.

సైప్రస్‌లో పౌరసత్వహక్కులు శూన్యం

సైప్రెస్‌లో పౌరసత్వహక్కులు రద్దు అయి చాలకాల మయింది. బ్రిటిష్ కలోనియల్ ఆఫీసుయొక్క నిరంకుశ పాలనక్రింద సైప్రస్ ప్రజలు అణచ పెట్టబడి ఉన్నారు. ప్రపంచ ట్రేడ్ యూనియన్ ఫెడరేషన్‌లో బ్రిటిష్ ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసుతోబాటు, సైప్రస్ ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసుకు కూడా సభ్యత్వం ఉంది. అయినా, ఆ సంస్థలయొక్క నాయకులందరినీ (18 గురు) మొన్న జనవరి నెలలో (లేబర్‌పార్టీ అధికారంలోకి వచ్చాక) అరెస్టుచేశారు. ఒక్కొక్కరికి 12 మొదలు 18 నెలల వరకు కఠినశిక్ష విధింపబడింది. వారుచేసిన నేరం ఏమిటి? నిషేధింపబడిన సైప్రస్ ట్రేడ్ యూనియన్ కమిటీలో వారు సభ్యులట!

అంతేకాదు. సోషలిస్టుగ్రంధాలు దగ్గర ఉంచుకోవడం సైప్రస్‌లో ఒకపెద్దనేరం. వలస దేశాల ప్రజలు ఎప్పుడో ఒక రోజున యీ బ్రిటిష్ బూటకపు సోషలిస్టు నాయకుల్ని విచారణ చేయకమానరు. ప్రపంచ ప్రజలపట్ల వారుచేసిన ద్రోహానికి శిక్షించకమానరు.

సామ్రాజ్యవాద పాలసీయొక్క దుష్ఫలితాలు

ఈ విధంగా, ప్రపంచంలో అన్ని దేశాలలోను అభివృద్ధినిరోధక శక్తుల్ని గుత్తవ్యాపారస్తుల్ని బలపరచే సామ్రాజ్యవాద పంథా ఎక్కడికి దారితీస్తుందో ఆలోచించాలి.

బ్రిటన్— అమెరికా పాలకవర్గాలు ప్రపంచానికి అటంబాంబుచూపి భయపెట్టే విధానం, సోవియటుపైచేసే బెదిరింపులు ఎక్కడికి దారితీస్తాయి? మొదటిది: బ్రిటన్‌లో ప్రజాసామాన్యంకోరే పునర్నిర్మాణ కార్యక్రమం దెబ్బతింటుంది. రెండవది: ఇతర దేశాల ప్రజలు బ్రిటిష్ ప్రజలను ఏవగించుకుంటారు. అంతర్జాతీయ సహకారం అత్యవసరమయే రోజుల్లో బ్రిటిష్ ప్రజలపట్ల వ్యతిరేకభావం ఏర్పడుతుంది.

క్రమంగా ఈ విధానం మూడవ ప్రపంచ యుద్ధానికి దారితీస్తుంది.

సైనికుల సంఖ్య

యుద్ధానికి పూర్వంకంటె రెట్టింపు

అంతేకాదు. యుద్ధం ఆగిరయి సంవత్సరం అయిన తర్వాతకూడా అన్ని దేశాలలోను కలిపి 20 లక్షల బ్రిటిషు సేనలున్నాయి. (జూన్ లెక్కలు). వచ్చే జనవరి నాటికి 12 లక్షలకు తగ్గించాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది. కాని 1939లో ఉన్న బ్రిటిష్ సేనలకంటె 1947 లో రెట్టింపుకు పైగా ఉంటాయి; దేశ పునర్నిర్మాణంలో ఉత్సాహంగా పాల్గొనవలసిన వీరంతా; పరాయి దేశాల్లో యుద్ధాలుచేస్తూ ప్రాణాలు పోగొట్టుకోవడం దేనికి?

బ్రిటిష్ ప్రజల ఆర్థిక సమస్యలు

బ్రిటిష్ ప్రజల్నినేడు అతి క్లిష్టమైన ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నాయి. గుత్తవ్యాపారస్తుల గుప్పెట్లో బ్రిటిష్ ప్రజల ప్రాణాలు ఉన్నాయి. పెద్ద పెద్ద కంపెనీలు ఇదివరకెన్నడూ సంపాదించనన్ని లాభాలు సంపాదిస్తున్నాయి. క్రిందటి సంవత్సరం 1063 కంపెనీలు 26 కోట్ల 70 లక్షల పౌన్లు లాభంగడించినట్లు "ఎకానమిస్టు" పత్రిక తెలియజేస్తోంది. మరోవైపు కార్మికుల స్థితి నానాటికీ తీసికట్టుగా ఉంది. 1946 జనవరి వరకు 6 నెలల వరవ లెక్కలు చూస్తే, సగటున వారానికి 7 షిల్లింగుల 3 పెన్నీలు చొప్పున ప్రతి కార్మికుని కూలి తగ్గిపోయింది (1 షిల్లింగు యుద్ధకాలంలో 1 రూపాయతో సమానం.) అంతేకాదు, జీవితావసర వస్తువులధరలు ఇప్పటికీ పెరుగుతూనే ఉన్నాయి. నిరుద్యోగులసంఖ్య నానాటికి హెచ్చుతోంది. ఇప్పటికీ దాదాపు 3½ లక్షలమంది నిరుద్యోగులు బ్రిటన్‌లో ఉన్నారు. వీరుగాక యుద్ధరంగాలనుంచి తిరిగి వచ్చిన నిరుద్యోగ సైనికులు మరో 3½ లక్షలుంటారు.

బ్రిటిషు ప్రజల పోరాటదీక్ష

బ్రిటిష్ లేబర్ మంత్రులు యిప్పుడవలంబించే విధానం ప్రజాసామాన్యంలో తీవ్ర అసంతృప్తిని కలిగిస్తోంది. మార్పులు అవసరమని ఎలుగెత్తి చాటుతున్నారు. నిరుద్యోగుల సమస్యను అన్ని కార్మిక సంఘాలు తీసుకొని పని చేస్తున్నాయి. ఈ మధ్య బ్రిటన్‌లో ప్రారంభమైన యిండ్లులేని వారి ఉద్యమం, వ్యక్తుల ఆస్తికంటె ప్రజల ప్రాణాలకు ఎక్కువ విలువ యివ్వాలనే విషయం ప్రపంచం యెదుట పెట్టింది.

అంతేగాక, దేశంలో సమ్మెల వెల్లువ నానాటికి తీవ్రమవుతోంది. ప్రజలు లేబర్‌పార్టీ అభ్యర్థులకు వోట్లు యిచ్చి గెలిపించడంతోనే తమపని పూర్తికాలేదనీ, పోరాటం జరపాలనీ, తెలుసుకొంటున్నారు. శాంతిస్థాపనకు, అభివృద్ధికి, ఆర్థిక పునర్నిర్మాణానికి, స్వయంగా పోరాటాలలో పాల్గొంటున్నారు. ఈపోరాటాలు విజయవంతంగా కొనసాగడానికే కమ్యూనిస్టుపార్టీ కార్మికోద్యమంలోని అభివృద్ధి శక్తులు ప్రజల్ని సమీకరిస్తున్నాయి. అభివృద్ధి నిరోధకులెన్ని ఆటంకాలు కలిగించినా, ఏ కార్యక్రమం కోసం బ్రిటిష్ కార్మికులు తమ వోట్లు యిచ్చారో ఆ కార్యక్రమం నెగ్గడానికి కృషిచేస్తున్నారు.

ప్రజాప్రభుత్వం చేయవలసిన చట్టం కాదు

కార్మిక తగాదా బిల్లుపై యన్. యమ్. జోషి

న్యూఢిల్లీ, నవంబరు 1

ఢిల్లీ అసెంబ్లీలో ఈ రోజు కార్మికబిల్లును సెలెక్టు కమిటీకి పంపాలన్న తీర్మానం చర్చింపబడింది. బిల్లును వివరిస్తూ జగ్జీవన్‌రామ్ (ప్రభుత్వ కార్మిక సభ్యుడు) ఇలా అన్నారు.

"ఈ కొత్త బిల్లుప్రకారం, కార్మిక తగాదా పరిష్కారానికి రెండు సంస్థ లేర్పరుస్తాము. ఒకటి 'వర్క్సుకమిటీ', ఇందులో కార్మికుల యజమానుల ప్రతినిధులుంటారు. రెండోది 'పరిశ్రమలట్రిబ్యూనల్', ఇందులో హైకోర్టు జడ్జి యోగ్యతకలవారిని వేస్తాము.

"కార్మిక తగాదాలు యజమానులకు కార్మికులకు మధ్య సొంత వ్యవహారంకాదు, ఇందులో ప్రభుత్వ బాధ్యతుంది. అవసరమైతే ప్రభుత్వం విధిగా పరిష్కర్త తీర్పును కార్మికులు యజమానులు ఒప్పుకోవాలని చెప్పాలి.

"పరిశ్రమాభివృద్ధికి ముందు కార్మికుల పరిస్థితిని చక్కబరచాలి. అందుకు మేము తీవ్రంగా కృషిచేస్తాము."

తర్వాత ఈ బిల్లును సర్క్యులేషన్‌కు పంపాలని అహ్మద్‌జాఫర్ చెప్పాడు.

సంవత్సరంవరకు ఈ బిల్లును ఆపాలి

యన్. యమ్. జోషి ఈ బిల్లును సంవత్సరంవరకు ప్రజాభిప్రాయానికి పంపాలని ఒక సవరణతెచ్చి ఇలా ఉపన్యసించారు.

"నా సవరణ ఒప్పుకోకపోతే, ఈ బిల్లును నేను వ్యతిరేకిస్తాను. ప్రజా ప్రభుత్వం, ఇలాంటి బిల్లును తేవడం విచారకరం.

"సమ్మెలను చట్టవిరుద్ధం చేయడం, బలవంతంగా తగాదా పరిష్కరింపడం ఇవి రెండూ కార్మికులకు చాల బాధకలిగిస్తాయి. ఇవి ఇండియా రక్షణ చట్టంలో ఉన్నాయన్నమాట నిజమేకాని, ఆ చట్టం ప్రజాభిప్రాయానికి విరుద్ధంగా యుద్ధసమయంలో చేసిన చట్టం. కార్మికలోకంలో అశాంతి ఉన్నది. కాని అది పోవాలంటే, ప్రభుత్వం కార్మిక మోగక్షేమాలపై ఏమి కార్యక్రమం అవలంబించారు అని నేను ప్రశ్నిస్తున్నాను.

సమ్మెలు అతృప్తి చిహ్నాలు

"సమ్మెలు కేవలం కార్మికులేకాదు, అందరూ చేస్తారు. పరిస్థితులతో అతృప్తి చెందిన మనిషికి సమ్మె సహజమైన కార్యక్రమం.

"అతని కిష్టంలేకున్నా, జైలుకు పంపుతామని బెదిరించి, కార్మికునిచేత పనిచేయించడం, బానిసత్వాన్ని రుద్దడం కాకపోయినా, బలాత్కారాన్ని ప్రయోగించడమే అవుతుంది.

"ఇక ప్రభుత్వం ప్రజోపయోగమైనవని అనే నిర్వచనం చేసింది. ఇది సరికాదు. ప్రజలకు పరమైన పరిశ్రమలు మాత్రమే ఆ వర్గంలోకి వస్తాయి.

"ఈ బిల్లు చాల పక్షపాతంతో కూడుకొన్నది. ప్రభుత్వం జోక్యం తీసుకుంటామంటే సరేగాని, కార్మికులకు మొదలు తమకున్న బాధ్యతలనుకూడ వారు గుర్తించాలి."

బిల్లు వాయిదా

ఈ సమయంలో ప్రభుత్వం, బిల్లును సెలెక్టుకమిటీ చర్చించవలసిన కాలపరిమితిని 1946 నవంబరు 7 తేదీనుండి 1947 ఫిబ్ర వరి 1-కి పొడిగించామని ప్రకటించింది. మనిబెన్‌కారా జోషి సవరణ బలపరచింది.

బాలకృష్ణశర్మ (కాంగ్రెసు) మాట్లాడుతూ, జోషి ఏదో పార్టీబలవంతంమీద బిల్లును ప్రతిఘటిస్తున్నారన్నాడు. జోషిగారు అడ్డువచ్చి తాను కార్మికుల వర్గానికి మాత్రమే సంబంధించిన వాదనన్నారు.

ఇంకా చర్చ ముగియకముందే సభను సోమవారానికి వాయిదావేశారు.

దక్షిణాఫ్రికా సత్యాగ్రహాన్ని నైతికంగా బలపరుస్తున్నాం

నెహ్రూ జవాబు

న్యూఢిల్లీ, నవంబరు 1

నేడు ఢిల్లీ అసెంబ్లీలో ప్రశ్నోత్తర సమయంలో, దక్షిణాఫ్రికా సత్యాగ్రహవిషయమై పండిత నెహ్రూ ఇలాసమాధాన మిచ్చాడు.

"దక్షిణాఫ్రికా సత్యాగ్రహం ప్రారంభమైననప్పటినుండి, భారతప్రభుత్వం ఆఉద్యమాన్ని నైతికంగా బలపరుస్తున్నది. ఇప్పటికీ ఆ ఉద్యమం సాగుతున్నది.

"సెప్టెంబరు ఆఖరువరకు శిక్షితులైన భారతీయుల సంఖ్య 733 శిక్షాకాలం పూర్తిచేసి అప్పుడే 450 మంది విడుదలయ్యారు. సామాన్యంగా ఒకనెల శిక్ష, 3 పౌనులు జరిమానా సత్యాగ్రహులకు వేస్తూవచ్చారు. రెండోసారి సత్యాగ్రహంలో పాల్గొన్నవారికి మూడు నెలలు. కొందరు నాయకులకు 6 నెలల్లుకూడ శిక్షలు పడ్డాయి.

"అక్టోబరు 24 న వచ్చినతంతి ప్రకారం అప్పటికి మొత్తం అరెస్టులు 1,269. మిత్రరాజ్యసమితి ముందు దక్షిణాఫ్రికా సమస్య చర్చకువచ్చిన 23 వ తేదీ 323 గురు సత్యాగ్రహం చేశారు. కొందరు ఉద్యమాన్ని అపాలనిచూచినా మొత్తం భారతీయులంతా ఉద్యమాన్ని బలపరుస్తున్నారు. ఆఫ్రికాజాతివారుకూడ ఇప్పుడుసానుభూతిచూపుతున్నారు. కొందరు యూరపియన్లు కూడ ఉద్యమంలో పాల్గొన్నారు. స్త్రీలు చాల ప్రధాన పాత్ర వహిస్తున్నారు.

"భారత ప్రభుత్వం ప్రత్యక్షంగా సాయం పంపలేదు. కాని మిత్రరాజ్యసమితిలో ఈ విషయమై పని చేస్తున్నాము."

సత్యాగ్రహ ఖైదీలు బాధపడుతున్నట్లు తెలుస్తున్నదని కూడ నెహ్రూ చెప్పాడు.

అటం పరిశోధన

పరమాణు పరిశోధన కమిటీని ఏర్పరచినట్లు ఒక ప్రశ్నకు ప్రభుత్వ కార్యదర్శి సమాధానమిచ్చాడు. అటంశక్తిని ప్రజోపయోగార్థం వినియోగించాలనే ఉద్దేశమని చెప్పారు.

పంజాబులో రాజకీయ ఖైదీలు నిరహారవ్రతం మానారు

ఫెరోజ్‌పూర్, నవంబరు 1

ఫరీద్‌కోట సంస్థానంలో జైలు అధికారులు పెడుతూవున్న ఇబ్బందులకు నిరసనగా, జైలులోవున్న రాజకీయఖైదీలు అక్టోబరు 30 నుండి నిరాహారవ్రతం చేస్తూన్నారు. వారి కోర్కెలను అధికారులు అంగీకరించడంవల్ల నేడు వారు తమ ఆహారాన్ని తిరిగి స్వీకరించారు.

ఆయుధ పరిమితి ఫ్రాంకో సమస్య

మిత్రరాజ్యసమితిలో చర్చ

న్యూయార్కు, నవంబరు 1

ఆయుధబలాలకు పరిమితం చేసుకోవడం, అటం ఆయుధాలను నిషేధించడం గురించి మొలటావ్ ప్రతిపాదించిన తీర్మానం, మిత్రరాజ్య సమావేశ కార్యక్రమ నిర్ణయసంఘంలో నిన్న చర్చకువచ్చింది. దీనిని సమావేశ కార్యక్రమంలో చేర్చాలనీ, మిత్రరాజ్య రాజకీయ, భద్రతా కమిటీలకు దీనిని పంపగింపవలసిందిగా సమావేశానికి సలహా ఇవ్వాలనీ ఏకగ్రీవంగా అంగీకరించారు.

ఫ్రాంకో ప్రభుత్వంపట్ల ఎలాంటి చర్య తీసుకోవాలి అన్న అంశాన్నికూడా కార్యక్రమంలో చేర్చాలావద్దా అన్న విషయంపై తీవ్రచర్చజరిగింది. ఈ అంశాన్ని నామకః కార్యక్రమంలో ఉంచాలనీ, కాని ముందుగా దీనిని రాజకీయ కమిటీ ఎదుట పెట్టాలని, చివరకు అందరూ అంగీకరించారు.

యుద్ధోన్మాదులపై మాన్విలిస్కీ ఖండన

నిన్న జనరల్ అసెంబ్లీ సమావేశంలో యుక్రైన్ ప్రతినిధి మాన్విలిస్కీ మాట్లాడుతూ యుద్ధోన్మాదులను తీవ్రంగా ఖండించాడు.

"ప్రపంచం అంతటిపైనా పెత్తనంసంపాదించాలని కొందరు గుటకలు వేస్తున్నారు" అని అన్నాడు. వీటో అధికారంపై సాగుతూన్నదాడి వీరిసన్నాగమేఅన్నాడు. అభివృద్ధి నిరోధక పత్రికలు, అర్థం ఆపూ లేకుండా, వీటో వ్యతిరేక ప్రచారం సాగించడాన్ని పేర్కొంటూ ఇలా అన్నాడు; "ఈ ప్రచారం మహా స్వేచ్ఛగా సాగుతూంది. కాని ఇలాంటి ప్రచారమే ఫాసిజానికీ, తుదకు మొన్నటి భయంకర యుద్ధానికీ దారితీసిందన్న విషయాన్ని మరచిపోవద్దు. ఈ నాడు చాలా మంది రాయబారులు, మిలిటరీ నిపుణులు ఇంకా అనేకులు మూడవ యుద్ధాన్నిగురించి జోస్యం చెబుతున్నారు. ఇలాంటి మాటలు అగ్రరాజ్యాలమధ్య కలతలకు దారితీస్తాయి. మిత్రరాజ్యసమితిని బలహీనంచేసి బాధ్యతారహితంగా ప్రవర్తిస్తున్న చర్చిల్‌లాంటివారిని బలపరుస్తాయి.

"ఈనాడు భద్రతాసంఘంలో న్యాయమైన ప్రతిపాదనను ఆంగ్లో అమెరికన్ దేశాలు, వోట్ల సంఖ్యాబలంతో ఓడించడానికి ప్రయత్నిస్తున్నారు. కాబట్టి న్యాయాన్ని కాపాడాలంటే వీటో అధికారం ఉండాలి." అని అన్నాడు.

ఇండియా ప్రతినిధులకు సోవియట్ సహకారం

దక్షిణాఫ్రికా సమస్యను గురించి చెబుతూ ఇలా అన్నాడు:

"దక్షిణాఫ్రికా భారత సమస్యను మనం చర్చించబోతున్నాం. స్వయంనిర్ణయ సూత్రాన్ననుసరించి జాతులసమస్యను జయప్రదముగా పరిష్కరించిన సోవియటుయూనియన్ ఈ విషయంలో భారతీయులను బలపరుస్తుందని వేరే చెప్పనక్కరలేదు."

మాన్విలిస్కీ ఉపన్యాసంతో మహాసభ ఇప్పటికి ముగిసింది. ఇక వివిధ కమిటీల పని ప్రారంభమవుతుంది. దక్షిణాఫ్రికా సమస్య రాజకీయ న్యాయశాస్త్ర కమిటీల ఎదుట పెట్టబడింది.

బ్రిటన్ సలహాపై స్మట్సు తన ఉపన్యాసం మానుకున్నాడు

స్మట్సు తనఉపన్యాసం మానుకున్నారు. బ్రిటన్ సలహామీదనే ఇలా చేశాడని "డి. యం." అనే అరబ్బీ పత్రిక బయటపెట్టింది. "సామ్రాజ్యతత్వాల మధ్య చీలిక ఉన్నట్లు సోవియటులు ముందు కనబడకూడదు. కాబట్టి ఉపన్యాసం మానుకో," అని బ్రిటన్ సలహా ఇచ్చింది.

ఫ్రాంకోతో తెగతెంపులు చేసుకోవాలి

న్యూయార్కు, నవంబరు 1

పోలిష్ విదేశాంగమంత్రి, మిత్రరాజ్యసమితి కార్యదర్శికి ఫ్రాంకో స్పెయిన్‌తో తెగతెంపులు చేసుకోవాలని కోరతీర్మానాన్ని అందజేశారు.

రాచరిక ప్రభుత్వాన్ని నెలకొల్పడానికి బైరన్సు కుట్ర

లండన్, అక్టోబరు 31

స్పెయిన్‌లో చట్టబద్ధమైన రాచరికాన్ని ప్రవేశపెట్టడానికి ఒక ప్లానును బైరన్సు బలపరచుతాడట. డాన్ జవాన్ చక్రవర్తిగా ఉంటాడట. మితవాద సోషలిస్టు నాయకుడు ప్రీటో నాయకత్వాన ప్రభుత్వం ఉంటుందట. అంటే పేరుకు ఫ్రాంకోప్రభుత్వం తొలగినా, పరిపాలనలో మార్పురాదన్నమాట.

డార్డనెల్సు సమస్య

అంతర్జాతీయ సమావేశమే చర్చించాలని టర్కీ అధ్యక్షుడు

అంకారా, నవంబరు 1

టర్కీ అసెంబ్లీ సమావేశాన్ని ప్రారంభిస్తూ, టర్కిష్ అధ్యక్షుడు ఇనెనూ డార్డనెల్సు విషయం ప్రస్తావించాడు. బ్రిటన్‌తో టర్కీ స్నేహమూ, సహకారమూ నానాట వృద్ధిచెందుతోంది. అమెరికాతో కూడ స్నేహసంబంధాలు పెంపొందుతున్నాయి. పొరుగుదేశమయిన ఈజిప్టుపట్ల స్నేహమూ, పరస్పర విశ్వాసభావమూ టర్కీ ప్రకటించుతోంది. టర్కీ స్వాతంత్ర్యానికి భంగంకావిపక్షంలో డార్డనెల్సుసమస్యను అంతర్జాతీయ సమావేశం చర్చించితే, ఇదివరకటి మాంట్రో ఒడంబడికకు సవరణలను అంగీకరిస్తాం అంటూ ఇనెనూ, వెనుకటివాదనే తిరిగి చెప్పాడు. సోవియటుతో మైత్రి నిరాకరించాడు. యుద్ధకాలంలో తాము మాంట్రో ఒడంబడికను సరిగానే అమలు పరచామని, అక్షరాజ్యాలపట్ల సుముఖత చూపలేదని ఇనెనూ అన్నాడు. అలాఅని బుజువుచేసుకోడానికి ఏ వరో 'మధ్యవర్తి' తీర్పుకు తానంగీకరిస్తాడట. టర్కీ అక్షరాజ్యాలతో కుట్రచేసినట్లు బుజువుచేస్తూ, సోవియటు కొన్నిపత్రాలను ఇదివరకు బయటపెట్టిన సంగతి పాఠకులకు జ్ఞప్తికి తెస్తున్నాం.

డాన్యూబ్ సమావేశం

సోవియటు హాజరుకాదు

న్యూయార్కు, అక్టోబరు 31

డాన్యూబ్‌నది ప్రవహించుచున్న దేశాలేగాక, ఎన్నో వందలమైళ్ళలోనున్న బ్రిటన్ అమెరికాలు, తమకుగూడ ఆనదిలో హక్కులు కోరుతున్నాయి. డాన్యూబ్‌నదీ సమస్య పరిష్కారానికంటూ, ఆ నదీతీర దేశాలకు సంబంధంలేకుండానే, మిత్రరాజ్యసమితి ఒక సమావేశాన్ని ఏర్పాటుచేయబోతోంది. వివిధ దేశాలకు ఆహ్వానాన్ని పంపింది. బ్రిటన్, అమెరికాలు ఆహ్వానాన్ని అంగీకరించాయి. డాన్యూబ్ నదీతీర దేశాలేవిటకు అంగీకరిస్తే తామూ హాజరవుతానని ఫ్రాన్సు చెప్పింది. రష్యా, జెకోస్లోవేకియా, యుగోస్లావియాలు ఈ ఆహ్వానాన్ని తిరస్కరించుతూ, తామీ సమావేశానికి రామని తెలియజేశాయి.

సామ్రాజ్య దాస్యాన్ని తుదిముట్టించారు

ఉజ్వల స్వాతంత్ర్యాన్ని సాధించారు

మధ్య ఆసియా సోషలిస్టు రిపబ్లిక్‌ల ఆవిర్భావం



మోహన్ కుమార మంగళం

ఉత్తరాన, మనపొరుగునున్న మధ్య ఆసియా దేశాలు సోషలిస్టువ్యవస్థను స్థాపించు కొని, శాంతిసుఖాల ననుభవిస్తూ, దినదినాభి వృద్ధిపొందుతున్నాయి. ఒకప్పుడు, ఎంతో వెనుకబడివున్న ఈ ప్రాంతం సోషలిస్టు దేశంగా ఎలా మారింది?

జారు పాలనలో మధ్య ఆసియా ఒక వలసదేశంగా మాత్రమే ఉండేది. 1860-85 సంవత్సరాల మధ్య జారు చక్రవర్తులు ఈ ప్రదేశాన్నంతా ఆక్రమించారు. ఈ దురాక్రమణలో, ఇంగ్లీషు వారు ఇండియాలో అవలంబించిన పద్ధతులనే అనుసరించారు. టర్కిస్తాన్ మొదలైన కొన్ని దేశాలను నేరుగా తమపాలనక్రింద ఉంచుకున్నారు. బొఖారా, కీవా మొదలైన రాజ్యాలను ముక్క చెక్కలు చేసి, సారవంతమైన ప్రదేశాలను తమక్రింద; మిగిలిన భాగాలను ఇండియాలో లాగానే సంస్థానాధిపతులక్రింద ఉంచారు.

ఈ పాలనలో పరిస్థితులు మనదేశంలోని నేటి పరిస్థితుల్లాగానే ఉండేవి. భూమిలో అత్యధిక భాగం జమీందారులక్రింద ఉండేది. రైతులు వారికి ఊడిగంచేస్తూ ఉండవలసిందే. పండించేరైతుకుపొట్టకు సరిపడేంత మాత్రమే దక్కేది. మిగతా మొత్తం ఆ భూస్వామికి అర్పించుకోవలసిందే.

వివిధ జాతులను ఎల్లప్పుడూ దుర్బల స్థితిలో ఉంచడంకోసం బ్రిటిష్ సామ్రాజ్య వాదుల్లాగానే జారు చక్రవర్తులూ మధ్య ఆసియాలోని వివిధ ప్రజలను చీలదీసి (ఆంధ్రులను చేసినట్లు) కలగూరగంప రాష్ట్రాలను నిర్మించారు.

అసంతృప్తి - తిరుగుబాట్లు

ఇలాంటి పాలనలో ప్రజలెంత సుఖపడే వారో వేరే చెప్పనక్కరలేదు. పన్నులు నానాటికీ పెరిగిపోసాగాయి. చేతి పరిశ్రమలన్నీ మూలబడ్డాయి. ఆహార పంటలకు బదులు, ప్రత్తి మొదలైన వ్యాపార పంటల నెక్కువగా పండించ సాగారు. దానితో మధ్యఆసియా ప్రజలు పూర్తిగా రష్యా పెట్టుబడి దారులకు బానిసలయిపోయారు.

నానాటికి దుర్భరమై పోతూన్న ఈ పీడనను సహించలేక అక్కడి ప్రజలు, ప్రాణాలకు తెగించి తిరుగుబడ నారంభించారు. 1885, 1892, 93, 98 వ సంవత్సరాల్లో చిన్న చిన్న తిరుగుబాటులు జరిగాయి. ఈ తిరుగుబాటుల్లో అక్కడి ప్రజలే కాకుండా, పొట్టపోసుకోడానికి వలస వచ్చిన రష్యన్ కార్మికులు కూడా పాల్గొన్నారు.

1904 లో అక్కడి రష్యన్ రైల్వేకార్మికులు కార్మిక సంఘంగా ఏర్పడ్డారు. మధ్య ఆసియాలో మొట్టమొదటి విప్లవసంస్థ అదే. 1905 లో రష్యా అంతటా జరిగిన జనరల్ స్ట్రయికులో వీరుపాల్గొన్నారు.

1916 నాటికి దేశమంతటా విప్లవ చైతన్యం అత్యున్నత స్థాయికి వచ్చింది. మధ్య ఆసియా వెనుకబడలేదు. సామ్రాజ్య వాద యుద్ధరంగంలో బలిచేయడానికి జారు ఆ ప్రదేశాల్లో సైనిక సమీకరణ సాగించ బోయాడు. అక్కడి ఒకకోటి ప్రజల్లో, 80 లక్షలమంది దీనిని ప్రతిఘటించి అయిదు మాసాలపాటు పోరాడారు. ఈ ప్రతిఘటనను జారు సేనలు అణచివేశాయి. అప్పుడు సుమారు పదిలక్షలమంది సింకియాంగ్ రాష్ట్రంలోకి పారిపోయారు. మధ్యఆసియాలో సామ్రాజ్యప్రభుత్వ వ్యతిరేక ప్రజావిప్లవానికి ఈ పోరాటం పునాదులువేసింది.

1917 తిరుగుబాటు

తాత్కాలిక ప్రభుత్వ అసమర్థత

తరువాత 1917 ఫిబ్రవరిలో రష్యాలో విప్లవం బయలుదేరింది. వెంటనే దీనిప్రభావం మధ్య ఆసియా పైకూడా పడింది. టాష్కెంటు మొదలయిన ముఖ్యనగరాల్లో కార్మిక, సైనిక సంయుక్తసోవియట్లు (ప్రభుత్వాన్ని ప్రజావరంచేయడానికి ఏర్పడిన విప్లవసంస్థలు) ఏర్పడ్డాయి.

ఫిబ్రవరి తిరుగుబాటు ఫలితంగా ఏర్పడిన కెరెన్‌స్కీ తాత్కాలికప్రభుత్వం పరిపాలనా విధానంలో అర్థమార్పు తేలేదు. ఈప్రభుత్వ అధికారులుకూడా వెనుకటి జమీందార్లు, ప్రజాపీడకులద్వారానే పరిపాలన సాగించ నారంభించారు. అభివృద్ధినిరోధక రాజకీయ పార్టీలలోను, జమీందారీ సంస్థలలోను చేతులుకలిపారు.

బీదరైతులు, కార్మికులు, ప్రజాసామాన్యము దీనిని సహించలేకపోయారు. రష్యా అంతటా పొంగులు తీస్తున్న సోషలిస్టు విప్లవ వెల్లువ, ఇక్కడికికూడా సోకింది. బీద రైతులు, కార్మికులు 1917 మార్చిలో 'ఇత్తిఫాక్' (ముస్లిం కష్టజీవులసంఘం)అని ఒకసంస్థను స్థాపించారు. ఈసంస్థ మొదట్లో మితవాద సంస్థగా వున్నప్పటికీ, అక్కడ చిన్నచిన్న గ్రూపులుగావున్న కమ్యూనిస్టులతో సంబంధంపెట్టుకొని, క్రమక్రమంగా విప్లవపంథావైపు మొగ్గసాగింది.

విప్లవ పోరాటాలు

సెప్టెంబరులో ఈసంస్థ తరపున కమ్యూనిస్టులు నాయకత్వంవహించి బ్రహ్మాండమైన సమ్మెలు నడిపారు. ఆనెల 12వ తేదీనే టర్కిస్తాన్ రాజధాని అయిన టాష్కెంటులో స్థానిక సోవియటుఅధికారాన్నిహస్తగతంచేసుకొంది అంటే మాస్కోలో సోవియటు ప్రభుత్వం ఏర్పడకముందే, ఇక్కడ సోవియటు ప్రభుత్వాన్ని హస్తగతం చేసుకుందన్నమాట. కాని, కెరెన్‌స్కీ ప్రభుత్వం దీనిమీద ఎదురుదాడి చేసింది. నాలుగు రోజుల పోరాటం తరువాత టాష్కెంటు సోవియటును అణచింది. 1917 నవంబరులో కెరెన్‌స్కీ ప్రభుత్వం పూర్తిగాపడిపోయినతరువాతటాష్కెంట్‌లో స్థానికప్రభుత్వంపై శ్రమజీవులుమళ్ళా దెబ్బతీశారు. నాలుగురోజులు తీవ్ర పోరాటం తరువాత, అధికారం పూర్తిగా ప్రజల వశమయింది.

కాని, బొఖారా, కీవా నగరాల్లో జమీందారుల ప్రభుత్వాన్ని కూలదోయడానికి ప్రజలు నాలుగేళ్లు హోరా హోరీ పోరాడవలసి వచ్చింది. ఇతర ప్రదేశాల్లో ఓడిపోయిన అభివృద్ధి నిరోధక వర్గాలు జమీందారులు, చక్రవర్తి అనుచర సైనికాధికారులు ఈ జమీందారుల చుట్టూచేరి, వీరిని బాగా బలపరిచారు.

వీరు సోవియటు ప్రభుత్వంపై హద్దూ పద్దూలేని దుష్ప్రచారం సాగించారు. ముస్లిం మతానికది గర్భశత్రువన్నారు. అదంతా సైతానులమూక అన్నారు. తమ ప్రదేశంలోకి నిజమయిన వార్తలను రానీయకుండా ఒక ఇనుపతెర వేశారు.

టాష్కెంటులో అధికారాన్ని హస్తగతం చేసుకున్న సోవియటు ప్రభుత్వ సంస్థ చాల తెలివితేటలతో పనిచేసింది. దేశ కాలపరిస్థితులనాలోచించకుండా విప్లవవ్యవస్థస్థాపితం కాజాలదని గుర్తించారు. సాంప్రదాయసిద్ధంగా జమీందారుల మలగుపువుల అధికారం(?) ఉంచే రైతులకున్నశక్తిని ఒక్కసారి తుడిచిపెట్టలేమని గుర్తించి, వెంటనే జమీందారీ విధానాన్ని రద్దుచేయడానికి పూనుకోలేదు. పన్నుల భారాన్ని చాలా తగ్గించారు. రైతుసంఘాలను విరివిగా స్థాపించి, ప్రజాస్వామిక చైతన్యాన్ని కలిగించి, భవిష్యత్ విప్లవ కార్యక్రమానికి సిద్ధంచేయసాగారు.

ఆరోజుల్లోనే కామ్రేడ్ స్టాలిన్, ముస్లిం శ్రమజీవుల నుద్దేశించి ఒక సందేశం ప్రకటించారు. సోవియటు ప్రభుత్వంపట్ల ముస్లిం రైతులు మొదలైన వారికిగల అనుమానాలన్నిటిని అదిచెల్లాచెదరు చేసింది. దానితోపాటు, టాష్కెంటులో సోవియటు పాలన క్రింద రైతులు, ప్రజలు అనుభవిస్తున్న సుఖాలను గురించి వార్తలు బొఖారా, కీవాల్లోకి చొచ్చుకు పోసాగాయి. అక్కడ కొత్త సంచలనం ప్రారంభమయింది. బొఖారాలో ఒకకొత్తపార్టీ ఏర్పడింది. టాష్కెంటుతో ఇది సంబంధాలు పెట్టుకొంది.

నానాటికి ముంచుకొస్తున్న విప్లవ వెల్లువను అరికట్టడానికి బొఖారా, కీవా సుల్తానులు రష్యాల్లో విప్లవ వ్యతిరేక పోరాటం సాగిస్తున్న బ్రిటిష్‌సేనలసహాయం కోరారు కాని, ఎంతచేసినా లాభం లేకపోయింది. తీవ్ర పోరాటాలు సాగినతరువాత, ప్రజా ఉద్యమాలు 1920 లో, ఆ రెండుచోట్లా సుల్తానుల ప్రభుత్వాన్ని కూలద్రోశాయి.

స్వపరిపాలక రిపబ్లిక్కులు

ఈవిధంగా ఏర్పడిన బొఖారా, ఖోరెజ్మ (కీవా) సోవియటు రిపబ్లిక్కుల్లో సోషలిస్టు ప్రభుత్వాలేర్పడలేదు. సోషలిస్టు రష్యా వీటికి స్వయంనిర్ణయ హక్కు నిచ్చింది. దానిని అమలు జరిపి ఈ రెండూ, రష్యన్ సోషలిస్టు ఫెడరేషన్‌లో చేర నిరాకరించాయి. దానితో ఒడంబడికలుమాత్రం చేసుకున్నాయి. ఆ ఫెడరేషన్ వీటి స్వాతంత్ర్యాన్ని గుర్తించింది; వాటి అభివృద్ధికి సహాయాన్నీ ఇవ్వ అంగీకరించింది.

అవి మెల్లమెల్లగా అభివృద్ధిపొందుతూ, బలపడసాగాయి. టర్కిస్తాన్ రిపబ్లిక్కు, భూస్వామ్య విధానాన్ని రద్దుచేసి, భూమినంతటినీ రైతులకు పంచిపెట్టగల దశకు 1921 లోగాని రాలేదు. మిగిలిన మధ్య ఆసియా రిపబ్లిక్కులుకూడా, త్వరలోనే ఈ సంస్కరణ జరిపాయి. 1929 నాటికి మధ్య ఆసియా అంతటా భూస్వామ్య విధానం పూర్తిగా రద్దయింది. దానితో, మధ్య ఆసియాలో అభివృద్ధినిరోధకులకు స్థానం లేకుండా పోయింది. సోవియటు సోషలిస్టు ప్రభుత్వంతో సన్నిహితసంబంధం నానాటికి బలపడింది. ఆ ప్రభుత్వం కొత్త ఆసియారిపబ్లిక్కుల అభివృద్ధికి అన్నివిధాలా తోడ్పడింది. 1924 నాటికి, వెనుకబడిన మధ్యఆసియా, పడమటి ప్రాంతాలస్థాయి నందుకుంది.

సోవియటు యూనియన్‌లో చేరారు

1922 లో రష్యా, యూక్రెన్, బైలోరష్యా, ట్రాన్సుకాకేషియా రిపబ్లిక్కులు కలిసి సోవియటు యూనియన్‌గా ఏర్పడ్డాయి. ప్రజాపోరాటాలద్వారా అభ్యుదయ మార్గానికి వచ్చిన మధ్య ఆసియా రిపబ్లిక్కులు ఈ యూనియన్ తమకు సోదరతుల్యమని గుర్తించాయి. 1924 నాటికి ఇవికూడా అందులో చేరాయి.

వివిధజాతుల ప్రజలను చీలదీసి కలగూరగంప రాష్ట్రాలను నిర్మించి జారు చక్రవర్తులు చేసిన అన్యాయాన్ని రూపుమాపాలని ఈ ప్రజారాజ్యాలు దీక్షపూనాయి. జాతులనుబట్టి పరిహద్దు లేర్పరచడానికి పూనుకున్నాయి. తమ ప్రత్యేక సాంస్కృతిక జాతీయసాంప్రదాయాలలో దినదినాభివృద్ధి పొందుతున్నాయి.

ఈ విధంగా మధ్య ఆసియా సామ్రాజ్యవాదుల వలసదేశ పీడనను రూపుమాపి, ఆసియా చరిత్రలో నూతనశకాన్ని ప్రారంభించారు.

సోదర సోవియట్ ప్రజారాజ్యాల సహాయంతో తమ వ్యవస్థను నిర్మించుకున్నారు. రక్తమోడ్చి సాధించిన ఈమహత్తర విజయాలను కాపాడుకోడానికి నాజీ వ్యతిరేకపోరాటంలో సాటిలేని త్యాగాలకు కూడా వెనుదీయలేదు.

Edited, Printed & Published by Katragadda Rajagopalrao at the Prajasakti Press, Mogalrajapuram, Bezwada. Consulting Editor : M. Chandrasekhar Rao.

END OF ISSUE